

మార్చి ౬౮
జ్యోతి
ంబను
AAZAM ART
MADRAS
CHEPRASAD

"జలుబును పోగొట్టుటకు నేను విక్స్ వేపొరబ్‌ను నమ్ముకొంటాను"

" ఈమధ్య మా అబ్బాయికి ఎక్కువ జలుబు చేసి సులువుగా ఊపిరితీసుకోలేక పోయేవాడు. నేను వానికి ఎన్నో రకాల మందులను వాడేను. కాని వాటివలన ఏమీ తగ్గలేదు. అప్పుడు, విదేశాలనుండి తిరిగి వచ్చిన మా డాక్టరుగారి చిన్న అబ్బాయి గోపాలం విక్స్ వేపొరబ్ సీసాను యిచ్చి నన్నూ వాడమన్నాడు. పాపం, అతను మా యింట్లోకి వచ్చి దానిని మా అబ్బాయి ముక్కుమీద, గొంతుక మీద, ఛాతీమీద ఎలా రుద్దాలో కూడ చెప్పేడు. మర్నాడు ఉదయానికి మా అబ్బాయి జలుబు పూర్తిగా పోయి, హాయిగా ఊపిరి పీల్చుకొంటూ లేచేడు.


ఆ అనుభవము తరువాత, జలుబును పోగొట్టుటకు విక్స్ వేపొరబ్ మహా మంచి మందని నేను నమ్ము కొంటున్నాను. నేను ఎల్లప్పుడూ ఒక విక్స్ వేపొరబ్ సీసాను అందుబాటులో ఉంచుకొంటాను. "




5 గ్రాముల ఆకుపచ్చని డబ్బీలలో కూడ లభిస్తోంది.

532


వాడుటకు సూచనలు: విక్స్ వేపొరబ్‌ను వాడు పడుకోబోయేముందు రుద్దండి



దానిని వాని ముక్కుమీద, రెండు పైపులా రుద్దండి



....వాని గొంతుక మీద, ఛాతీమీద రుద్దండి



....వాని వీపు అంతటి మీద రుద్దండి. కంబళీ కప్పి పడుకోబెట్టండి

"జలుబును పోగొట్టుటకు మీరూ విక్స్ వేపొరబ్‌ను నమ్ముకోండి"

తొలిమాట

ఆమె కంఠం పలకని స్వరంలేదు; ఒప్పించని భావం లేదు; ఒలికించని రసం లేదు. మన లలిత సంగీత ప్రపంచంలో ఆమె ఒక ఫినామినన్. (53)

□

త్యాగమహిమ మాటల్లో వర్ణించ నలవికానిది. మానవులను అది మానవాతీతులుగా చేస్తుంది. (34)

□

నిజమైన ప్రేమ అందరికీ కలిగే సాధారణానుభవం కాదు. నూటికో కోటికో ఒకరికే కలుగుతుంది. (59)

□

ఒక A సర్టిఫికెట్ పగటికల లాంటి రాత్రి కథ (88)

□

చిన్న కథల పోటీలో పాల్గొన దలచిన విద్యార్థులు చూడవలసిన గమనిక (104)

యాజమాన్యం తదితర వివరాలు

"జ్యోతి"

ఫారం 4 (8 వ నిబంధన ప్రకారము)

ప్రచురణ స్థలం	:	విజయవాడ.
ఎంతకాలానికొకసారి	:	మాసపత్రిక.
ముద్రాపకుని పేరు	:	వి. వి. రాఘవయ్య
జాతి	:	భారతీయుడు
విలాసము	:	బకింగ్‌హాంపేట పోస్టు, విజయవాడ–2
ప్రకాశకుని పేరు	:	వి. వి. రాఘవయ్య
జాతి	:	భారతీయుడు
విలాసము	:	బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ–2
సంపాదకుని పేరు	:	వి. వి. రాఘవయ్య
జాతి	:	భారతీయుడు
విలాసము	:	బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ–2
పత్రిక యజమానులు	:	శ్రీమతి లీలావతి బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ–2

పై విషయాలు నాకు తెలిసినంతవరకు వాస్తవమైనవని తెలియజేయు చున్నాను.

విజయవాడ – 2
ది. 1—3—68.

(సం) వి. వి. రాఘవయ్య

సుచిత్ర మాసపత్రిక

బకింగ్‌హాంపేట పోస్టు
విజయవాడ–2

విడిప్రతి వెల
80 పైసలు

ఏడాది చందా
9-50 రూపాయలు

సంపుటి 6
మార్చి 1968
సంచిక 3

మేనేజింగ్ ఎడిటర్
వి. వి. రాఘవయ్య

ముఖచిత్రం :
అజమ్ ఆర్ట్సువారి
"తల్లిప్రేమ"లో దృశ్యాలు

రాజకీయాలు

లోటు బడ్జెట్! ఘాటు బడ్జెట్!

ఉప ప్రధాని, ఆర్థికమంత్రి శ్రీ మొరార్జీ దేశాయి తన 72వ జన్మదినోత్సవ సందర్భంలో దేశానికి సమర్పించిన కానుకలు 315 కోట్ల రూపాయల లోటు బడ్జెట్; కొత్తగా 66 కోట్ల రూపాయల మేరకు పన్నులు.

మన కాంగ్రెసు ప్రభుత్వాలకు చేతకాని పనుల్లో ఒకటి-వాగ్దానాలు చేయకుండా వుండడం. వాటివి కరుణార్ద్ర హృదయాలు. సామాన్యుల స్థితిగతుల్ని చూసి వాటి హృదయాలు ద్రవించిపోతాయి. అందుచేత వూరుకోలేక "మీ స్థితిగతుల్ని త్వరలోనే బాగు చేస్తాం. ఓపిక పట్టండి" అని వాగ్దానంమీద వాగ్దానం చేసేస్తూ వుంటాయి.

వాటికి చేతకాని పనుల్లో ఇంకొకటి - వాగ్దానాలను నిలబెట్టుకోవడం. కాంగ్రెసు ప్రభుత్వాలు చెప్పే మాటలకు, చేసే చేతలకు ఎక్కడా పొందిక లేదు.

లోటు బడ్జెట్ పద్ధతికి స్వస్తి జరుగుతుందని శ్రీ మొరార్జీదేశాయి వాగ్దానం చేసి ఒకఏడాది అయిందో లేదో. బ్రహ్మాండమైన లోటుతో కొత్త బడ్జెట్‌ను ఈ ఏడాది దేశానికి సమర్పించారు.

315 కోట్ల రూపాయల లోటు! ఇందులో కొత్త పన్నుల ఫలితంగా తగ్గేది పోగా నికరంగా, భర్తీకాని లోటు 290 కోట్లు! దీన్ని ఏదో విధంగా భర్తీ చేయాలి కదా? అంటే, డెఫిసిట్ ఫైనాన్సింగ్ వచ్చే సంవత్సరంలో (1968-69) కూడా తప్పదన్న మాట,

ఆర్థిక మంత్రి విధించిన కొత్త పన్నులు 66 కోట్ల మేరకు - ఎక్కువగా పరోక్షపు పన్నుల రూపంలో - వున్నాయి. ఇవి సామాన్య ప్రజలపై మరింత బరువు వేయబోతున్నాయి.

ఇందులో సుమారు 5 కోట్ల రూపాయలు తంతి, తపాలా రేట్లకు సంబంధించినది. పోస్టు కార్డు వెల సంఘంలో అట్టడుగు తరగతి మనిషితో సహా అందరికి అందుబాటులో వుండవలసిన సదుపాయం. అది అరు నుంచి పదిపైసలకు పెరుగుతుంది. ఇన్‌ల్యాండ్ కవరు 15 పైసలు, కవరు 20 పైసలు అవుతాయి. ప్రజలకు అత్యవసరం; ఉపయోగించక తప్పని సరి అయిన ఈ సౌకర్యాల ధరలను పెంచివేయడం దోపిడీ విధానం తప్ప మరేం కాదు.

శ్రీ దేశాయి బడ్జెట్‌ను వ్యాపారస్తులవర్గం మొత్తం పై సంతృప్తితోనే స్వీకరించింది.

ఆయన యిచ్చిన కొన్ని రాయితీలు, మినహాయింపులవల్ల పారిశ్రామికరంగం క్రమంగా పుంజుకోగలదని, పరిశ్రమలలోనికి పెట్టుబడులు ఇతోధికంగా రావడానికి అవకాశం కలుగుతుందని వ్యాపారస్తులు ఆశిస్తున్నారు.

ముఖ్యంగా కొన్నేళ్ళుగా తలనొప్పిగా తయారైన యాన్యూయిటీ డిపాజిట్ స్కీమును శ్రీ దేశాయి రద్దు చేయడం చాలమందికి సంతోషం కలిగిస్తుంది.

వచ్చే సంవత్సరం 'పునరుజ్జీవన' సంవత్సరం (ఇయర్ ఆఫ్ రివైవల్) కాగలదని శ్రీ మొరార్జీ దేశాయి ఆశ వెల్లడించారు. ఆర్థిక మంత్రులు సాధారణంగా 'ప్రొఫెషనల్ ఆప్టిమిస్టులు' అయివుంటారు. కనుక ఆయన మాటలను మనం పూర్తిగా విశ్వసించ నవసరంలేదు. ఈ సంవత్సరం వ్యవసాయరంగం మెరుగుపడినమాట నిజమే. ఉత్పత్తి పెరిగినందువల్ల కొన్ని వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టాయి.

వ్యవసాయ రంగంలోని ఉత్సాహకర పరిస్థితివల్ల పారిశ్రామిక రంగంకూడా పునరుజ్జీవనం పొందగల సూచనలు కనిపిస్తున్నాయి. నిజమే.

కాని, దీని ఫలితంగా ప్రధానంగా జరగవలసింది ధరల స్థిరీకరణ. వ్యవసాయ పారిశ్రామిక రంగాలలోని అభివృద్ధి ధరల నిలకడ రూపంలో సామాన్య ప్రజలకు అందుబాటులోనికి రావాలి. అయితే, శ్రీ దేశాయి ప్రతిపాదించిన పెద్దలోటు బడ్జెట్ ధరల స్థిరీకరణకు దోహదం చేస్తుందా?

భాషా సమస్య

సుమారు మూడు నెలల క్రిందట ప్రారంభమైన అధికార భాషా సంక్షోభం ఇప్పటికీ సద్దుమణగలేదు.

ఏమీ లేని చోట అధికార భాష సమస్య అంటూ ఒకదాన్ని కేంద్ర ప్రభుత్వం సృష్టించింది. కోతి పుండును బ్రహ్మరాక్షసిగా చేసింది.


చేతులు కాలిన తరవాత ఆకులు పట్టుకొనడం కేంద్రానికి అలవాటే. ఈ అలవాటునే ఇప్పుడు పాటిస్తానంటోంది.

భాషా సమస్యమీద దేశంలో


మా రంగుల చిత్రము

మా అనుభవపూర్వకమైన నిజమైన ఈ చిత్రములను ప్రవేశపెట్టియున్నాము. నిజమైన దానిని కనిపెట్టవలెనన్న మా రంగుల చిత్రమును చూడండి. ఈ చిత్రము ఇండియాలో అన్ని స్థలములలోను ప్రవేశపెట్టియున్నాము. 23-2-68 నుండి 7-3-68 వరకు హైద్రాబాదు ఎంబసీ, కమ్మం ప్రభాత్, కర్నూలు రాధాకృష్ణాలలోనూ, 8-3-68 నుండి 21-3-68 వరకు హైద్రాబాదు అజంతాలోనూ ప్రవేశపెట్టబడినది. మేము ప్రవేశపెట్టిన చిత్రములను చూడండి. ఆ స్నేహితుని చిత్రమును ఈ క్రింద ప్రచురించియున్నాము.

కె. భీమరాజు మద్రాసు



వాడుటకు పూర్వము



20 దినముల అనంతరము


నా స్నేహితుల ఆలోచన పూర్వకముగా మీ "జీవన్‌టోన్"ను 7 డబ్బాలు (70 దినములకు) వాడిన పిమ్మట నా బరువు 110 పౌనుల నుండి 165 పౌనుల వరకు హెచ్చినది. దానికి మిగుల కృతజ్ఞుణ్ణి. మీరు చెప్పినట్లు వాడుటకు ముందును వాడిన తరువాతను తీసిన చిత్రములను పంపియున్నాను.

జీవన్‌టోన్‌లో మాంసపుక్రొవ్వు చేరియుండుట వలననే మంచి పుష్టియు, బరువును యిచ్చుచున్నదని చెప్పబడుచున్నది. అది చాల పొరపాటు. దీనిలో మాంసపుక్రొవ్వు చేరివుండదు. మంచి విలువగల మూలికలు మాత్రము చేర్చబడినది. "జీవన్‌టోన్" వాడుటవలన తటాలున ఎక్కువ పుష్టియు, బరువును ఏర్పడుచున్నది. కాని అది ఆరోగ్యకరమైనది కాదని కొంతమంది చెప్పుచున్నారు.


జీవన్‌టోన్ వలన లాభములు

ఎంత మంచి అహారము భుజించినప్పటికిని శరీరము పుష్టిగా లేకున్నను, పెరుగుదల లేనప్పటికిని, అజీర్ణము, అలసట, శక్తి లేకుండుట, యౌవనము మారి ముసలివారుగా కనబడుట, శరీరము చెడుట, స్పృహ తప్పుట మొదలగు వానికి "జీవన్‌టోన్"ను వాడి మంచి ఫలమును పొందవచ్చును. జీవన్‌టోన్‌ను కొన్ని దినములు వాడుచు వచ్చిన అతి త్వరలో లావు, బరువు మంచి పుష్టియు కలుగుట నిశ్చయము. (కొంతమంది చెప్పినట్లుగా ఇది అన్నిరకముల వ్యాధులకు ఉపయోగపడదు.) అవసరమైన బరువును, లావును లభించిన పిమ్మట వెంటనే వాడుటను నిలుపవలెను. ఎక్కువ లావును, బరువును వున్నవారు దీనిని వాడకుండుట మంచిది. అనేక మందులు ఉపయోగించుయు ప్రయోజనము లేనివారు ఒకసారి జీవన్‌టోన్‌ను ఉపయోగించండి. ... 454 గ్రాముల వెల రూ. 10/-

పురుషులు మాత్రము వాడవలసిన మాత్రలు :— దీనిని వాడిన 10 రోజులకే ఫలమును యిచ్చును. ఎక్కువ శక్తిగల మాత్ర. 60 ఏండ్ల



40 దినముల అనంతరము



70 దినముల అనంతరము

వయస్సుగల వారికి కూడ ఈ మాత్రల మూలముగా లాభము కలుగుచున్నది. ... ... కోర్సు వెల రూ. 15/-

ఈ మాత్రలను జీవన్‌టోన్‌ను ఒకేసారి వాడిన మంచి ఫలమును యిచ్చును.

"స్కిన్‌లీమ్స్" "స్కిన్‌లీమ్స్" ఉపయోగించి, మొటిమలు, తెగిన గాయము, అమ్మవారి మచ్చలు, తేమలు, చెమటకాయలు... మొదలగు వానిని పోగొట్టి అందమైన ముఖమును పొందండి 1 సీసా వెల రూ. 1?/-

జ్యోతి హాస్పిటల్,

32, వెంకటనారాయణ రోడ్డు, టి. నగరు, మద్రాసు-17.

రిజిస్టర్డు నెం. 218726— పోస్టు బాక్సు నెం. 1413—ఫోన్ 440206

ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నిస్తుందట. ముఖ్య మంత్రులను, వివిధ రాజకీయ పక్షాలవారిని సంప్రతిస్తుందట ఈ సద్బుద్ధి ఇంతకు ముందేమైందో ?

అధికార భాషలపై బిల్లును, తీర్మానాన్ని పార్లమెంటు ఆమోదించడం ఎన్నడో జరిగిపోయింది. వాటిపై దక్షిణ రాష్ట్రాలలో అపూర్వమైన ఆందోళన జరిగింది; ఇంకా జరుగుతున్నది. ఇప్పుడా, ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నాలు ? చెంపదెబ్బకొట్టి సారీ అన్నట్టు ...

హిందీయేతర ప్రాంతాల వారు కోరినంతకాలం ఇంగ్లీషు కూడా సహ అధికార భాషగా కొనసాగుతుందని పూర్వం జవహర్లాల్ నెహ్రూ హామీ యిచ్చారు. ఈ హామీలను చట్టబద్ధం చేయాలని దక్షిణ రాష్ట్రాలవారు కోరారు. నిజమే. ఈ కోరికను తీర్చడానికే కేంద్ర ప్రభుత్వం అధికార భాషల (1963 నాటి) చట్టానికి సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టింది. ఇదంతా గడిచి రెండు నెలలు దాటింది కనుక, దాని వివరాలు లోనికి వెళ్ళడం అనవసరంగాని, కేంద్రం మొదట తీసుకు వచ్చిన బిల్లు పూర్తిగా సంతృప్తికరంగా లేక పోయినా, గుడ్డిలో మెల్ల అనుకుని దక్షిణ రాష్ట్రాలవారు తల వూపారు. ముఖ్యంగా హిందీని అసలే అంగీకరించబోమన్న మద్రాసు వారు కూడా సరే నన్నారు.

దీన్ని బహుశా మద్రాసువారి దౌర్బల్యంగానో, మెతకతనంగానో అపార్థం చేసుకుని హిందీ రాష్ట్రాల వారు కొమ్మెక్కి కూర్చున్నారు. ఇంగ్లీషును తక్షణం బహిష్కరించాల్సిందే నన్నారు. యు. పి., బీహారు మొదలైన హిందీ రాష్ట్రాలలో ఘోరమైన అల్లర్లు ప్రజ్వరిల్లాయి. పార్లమెంటులోని హిందీ లాబీ కేంద్రంమీద ఒత్తిడి తీసుకువచ్చింది. దీనికి కేంద్రం లొంగిపోయి, మొదట ప్రవేశ పెట్టిన బిల్లును కొన్ని సవరణలు చేయడమే కాక, ఒక తీర్మానాన్ని కూడా జత చేసింది. పార్లమెంటులో తనపార్టీ వారిని మెడలు వంచి బిల్లుకు ఆమోదం సంపాదించుకుంది.

పార్లమెంటు ఆమోదించిన బిల్లు, తీర్మానం చాలా అన్యాయంగా వున్నాయనడంలో ఏమీ సందేహం లేదు. కేంద్ర ప్రభుత్వపు ఉద్యోగాలు మొదలైన వాటిలో హిందీ వారికి సౌకర్యాలు, ఇతరులకు అసౌకర్యాలు కలుగుతాయి. భాషల విషయంలో హిందీవారి పని తేలిక, ఇతరుల పని కష్టం అవుతాయి. హిందీవారు మాతృభాష నేర్చుకుని వుంటేచాలు. కాని, హిందీయేతరులు మాతృభాష, ఇంగ్లీషు, హిందీ నేర్చుకోవాలి.

ఈ అన్యాయం పట్ల నిరసనగా తొలుత మద్రాసులో, తరవాత మైసూరు, ఆంధ్ర ప్రదేశ్ లలో ముఖ్యంగా విద్యార్థుల మహోద్యమం సాగింది. హిందీని ఎన్నటికి

అంగీకరించబోమని, ఇంగ్లీషే అధికార భాషగా వుండాలని వారు ఆందోళన సాగించారు.

మద్రాసులోని డి. ఎం. కె. ప్రభుత్వం ఆదినుంచి హిందీకి వ్యతిరేకమే. అందుచేత, అది కేంద్రం వైఖరికి అసమ్మతిగా, తనరాష్ట్రంలో విద్యాలయాల నుంచి హిందీని బహిష్కరిస్తూ ద్విభాషా విధానాన్ని ప్రకటించింది.

మైసూరు, ఆంధ్ర ప్రదేశ్ లలోని కాంగ్రెసు ప్రభుత్వాలు ఇంత తీవ్రత్వానికి వెళ్ళలేదు. అవి త్రిభాషా సూత్రాన్నే స్థూలంగా సమర్థిస్తున్నాయి. కాని అధికార భాషల సవరణ బిల్లుగాని, తీర్మానంగాని న్యాయంగా లేవని, వాటిని సవరించి అన్ని ప్రాంతాల వారిపైన భాషల విషయంలో సమాన భారాన్ని వేయాలని ప్రకటించాయి.

కాని, ఈ ప్రకటనలు కూడా ఆంధ్ర, మైసూరు విద్యార్థులను సంతృప్తి పరచలేదు. వారి ఆందోళన చాలరోజులు సాగింది. ఆంధ్ర ప్రదేశ్ లో మొత్తంపై శాంతియుతంగా జరిగినా, కొన్ని సందర్భాలలో శ్రుతిమించి దౌర్జన్య చర్యలలో పడింది.

మద్రాసులో చెప్పనక్కర్లేదు. తమ ప్రియతమ ముఖ్యమంత్రి విజ్ఞప్తులను కూడా పాటించకుండా విద్యార్థులు స్వైరవిహారం చేశారు. కొన్ని పట్టణాలలో జాతీయ పతాకాన్ని, రాజ్యాంగాన్ని దగ్ధం చేయడం, జాతీయగీతాన్ని అగౌరవించడం చేశారు. స్వతంత్ర తమిళనాడు నినాదాన్ని కూడా లేవదీశారు. డి. ఎం. కె. పార్టీ సైతం స్వస్తి చెప్పిన ఈ నినాదాన్ని విద్యార్థులు చేపట్టడం ఖండించవలసిందే.

చివరికి ఇందతా ఎప్పటికి సద్దుమణుగుతుందో తెలియదు. కాని, ఈ గందరగోళానికి అంతటికి కారణం కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా చేసిన అవకతవక లేకాదా ? ఇప్పుడు అది, అన్ని రాష్ట్రాలమధ్య, అన్ని పార్టీలమధ్య ఏకాభిప్రాయాన్ని సాధిస్తానంటోంది. ఇంత జరిగిన తరవాత అది సాధ్యమా అన్నది సందేహం ఇంగ్లీషును సుతరామూ అంగీకరించేది లేదంటున్న హిందీ రాష్ట్రాలకు హిందీతో తమకు ప్రమేయం లేదంటున్న మద్రాసుకు మధ్య ఏకాభిప్రాయం ఎలా సాధ్యం? ఇన్నాళ్ళూ విస్మరించిన త్రిభాషా సూత్రాన్ని కాంగ్రెసు అధిష్ఠాన వర్గం ఇప్పుడు మళ్ళీ బూజు దులిపి పైకి తీసింది. విద్యా విధానంలోను, ఉద్యోగాలలోను కూడా ఈ సూత్రాన్ని పాటించాలని అది తీర్మానం చేసింది. కాని, కేంద్రంలోని కాంగ్రెసు ప్రభుత్వం సృష్టించిన గందరగోళం నుంచి దేశాన్ని త్రిభాషా సూత్రం మాత్రం రక్షించ గలదా ?

* ♦ *

ఇరవై ఏళ్ళనుంచి కాంగ్రెసు ప్రభుత్వం చేసిన అవకతవక జాబితాలోని ఒక అంశం – కచ్ ప్రాంతానికి సంబంధించినది.

కచ్ జిల్లాలోని రాన్ ప్రాంతంపై పాకిస్తాన్‌కు ఎట్టి హక్కు లేదు. అది మొదటినుంచి కచ్ లో భాగమే. అయినా, దానిలో సగం భాగం తనకు రావాలని పాకిస్తాన్ పేచీపెట్టి 1965 లో దురాక్రమణకు దిగింది. దాన్ని ఇండియా తిప్పికొట్టింది.

ఆ సమయంలో బ్రిటిష్ ప్రధాని విల్సన్ జోక్యం చేసుకుని కచ్ రాన్ వివాదాన్ని మధ్యవర్తుల తీర్పుకు నివేదించాలని సూచించాడు. ఇండియా పాకిస్తాన్‌ను ఒప్పుకున్నాయి.

ఇండియా, పాకిస్తాన్, సమితి కార్యదర్శి నామినేట్ చేసిన ముగ్గురు న్యాయమూర్తులతో ట్రిబ్యునల్ ఏర్పాటైంది. గత మాసంలో ఆ ట్రిబ్యునల్ ఉభయదేశాల వాదనలు విని తీర్పుయిచ్చింది.

దాని ప్రకారం వివాదగ్రస్తమైన కచ్ రాన్ ప్రాంతంలో నూటికి పదివంతులు—సుమారు 300 చదరపు మైళ్ళు—పాకిస్తాన్‌కు దక్కింది.

ముగ్గురు జడ్జీలలో ఇద్దరి ఆమోద ముద్రమాత్రమే పడిన ఈ తీర్పులో



న్యాయం లేదనడంలో సందేహం లేదు. రాజకీయకారణాలను పురస్కరించుకునికూడా ట్రిబ్యునల్ ఈ తీర్పు ఇవ్వడం జరిగింది. అందుచేత దీన్ని ఆమోదించకూడదని ప్రతిపక్షాలన్నీ ఇండియా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి. కాని ట్రిబ్యునల్ తీర్పును శిరసావహిస్తామని ముందే మనం మాట యిచ్చాము కనుక ఇండియా ప్రభుత్వం, ఆ మాటకు కట్టుబడి వుండడానికే నిశ్చయించింది.

ఈ నిర్ణయాన్ని ఆక్షేపించడానికి వీలులేదు. ఆనాడు బ్రిటన్ ప్రధాని విల్సన్ జోక్యాన్ని మనం తిరస్కరించి, మధ్యవర్తులకు వివాదాన్ని నివేదించడానికి ఒప్పుకోకుండా వుండవలసింది. అలా ఒప్పుకోకూడదని ఆనాడు జనసంఘంవంటి కొన్ని రాజకీయపక్షాలు గట్టిగా వాదించాయికూడాను. అయినా, ఆ వాదనను తృణీకరించి, ఇండియా ప్రభుత్వం గుడ్డిగా, తెలివితక్కువగా బ్రిటిష్ ప్రధాని పన్నినవలలో చిక్కుకుంది.

ఈనాడు ఎవరు చేయగలిగిందీ ఏమీలేదు. కేంద్రంలో కాంగ్రెసు కాక, జనసంఘం అధికారంలో వున్నా ట్రిబ్యునల్ తీర్పును మన్నించవలసిందే. ప్రపంచం దృష్టిలో ఆనాడు ట్రిబ్యునల్ ఏర్పాటుకు అంగీకరించింది ఇండియాలోని కాంగ్రెసుప్రభుత్వంకాదు. ఇండియా ప్రభుత్వం. ఇండియాలో ఏ పార్టీ అధికారంలో వున్నా, దేశ గౌరవాన్ని నిలబెట్టడానికి ఆడిన మాట ప్రకారం ప్రవర్తించవలసిందే.

చేతులు కాలిన తరవాత ఆకులు పట్టుకోనడం కాంగ్రెసు ప్రభుత్వానికి అలవాటేనని మొదట పేర్కొన్నాము. ఆ అలవాటు ప్రకారమే కాబోలు మొన్న ఉపప్రధాని శ్రీ మొరార్జీ దేశాయి ఇకముందు ఎప్పుడూ ఇలాంటి వివాదాలను మధ్యవర్తులతీర్పుకు నివేదించబోమని లోక్‌సభలో 'లెంపలు' వేసుకున్నారు.

* * *

ఫిబ్రవరిలో కేంద్రప్రభుత్వం కనీసం ఒకమంచిపని చేయకపోలేదు. అది పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్‌లలో అనిశ్చిత పరిస్థితులను తొలగించడం.

యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసిన తరవాత పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్ పి.సి. ఘోష్‌ను అడ్డంపెట్టుకుని వ్యవహారం నడిపించాలని కేంద్రప్రభుత్వం ఎత్తువేసింది. డాక్టర్ ఘోష్‌తోపాటు మరి పదహారుగురో, పదిహేడుగురో బయటికి వచ్చి వేరే పార్టీ పెట్టుకోవడంతో యునైటెడ్ ఫ్రంట్ బలం తగ్గిపోయినమాట నిజమేకావచ్చు. ఈ విషయాన్ని తాను చెప్పిన తేదీలోగా శాసనసభలో రుజువుచేయడానికి శ్రీ అజయ్ ముఖర్జీ నిరాకరించారనే సాకుతో ఆయన మంత్రివర్గాన్ని గవర్నరు శ్రీ ధర్మవీర బర్తరఫ్ చేశారు. డాక్టర్ ఘోష్ పార్టీని

కాంగ్రెసు పార్టీ సమర్థిస్తున్నదని తనకు సంతృప్తి కలిగిందంటూ అయన్ని ముఖ్యమంత్రిగా నియమించి మంత్రివర్గం ఏర్పాటు చేయమన్నారు.

దీనితో పశ్చిమబెంగాల్‌లో సంక్షోభం చెలరేగింది. డాక్టర్ ఘోష్ పేర్కొన్న తేదీకి శాసనసభ సమావేశమైంది కాని, ఘోష్ మంత్రివర్గాన్ని తాను గుర్తించబోనని స్పీకరు శ్రీ విజయకుమార్ బెనర్జీ దాన్ని నిరవధికంగా వాయిదా వేశారు. మంత్రివర్గాన్ని గుర్తించడానికి, గుర్తించకపోవడానికి స్పీకరుకు అధికారం వుందా? ఆయన కర్తవ్యం శాసనసభ వ్యవహారాలు నిర్వహణ మాత్రమేకాదా? గవర్నరు అధికారాలను ఆయన కాదనవచ్చునా? అసలు గవర్నరు అధికారాలేమిటి? శాసనసభలో బలాబలాలు రుజువు కాకుండా తన అంచనా ప్రకారం బలం తగ్గినట్టు కనిపించిన మంత్రివర్గాన్ని ఆయన రద్దుచేయవచ్చునా? ఇవి అన్నీ ఇండియాలో ఇంతకుపూర్వం ఎన్నడు కని విని ఎరగని రాజ్యాంగ ప్రతిష్టంభనకు కారణాలయ్యాయి. గడచిన నెలలో శాసనసభ సమావేశం జరపడానికి ఇంకొకసారి గవర్నరు ప్రయత్నించారు. ఆ సమావేశంలో ఆయన ప్రసంగించవలసివుంది. కాని, దాన్ని కూడా యునైటెడ్ ఫ్రంట్ భగ్నం చేసింది. గవర్నరు లెజిస్లేచర్ ఉభయ సభల సమావేశంలో ప్రసంగించడానికి వీలులేకపోయింది. ఆ తరవాత కొద్ది నిమిషాలలోనే స్పీకరు తిరిగి అసెంబ్లీని వాయిదావేశారు.

చివరికి పశ్చిమబెంగాల్‌లో కేంద్రం రాష్ట్రపతి పాలనను విధించకతప్పలేదు. రాజ్యాంగ ప్రతిష్టంభనను పరిష్కరించడానికి మరొక మార్గం లేకపోయింది కూడా.

ఇంతేకాక, ఇంకా చాలా కారణాలు కలిసివచ్చాయి. తమ ప్రభుత్వం పోయినప్పటినుంచి యునైటెడ్ ఫ్రంట్ పార్టీలు దశలవారీగా రాష్ట్రంలో శాసనోల్లంఘన సాగిస్తూ వచ్చాయి. కలకత్తాలోనేమి, ఇతర స్థలాలలోనేమి పౌరజీవితం అస్తవ్యస్తమైపోయింది. పరిశ్రమలు, వ్యవసాయం అన్నీ దెబ్బతిన్నాయి. శాంతిభద్రతలు కూడా మృగ్యమైనాయి.

పి. సి. ఘోష్ ప్రభుత్వంలో కాంగ్రెసు కూడా భాగస్వామిగా చేరినప్పటికి పరిస్థితి ఏమాత్రం మెరుగుకాలేదు. కాకపోగా ఒక కొత్త రాజకీయ సమస్య ఎదురైంది. మంత్రివర్గంలో స్థానాలు దొరకని కారణాన కాంగ్రెసు శాసనసభ్యులు చాలమంది చీలిపోయి నేషనల్ ఫ్రంట్ పేరుతో పార్టీ పెట్టారు. అంటే ఘోష్ మంత్రివర్గం తిరిగి మైనారిటీ ప్రభుత్వం అయిపోయిందన్నమాట. ఒకవేళ అసెంబ్లీ సమావేశం సవ్యంగా కొనసాగినప్పటికి, ఘోష్ మంత్రివర్గం అవిశ్వాసతీర్మానానికి తట్టుకుని నిలబడేది కాదు. అప్పుడైనా రాష్ట్రపతి పాలనతప్పేది కాదు.

అది జరిగిన కొద్దిరోజులకే ఉత్తరప్రదేశ్‌లో కూడా రాష్ట్రపతిపాలన వచ్చింది. అయితే, పశ్చిమబెంగాల్‌లో వలె అక్కడ శాసన సభ రద్దుకాలేదు; తాత్కాలికంగా సస్పెండ్ అయింది. బెంగాల్‌లో మధ్యంతరం ఎన్నికలు జరుగుతాయి. ఉత్తరప్రదేశ్‌లో బహుశా ఒక నెల తరవాత శాసనసభకు తిరిగి ప్రాణప్రతిష్ఠ జరిగి కొత్తప్రభుత్వ స్థాపనకు అవకాశం ఇవ్వబడుతుంది.

కాంగ్రెసునుంచి చీలిపోయి, సి. బి. గుప్తా ప్రభుత్వాన్ని పడగొట్టి, కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని స్థాపించిన తర్వాత శ్రీ చరణ్‌సింగ్ నాయకత్వాన్ని సంయుక్త విధాయక్ దళ్ కొన్నినెలలు బాగానే గౌరవించింది.

కాని, క్రమంగా లుకలుకలు పుట్టుకువచ్చాయి. మరీ మితవాదపక్షాలైన స్వతంత్ర, జనసంఘం, ఇటు తీవ్రవాదపక్షాలైన ఎస్.ఎస్.పి.

కమ్యూనిస్టుపార్టీలు ఒక ఒరలో ఎలా ఇముడుతాయి ?

వాటిలో కీచులాటలు, స్వార్థ ప్రయోజనాలు అధికమై రాష్ట్ర పరిపాలనకూడా స్తంభించిపోయే స్థితి ఏర్పడింది. దానికితోడు శ్రీ చరణ్ సింగ్ నాయకత్వాన్ని బహిరంగంగా విమర్శించడంకూడాజరిగింది. దీనితో ఆయనవిసిగి రెండుసార్లు రాజీనామా ఇవ్వబోయారు. సంయుక్తదళ్ వేదికోలుమీద రెండుసార్లు ఉపసంహరించుకున్నారు. చివరకు మూడవసారి రాజీనామా ఇచ్చారు.

ఆయనస్థానంలో అందరి ఆమోదం పొందగల నాయకుడు దళ్ కు దొరకలేదు. ఒకేరోజున చరణ్ సింగును, ఆ తర్వాత మరొకరిని నాయకులుగా దళ్ ఎన్నుకున్నది. ఈ హాస్యాస్పద పరిస్థితిని అంతం చెయ్యడానికి చివరకు రాష్ట్రపతిపాలన విధించవలసి వచ్చింది. అయితే నెలరోజుల తరవాతనైనా పరిస్థితి కుదుట పడుతుందా ? కాంగ్రెసుగాని, మరొకటిగాని సుస్థిర ప్రభుత్వాన్ని నెలకొల్ప గలుగుతుందా?

అంతకంటే బెంగాల్ లోవలె మధ్యంతరం ఎన్నికలు జరపడమే యుక్తంకాదా? ఏమి జరుగుతుందో చూడాలి.

□□□

సినిమా

ఇద్దరు పద్మశ్రీయుతులు

"పద్మశ్రీ" బిరుదుతో తన బాధ్యతలు ఇనుమడించాయని, ఇక ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించికాని పెదవి విప్పరాదని ఎన్. టి. రామారావు విశదం చేశారు.

హైదరాబాద్‌కు తాను తరలి పోవడంలేదని, మద్రాసులోనే వుంటానని, ఇటు మద్రాసులోను, అటు హైదరాబాద్‌లోను సినిమాలలో నటిస్తూ వుంటానన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కోరినందువల్ల ఉడుతా భక్తిగా హైదరాబాద్‌లో ఫిలిం పరిశ్రమ అభివృద్ధికి పాటు పడుతూ వున్నానన్నారు. మద్రాసులో బ్రహ్మాండమైన సినిమా థియేటర్‌కాని, స్టుడియోకాని నిర్మించే ఉద్దేశం లేదన్నారు. తానే మద్రాసులో వుండగా మళ్ళీ ఇంకా స్టుడియోలు, థియేటర్లు ఎందుకు అని ఎదురు ప్రశ్న వేశారు.

"పద్మశ్రీ" బిరుదం తనకు వచ్చిందనే అంకే ఆ ఘనత నిజానికి తనది కాదని, పరిశ్రమదని చెప్పారు. అటువంటి పరిశ్రమ సర్వసౌభాగ్యమే తన ఏకైక లక్ష్యమన్నారు.

ఫిలిం రంగంలో తనకు ప్రవేశమిచ్చిన శ్రీ ఎల్. వి. ప్రసాద్‌గారికి, శ్రీ నాగిరెడ్డి, శ్రీ చక్రపాణిగార్లకు, మొదటిసారిగా హీరో పాత్ర తనకు యిచ్చిన శ్రీ బి. ఏ. సుబ్బారావు గారికి, పంపిణీ వ్యాపారంలో మార్గదర్శి అయిన శ్రీ సుందరలాల్ నహతాకు, ఫిలిం జర్నలిస్టులకు, నటీనటులకు, సాంకేతిక ప్రవీణులకు ఆయన కృతజ్ఞత తెల్పారు.

రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా శ్రీ అక్కినేని నాగేశ్వరరావుకు, శ్రీ ఎన్. టి. రామారావుకు భారత

ప్రభుత్వం "పద్మశ్రీ" బిరుదం ప్రకటించింది.

ఆ సందర్భం పురస్కరించుకొని మద్రాసులోని నిర్మాతల బృందం ఫిబ్రవరి ఒకటవ తేదీన, దక్షిణ భారత ఫిలిం వాణిజ్య మండలి ఫిబ్రవరి తొమ్మిదవ తేదీన "పద్మశ్రీ" రామారావును ఘనంగా సన్మానించాయి.

ఒకటవ తేదీ సభకు శ్రీ బి. నాగిరెడ్డి, ఎనిమిదవ తేదీ సభకు డాక్టర్ డి. వి. రాజమన్నార్ అధ్యక్షత వహించారు.

ఇప్పటి ఇద్దరు పద్మశ్రీలు గురించి మొదటి సభలో మొదటి పద్మశ్రీ చిత్తూరు వి. నాగయ్య ప్రస్తావించారు. ఆంధ్రదేశపు ఇద్దరు మహానాయకులను-ఇప్పటి ఇద్దరు పద్మశ్రీలను—ఒకే వేదికపై సన్మానించే మహా సుదినంకోసం ఎదురు చూస్తున్నామని శ్రీ నాగయ్య అన్నారు.

రెండవ సభలో తమిళ సోదరులు సయితం రామారావును ప్రస్తుతిస్తూ ప్రసంగించారు.

రెండు సభలలోను వక్తలు రామారావు సుర అసుర సాంఘిక నాయక ప్రతినాయక భూమికలు ధరించడంలో చూపిన ప్రజ్ఞను కొనియాడారు. నటుడుగానే కాక దర్శకుడుగా, స్క్రీన్ రైటర్‌గా, నిర్మాతగా, ఎగ్జిబిటర్‌గా, స్టూడియో ఓనర్‌గా ఆయన చూపిన, చూపుతున్న దీక్షా దక్షతలను కొనియాడారు.

రాముని పాత్ర ధరించినందుకు నిత్య జీవితంలో కొన్ని మంచి నియమాలు పాటిస్తున్నందుకు కొనియాడారు.

రామారావు బహువిధ నటనకల చిత్రాల భాగాలను కూర్చి అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకు పంపాలనే ఒకసూచనకూడావచ్చింది. వివిధ ప్రమాదాల బాధితులకు రామారావు చేసిన సహాయం కూడా ప్రస్తుతించబడింది.

రంగం దృష్టిలో రామారావు

"పద్మశ్రీ" రామారావు అభినందన సభలలో పలువురు ప్రముఖులు ఆయన గురించి వెలిబుచ్చిన అభిప్రాయాలను దిగువ క్రోడీకరిస్తున్నాము :

డి. వి. ఎస్. రాజు: నిత్యనూతన పోకడలతో నిత్యమూ నటించగల ప్రజ్ఞాశాలి. ప్రజా సేవ, దేశభక్తి "పద్మశ్రీ" బిరుదు తీసుకువచ్చాయి. వారి గౌరవమే మా గౌరవం.

బి. నాగిరెడ్డి : ఇతరులవలెకాక రామారావు సినిమాపై సంపాదించింది సినిమాపైనే పెట్టారు. నా సంపదలో ఆయన భాగస్వామి. ఆయన సంపదలో నేను భాగస్వామిని ఆయనలోని సైనిక క్రమశిక్షణ అందరికీ మార్గదర్శకం.

సుందరలాల్ నహాతా : ప్రస్తుతపు ప్రపంచ మహానటులలో రామారావు ఒకరు. "తోడు దొంగలు"



వంటి ఎక్స్‌పెరిమెంటల్ సాంఘికం, "ఉమ్మడి కుటుంబం"వంటి బాక్స్ ఆఫీస్ సాంఘికం, "గులేబకావళి" వంటి జానపదం, "పాండురంగ మహత్యం" వంటి పౌరాణిక చిత్రాలు తీసి నిర్మాణంలో వైవిధ్యం చూపిన ప్రజ్ఞాశాలి. చిన్న, పెద్ద తారతమ్యం చూపని సామ్యవాది. రామరావణ పాత్రలు,నాయక ప్రతి నాయక పాత్రలు , బహురస భూమికలు సమప్రజ్ఞతో ధరించిన నటశ్రీ. నూరు నయాపైసల పెద్ద మనిషి.

మనకు సాధారణంగా పిల్లలు పుట్టుకు వస్తుంటే తల్లి దండ్రులపై ప్రేమతగ్గి పిల్లలపై ప్రేమపెరుగుతూ వుంటుంది. కాని శ్రీరామ పాత్ర ధారి తారక రామారావుకు పిల్లలు పెరుగుతున్నకొద్దీ మాతా పితృభక్తి పెరుగుతున్నది.

"పద్మశ్రీ" నాగయ్య: రామారావు మహావ్యక్తి. మహా సంస్థ. నేను నాయకుడుగా నటించిన "మన దేశం" రామారావు తొలి చిత్రం కావడం నా అదృష్టం. సినీ రంగంలో 'జెంటిల్‌మన్' అన్న పదం నేతి బీరకాయ అయిపోతున్న రోజుల్లో ఆ ఆంగ్ల పదాన్ని సార్థకం చేస్తున్న వ్యక్తి, శక్తి రామారావు.

కొసరాజు రాఘవయ్య చౌదరి: రామారావు రాకముందు శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రలకు రవివర్మ చిత్రాలు మోడల్సు. రామారావు వచ్చాక, ఇంకా అనేక దశాబ్దాలకు కూడా రామారావు రాముడు, కృష్ణుడు మోడల్సుగా వుంటాయి. సినిమా కళలో, పరిశ్రమలో "అ" నుంచి "హ" వరకు అన్నీ తెలిసిన మహా పండితుడు రామారావు. ప్రతి పాత్ర, ప్రతి పాత్రయొక్క డైలాగూ, యాక్షన్ క్షుణ్ణంగా జ్ఞాపకం వుంచుకొంటారు

ముదిగొండ లింగమూర్తి: రామారావులో కృష్ణతత్వం వుంది. వ్యాపార వ్యవహారాలలో అది ఆచరణలో పెట్టుతారు. రామారావులో రామతత్వం వుంది. అది మాతాపితల

విషయంలో, నీతినియమాలలో పాటిస్తారు. రామారావులో ఈశ్వరతత్వం వుంది. శివునినుంచి ఆదరణ పొందని వాడు వుండడు. అలాగే రామారావు నుంచి ఆదరణ పొందని వారుండరు. వారి పంథా మిగతా చిరంజీవులు పాటించాలి.

చెరువు అంజనేయ శాస్త్రి: సర్వ సమగ్ర విజ్ఞాని.

కొమరవోలు నారాయణరావు: దేశం ఛిన్నా భిన్నమైపోయే ప్రమాదం ఏర్పడిన ఈ తరుణంలో పద్మశ్రీ రామారావు దేశాన్ని ఉత్తేజ పరచే బాధ్యతలు వహించి రాజకీయ నాయకులకే, రత్నాల మార్గం చూపాలి; చూపగలరు.



"మంచి కుటుంబం"లో గీతాంజలి

పి. బి. శ్రీనివాస్: గొప్పనటునికి గొంతుక యిచ్చే భాగ్యం నాకు కలిగింది.


అంగ్ల ఫిలిం జర్నలిస్టు రాఘవన్: రామారావు వ్యవహారం చూడబోతే ఏదో వార్ లీడర్ వ్యవహారంలా తోస్తుంది. క్షణమైనా వేస్టు చెయ్యరనిపిస్తుంది.

సముద్రాల రామానుజాచారి: విమర్శలను తేనెగా తీసుకొనే మధుర హృదయుడు. కఠిన నియమాలు పాటించే కోటీశ్వరుడు. ఈ రోజు వరకు శనివారం వేళ కటిక నేలపై నిద్రిస్తారు. చేతినే దిండుగా ఉపయోగించుకొంటారు.

బి. ఏ. సుబ్బారావు: ప్రపంచంలో మరే నటుడూ రామారావు ధరించినన్ని విభిన్న స్వభావ పాత్రలను నిర్వహించి వుండలేదు.

కాగడా శర్మ: నిన్నటి రామారావు వేరు. నేటి రామారావు వేరు. "పద్మశ్రీ" రామారావు ప్రజను, దేశాన్ని ఉత్తేజ పరచే పాత్రలు ధరించాలి. పాత్రలు అంటే సినిమా పాత్రలే కాదు; బాధ్యతలు కూడా.

ఘంటసాల వెంకటేశ్వరరావు: రామారావుగారికి గొంతుక ఇచ్చిన నాకు, వారి "పద్మశ్రీ" లో భాగం వుంది. వారి పాత్రల భావాలు జీర్ణించుకొని పాడాను. మహారాజు నుంచి బంట్రోతు వరకు, రాక్షసుడు నుంచి దేవుడు వరకు, అన్ని రకాల పాత్రలు ధరించి మెప్పించిన మహా నటుడు మన రామారావు.



"తల్లి ప్రేమ"లో యన్. టి. రామారావు, సావిత్రి

పుండరీకాక్షయ్య: బావగారి దీక్షా దక్షతలు సర్వులకు శిరోధార్యం.

డాక్టర్ పి. వి. రాజమన్నార్: సినిమా, కళా స్వరూపాలన్నింటిలోకి గొప్పది. సినిమా కళకు, పరిశ్రమకు చెందిన రామారావు మహా ప్రజ్ఞావంతుడు. "పద్మశ్రీ" పొందడమంటే ఏదో పోటీలో గెలుపొందడంకాదు. సేవకు, శక్తికి ప్రశంసా చిహ్నంగా యిచ్చేది. విశాల హృదయం కలవాడే నిజమైన కళాకారుడు. రామారావు హృదయం సవిశాలమైంది. సినిమా సాహిత్యానికి, సాహిత్య రూపాలలో గౌరవస్థానం యివ్వడం అవసరం. ధీరోదాత్త, ధీర లలిత స్వభావాల ప్రదర్శనలో రామారావు అద్వితీయ నాయకుడు.

ఎమ్. జి. రామచంద్రన్: రాక్షసుడు వేసినవాడు రాముడుగా వేస్తే కూడా బాగా వుంటాడని నిరూపించిన మొట్టమొదటి మహా

నటుడు ఎన్. టి. రామారావు. ఆయనను చూచి నేను నటించిన సందర్భాలు వున్నాయి.

ఏ. ఎల్. శ్రీనివాసన్ : సినిమా పరిశ్రమలో సంపాదించింది సినీ పరిశ్రమ వికాసానికే వినియోగించిన మహా సినీమానిసి

కొంగర జగ్గయ్య: మహా ప్రతిభావంతుడైన నటుడు రామారావు. నటరత్న అనే సార్థక బిరుదాంకితులు. పోలీసు కుటుంబాల నుంచి పాకిస్థాన్ దురాక్రమణ బాధితుల వరకు ఎందరికో సహాయం చేసిన మహా వ్యక్తి. పద్మశ్రీతో గౌరవంకంటె బాధ్యత ఎక్కువగా మీద పడిందని తెలుసుకొన్న రామారావు మనసు గొప్పది.

పి. పుల్లయ్య: వీరపూజలుకల దేశం. రామారావు ఆ సంప్రదాయం నిలచేటట్లు చేశారు. శ్రీనివాసుడుగా నటించి ప్రేక్షకులకు సినిమా థియేటర్‌ను ఓ తిరుపతి చేసిన అదృష్టశాలి.

ఉమాపతి : భాగ్యనగర్‌లో రామారావు నిర్మించిన 70 ఎమ్. ఎమ్. థియేటర్ వంటిది దేశంలో ఎక్కడా లేదు. ఆ థియేటర్ వలె ఆయన హృదయం విశాలమైంది. 'కర్ణ' తమిళ చిత్రంలో కృష్ణుడుగా ఆయన నటించ లేదు. జీవించారు.

తంగవేలు : ఇండియాలో పద్మశ్రీ బిరుదు ఓ పాప. ఆ బిరుదు పొందిన పాప రామారావు. తినడానికి ఓ బిస్కెట్ల పొట్లం బహుమతిగా ఇస్తున్నాను.



""లక్ష్మి నివాసం""లో వాణిశ్రీ

రామారావు: తన గురించి తను

ఫిబ్రవరిలో మద్రాసులో జరిగిన అభినందన సభలలో 'పద్మశ్రీ' రామారావు తన గురించి చెప్పిన విషయాలను దిగువ క్రోడీకరిస్తున్నాము :

నేను చాలా అదృష్టవంతుణ్ణి. బిరుదులు వచ్చినందువల్ల కాదు. బిరుదులు వస్తాయనే ఆశతో ఏ నటుడూ పాటుపడడు. కళాకారులన్న వారు బిరుదులు ఆశించరు కూడా. నా పురోగతికి ఆశ్రయమిచ్చిన వారే నన్ను వాత్సల్య సాగరంలో ముంచడం నా అదృష్టం.

నేను సినిమా పరిశ్రమలో చేరి




"బలే కోడళ్ళు" చిత్రంలో జానకి, రాజశ్రీ, జయంతి

నప్పుడు సినిమా గురించి ప్రజలలో, శ్రేయోభిలాషులలో వున్న అభిప్రాయం వేరు; ఇప్పటి అభిప్రాయం వేరు. ఎల్. వి. ప్రసాద్, బి. ఏ. సుబ్బారావు, నాగిరెడ్డి, చక్రపాణి, సుందర్‌లాల్ నహతా గారలు నా పురోభివృద్ధికి బంగారు పునాదులు వేశారు. దర్శకులు, నిర్మాతలు, సాటి నటీనటులు నన్నింతవాణ్ణి చేశారు. తోట రాముడుగా నటించినా, శ్రీనివాసుడుగా నటించినా, శ్రీ కృష్ణుడుగా నటించినా రాణించానూ అంటే పై అందరి చలవే. దేశసేవ, సంఘసేవ చెయ్యగలిగానూ అంటే నేను కేవలం నిమిత్తమాత్రుణ్ణి. నడిచింది నేను, నడిపించింది పరిశ్రమ; మిత్రులు.

ఏ ఘనత వచ్చినా నాది కాదు; పరిశ్రమది. ఏ గౌరవం వచ్చినా నాది కాదు; పరిశ్రమది.

ఇంతవరకు నా మాటలో కటువు వుండి వుండవచ్చు. ఇక మీదట రిహార్సల్స్ చేసుకొనే నలుగురితోను మాట్లాడడం అవసర మనుకొంటాను. బిరుదుతోపాటు బాధ్యత మీద పడింది. ఇక ఎవ్వరినీ నొప్పించరాదు.

హాస్యనటుడు తంగవేలు నాకు బిస్కెట్ల పొట్లం బహూకరించారు. హెచ్. ఎమ్. రెడ్డిగారి 'వద్దంటే డబ్బు' అరవ చిత్రంలో కలసి నటించాము. అప్పుడు మే మిద్దరము సినిమాకు కొత్త. ఒకరి బాధలు ఒకరం



"ముహూర్తబలం"లో విజయనిర్మల, జమున

*　　*　　*

"భార్య"లో కృష్ణకుమారి





"పాపకోసం"లో దేవిక, బేబీ రాణి

హృదయ మిచ్చి చెప్పుకొనేవాళ్ళం. సినిమా పావలం అప్పుడు. అంచేతే బిస్కెట్లు యిచ్చారు. పాల డబ్బా, పాల సీసా యిచ్చినా ఏమీ అనుకోను.

హీరో ఎమ్. జి. రామచంద్రన్ నా నటనను మెచ్చుకొన్నారు. కోయంబత్తూర్‌లో "అగ్గిరాముడు" తెలుగు వర్షన్‌లో నేను, అరవ వర్షన్‌లో ఆయనా నటిస్తూ వుండేవారం. అప్పటి నుంచి మా కిరువురికి పరిచయం.

జాతీయ రక్షణనిధి సేకరణకు మేము దాదాపు రెండు వందల మందిమి అర్ధరాత్రి రెండు గంటలకు బయలుదేరుతూ వుంటే ఒంటిగంటన్నరకల్లా ఎమ్. జి. ఆర్. 200 పూలమాలలతో తయారై వచ్చారు. మా బృందంలోని ప్రతి ఒక్కరినీ పుష్పమాలాలంకృతులను చేసి, దీవించి పంపారు.

ఇంతవరకు పురుషులలో నాగయ్యగారు ఒక్కరే "పద్మశ్రీ" అయితే ఇప్పుడు ముగ్గురం అయ్యాము. సినిమా పరిశ్రమ సంఘానికి, దేశానికి సేవ చేస్తున్నది. సినీ పరిశ్రమ మరి దేనికీ తీసిపోదని నిరూపించడమే నా ధ్యేయం. ప్రజలు, పత్రికలు, ఇతరులు నా యందు చూపిన ప్రేమాదరాలకు కృతజ్ఞుణ్ణి.

"పద్మశ్రీ" రామారావు ఏమి చేసినా సినిమా పరిశ్రమను గౌరవం పెంచడానికే!

కొత్త చిత్రాలు

"కుంకుమ భరిణ"

చిన్ని బ్రదర్స్ వారు ఫిబ్రవరిలో "కుంకుమభరిణ" సాంఘికం, (క్వికీ) ప్రారంభించి శరవేగంతో నిర్మాణం సాగిస్తున్నారు అంజలి, శోభన్ బాబులపై చిత్రీకరణ ప్రారంభించి, పి. బి. శ్రీనివాస్ పాటను రెండవ ఘట్టంలో రికార్డు చేసి, ఉగాదికి "క్షేత్రయ్య" మొదలు పెట్టాలనే తలంపుతో సాగిపోతున్నారు. వేదాంతం రాఘవయ్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తారాగణంలో ఇంకా రాజశ్రీ, పద్మనాభం, గీతాంజలి, విజయలలిత వున్నారు. సంగీతం: ఆదినారాయణరావు, నిర్మాత: చిన్నారావు.

శ్రీ సారధి స్టూడియోస్ సాంఘికం

శ్రీ సారధి స్టూడియోస్ వారు ఒక స్త్రీ సమస్యా సాంఘిక చిత్రం తీయడానికి ఫిబ్రవరిలో సన్నాహాలు పూర్తి చేశారు.

వి. మధుసూదనరావును డైరెక్టర్‌గా బుక్ చేశారు.

ఎస్. రాజేశ్వరరావు సంగీత దర్శకత్వం, సెల్వరాజ్ ఛాయాగ్రహణ దర్శకత్వం వహిస్తారు. శ్రీ డి. మధుసూదనరావు నిర్మాణ అధ్వర్యం వహిస్తారు.

"పద్మశ్రీ" నాగేశ్వరరావుకు సన్మానం



శ్రీ అక్కినేని నాగేశ్వర రావుకు భారత ప్రభుత్వం "పద్మశ్రీ" బిరుదంతో సత్కరించిన సందర్భంలో హైదరాబాద్‌లోని 20 కళాశాలల విద్యార్థులు రవీంద్ర భారతిలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఎక్కువగా రంగుల చిత్రాలలో, సాంఘికాలలో, వినోద, విషాద, శృంగార భూమికలలో నటించిన నాగేశ్వరరావు ఈనాడు చురుకు వినోద నటనలో మిక్కిలి రాణిస్తున్నారు. 1968 లో ఈ "పద్మశ్రీ", శ్రీ ఆదుర్తితో కలసి చక్రవర్తి చిత్ర "సుడిగుండాలు" తీస్తున్నారు. ఫిబ్రవరిలో "బ్రహ్మచారి"లో హాస్య నటన ప్రదర్శించారు. మార్చిలో "పూలరంగడు" శతదినోత్సవం షీల్డు అందుకొంటున్నారు.

నవజ్యోతి సాంఘికం

నవజ్యోతివారు ఫిబ్రవరిలో ఒక క్వికీ సాంఘికం ప్రారంభించి రెండు షెడ్యూల్సు పూర్తి చేశారు. కాంచన, సత్యనారాయణ, రాజనాల ఈ షెడ్యూల్స్‌లో పాల్గొన్నారు. దర్శకుడు: తాతినేని రామారావు, నిర్మాతలు: వందనం, సాంబశివరావు.

* * *


శ్రీ రామాంజనేయ ప్రొడక్షన్ వారు "మాంగల్య విజయం" అనే అనువాద చిత్రం (సరోజా దేవి, ఎమ్. జి. ఆర్.), శ్రీ నాగేంద్ర ఫిలిమ్సు వారు "మల్లె మనసులు", శ్రీ యువ ఆర్ట్ పిక్చర్స్‌వారు "రాజ్యకాంక్ష" నిర్మించ దలచారు.

"సుడిగుండాలు"లో మరొక ఆకర్షణ

చక్రవర్తి చిత్రావారి "సుడిగుండాలు"లో బాలల నృత్య విన్యాస విశేషాలను ఫిబ్రవరి రెండవ వారంలో హైదరాబాద్‌లో చిత్రీకరించారు. ఉగాది ప్రాంతాల విడుదల కాబోయే ఈ చిత్రానికి దర్శకుడు ఆదుర్తి. ఛాయాగ్రహణ దర్శకుడు: కమ్మన రామకృష్ణారావు, నిర్మాతలు: అక్కినేని నాగేశ్వరరావు, ఆదుర్తి సుబ్బారావు.

* * *

అమంచర్ల శేషగిరిరావు జయా ప్రొడక్షన్స్ జానపద చిత్ర నిర్మాణాన్ని ఫిబ్రవరిలో ప్రారంభించారు.



"భార్య" చిత్రంలో
వాణిశ్రీ

మార్చి విశేషాలు

డి. వి. యస్. ప్రొడక్షన్స్‌వారి "తిక్క శంకరయ్య" (రామారావు, జయలలిత, కృష్ణకుమారి, డి.యోగానంద్, డి.వి.యస్. రాజు) నిర్మాణం ఫిబ్రవరిలో పూర్తయ్యే అంతిమ స్వరూపం ధరిస్తున్నది.

నాగేశ్వరరావు ద్విపాత్రాభినయం చేస్తున్న రాజ్యంపిక్చర్స్‌వారి "గోవులగోపన్న" మార్చిలో విడుదల కాపీ తయారు చేస్తుంది. (రాజశ్రీ, భారతి, గుమ్మడి, రేలంగి, సూర్యకాంతం, సి. యస్. రావు).

పద్మనాభం నారదుడిగా నటించి, తొలిసారి దర్శకత్వ బాధ్యత వహించే "శ్రీ రాముని కథ" సంగీతకథ మార్చిలో ఆరంభమౌతుంది.

జి. వరలక్ష్మి "మూగజీవులు" సెన్సార్‌అయి మార్చి విడుదలకు నిరీక్షిస్తున్నది.

ఏనాడో సెన్సార్ అయిన మధు పిక్చర్స్‌వారి "మంచి కుటుంబం" (నాగేశ్వరరావు, జానకి, కాంచన, గుమ్మడి, విజయనిర్మల, కృష్ణ, మల్లిఖార్జునరావు, వి. మధుసూదనరావు, గోపాలకృష్ణ, సెల్వరాజ్) మార్చిలో విడుదలై స్త్రీ ప్రేక్షకులను మరింతగా ఉద్రూత లూగించగలదు.

సీతారామాంజనేయ ప్రొడక్షన్స్ "తోటరాముడు" సాంఘికం (రామారావు, కృష్ణకుమారి, గిడుతూరి సూర్యం) మార్చిలో స్క్రిప్టువర్షన్ చూచుకొంటుంది.

పద్మశ్రీ వారి "వింతకాపురం" ఫిబ్రవరికి ఏడురీళ్ళు అయి మార్చిలో మరింత ముందుకు సాగుతుంది.

అజం ఆర్ట్స్‌వారి "తల్లి ప్రేమ" మార్చిలో విడుదల కాబోతున్నది. రామారావు, సావిత్రి, రామమోహన్, కాంచన, నాగభూషణం, రేలంగి, ఛాయాదేవి, కె. వి. చలం తారాగణంలో కలరు.


సంగీతం: సుదర్శనం, దర్శకత్వం: శ్రీకాంత్, నిర్మాత: యమ్. అజం.

జయంతి జానపదం

జయంతి పిక్చర్స్ హాస్యభరిత జానపదం నిర్మాణం తిరిగి ఫిబ్రవరి రెండవ వారంలో వాహినీలో ప్రారంభమైంది. చిత్రకళ యందు అభిరుచిగల రాకుమారునిగా రామారావు, జలపాత జలకన్యగా బి. సరోజాదేవి, భోగిగా, యోగిగా రాజనాల, భలేమంత్రిగా లింగమూర్తి, రాజుగా ముక్కామల నటిస్తున్న ఈచిత్రం సాంకేతిక ముఖ్యులు కె.వి. రెడ్డి, పింగళి నాగేంద్రరావు, పెండ్యాల, కమల్ ఘోష్.

ఆలీబాబా రామారావు

గౌతమీ పిక్చర్స్‌వారు తీయబోయే "ఆలీబాబా 40 దొంగలు" చిత్రంలో ఆలీబాబాగా రామారావు నటించబోతున్నారు. డి. వి. నరసరాజు స్క్రిప్టు వ్రాశారు. మార్చికే నిర్మాణం సాగుతుంది.



"భార్య" చిత్రంలో
శోభన్‌బాబు

నిర్మాత శృంగార కవితా గానం

కౌముది ఫిలిమ్స్ ('భార్య' చిత్ర కర్తలు) నిర్మాత, 'సహజకవి' బిరుదాంకితులు శ్రీ యం. యస్. రెడ్డి ఫిబ్రవరి 11 వ తేదీన ఫిలిం పత్రికా రచయితలను సమావేశపరచి సినిమా పరిశ్రమ స్థితిగతుల గురించి, తాము తీసిన 'భార్య' చిత్రం విశేషాలు గురించి, ఆంధ్ర సారస్వతంలో తనకు గల అభిరుచి గురించి ముచ్చటించారు.

కుటుంబ దారిద్ర్యంవల్ల 11 వ ఏటే చదువుపోయి, మూడురోజులు పస్తు పడుకొని, నెలకు ఎనిమిది రూపాయల జీతంతో గుమాస్తాగా పనిచేసి, దరిమిలా స్వంతంగా మైకా వ్యాపారం ప్రారంభించి, ఆంధ్ర సాహిత్యంపై వున్న అభిమానంకొద్దీ సినిమా నిర్మాత అయ్యానన్నారు యం. యస్. రెడ్డి.

గూడూరు వాస్తవ్యులైన శ్రీ రెడ్డి శ్రీ కొండమాచారి అనే తెలుగు పండితునిచే 'భార్య' చిత్రంలో సినిమా పాటు వ్రాయించినట్లు చెప్పారు.

200 సంవత్సరాల క్రితం గూడూరు మండలంలో సహగమనం చేసిన నారాయణమ్మ విషాధగాథ ఆధారంగా రచించిన 'నారాయణమ్మ' అనే పద్యకావ్యంలోని ముఖ్య భాగాలను శ్రీ కొండమాచారి సభికులకు చదివి వినిపించారు.

అనంతరం 'సహజకవి' శ్రీ యం. యస్. రెడ్డి తాము ఒకప్పుడు రచించిన 'మొదటిరాత్రి' అనే గృహస్థాశ్రమ పద్య కావ్యంలోని శృంగార ఘట్టాలు గానం చేశారు.

సభ్యుల ప్రశ్నలకు ఆశు కవితలోనే సమాధానం చెప్పారు.

సినిమా పరిశ్రమపైన ప్రజలలో, శ్రేయోభిలాషులలో, బంధువులలో చాలా చెడ్డ అభిప్రాయాలున్నాయంటూ ఇప్పటికి నాలుగు చిత్రాలు తీసిన తను పరిశ్రమ గురించి ఇలా చెప్పగలనని కవితా ధోరణిలో అన్నారు.

'ప్రతి ఒక్కరి జీవితంలో ప్రతి దినం ఒక సందేశం ఇస్తుంది. సింహం మృగరాజు అయినా పది అడుగులు ముందుకువేసి, ఆగి అవలోకనం చేసుకొంటుంది. మనం కూడా సింహావలోకనం చేసుకొంటూ ప్రగతి పథంలో నడవాలి.'

చిత్ర నిర్మాణం బహు క్లిష్టమైందంటారు. అందరి సహకారం లభించడం క్లిష్టమంటారు. కాని 'భార్య' చిత్రాన్ని 0 రోజులలో ముగించాను. తారలతో, టెక్నిషియనులతో మనం సహకరిస్తే వారూ మనతో సహకరిస్తారు. భారత సంస్కృతి ప్రతిబింబించే చిత్రం తీయాలనుకొన్నను. సారస్వతంలో అంతో యింతో ప్రవేశం వుండడమే నాకా అభిప్రాయం కలిగించింది. భర్త విడాకులిచ్చి విడిపించినా అతడే దైవం అని యెంచే 'భార్య' కథ మా చిత్రం కథ.

ఉత్తరాలు

రాగరంజని, సంగీతప్రియ మనోరంజకంగా ఉంది.

రోషన్‌కీర్తి ఆయన సంగీతానికిమల్లే నిత్యనూత్నం. శ్రీ వి. ఎ. కె. వ్రాసిన వ్యాసం రోషన్ గురించి వివిధ పత్రికలలోవచ్చిన వ్యాసాలకు తలమానికంగా వుంది.

—తార

శ్రీకాకుళం.

జ్యోతి ఫిబ్రవరి సంచిక చాలా బాగున్నది.

అందులో 'పూర్‌క్రీచర్స్' కథ భేషుగ్గా ఉన్నది. కథా రచయితకు కంగ్రాచ్యులేషన్స్.

విషాదాంతం - తనకు తెలియని నిజం అనే కథలుకూడా ఉత్తమంగా ఉన్నాయి.

కవితలు - నగరంలో రాత్రి, కన పడనినీడ అత్యుత్తమంగా ఉన్నాయి.

నెలనెలా క్రొత్తతనం సంతరించుకుంటున్న జ్యోతికి అభినందలు—మీకున్నూ—ఉంటాను.

సంపత్‌కుమార్,

పొన్నూరు.

ఫిబ్రవరినెల జ్యోతిలో ప్రచురించిన పి. రామలక్ష్మిగారి 'భాస్కరం' తల్లావజ్ఝల పతంజలిగారి 'తనకు తెలియని నిజం' రచనలు బాగున్నాయి. 'పనికిరాని పరిజ్ఞానం' విజ్ఞానదాయకంగావుంది.

ఈమధ్య జ్యోతిలో హాస్య శీర్షికలు ఎక్కువ చేశారు. జ్యోతిని కేవలం హాస్య పత్రికగామాత్రం తయారుచేయవద్దని మా మనవి.

చిల్లా శేషు

సి హెచ్. సాంబశివరావు,

చండీఘర్.

మీరు నెలనెలా ప్రచురించుతున్న ద్వివేదుల విశాలాక్షిగారి సీరియల్ నవల 'గోమతి' చాలా గొప్పగా ఉంది. అందులో గోపాలం పాత్ర చాలా బావుంది. చివరికేమవుతుందోనని మేమంతా ఆరాట పడుతున్నాము. ఇంత చక్కగా రచిస్తున్న విశాలాక్షిగారికి మా అభివందనములు తెలుపగోర్తాము.

మంత్రాల

సుధాకర శర్మ,

మద్రాసు.

'గోమతి' సీరియల్ అత్యద్భుతంగా నడుస్తోంది. రాగరంజనిలో నా అభిమాన సంగీత దర్శకుడు రోషన్‌ని మాకు మళ్ళీ కనిపింపచేశారు.

'ప్రముఖుల హాస్యాలు' చాలా బాగుంటున్నాయి. 'విషాదాంతం'

అంత బాగా లేదు. 'భాషకోసం' చాలాబాగుంది

సినిమా, పిట్టకథలు, పలుకులాంటి పరిజ్ఞానాలు 'జ్యోతి'కి వన్నెతెచ్చినాయి. మీకు నా అభినందనలు.

యస్. వి. కృష్ణారావు,
బాపట్ల.

ఫిబ్రవరి 'జ్యోతి' లో 'పూర్ క్రీచర్స్' అనే కథ నాకు చాల బాగా నచ్చింది. కథలతో పాటు ముద్రించిన శీర్షికలు, పాఠకులకు ఆనందోత్సాహమిచ్చునని వేరే చెప్పనక్కరలేదు.

ఎ. కె. హుసేన్ పీరాన్,
గుంతకల్లు.

రాను రాను జ్యోతి మరింత మరింత ఆకర్షణీయంగా తయారవుతూంది. ఈ నెల(ఫిబ్రవరి) సంచికలో శ్రీ భమిడిపాటి రామగోపాలంగారి "పూర్ క్రీచర్" అనేకథ శ్రీ తల్లావఝ్ఝల పతంజలిగారి 'తనకు తెలియనినిజం' అనేకథ అత్యుత్తమంగా ఉన్నాయి. కీర్తిశేషులు రోషన్ గురించి శ్రీ వి ఎ కె రంగారావుగారివ్యాసం ఎంతో బాగుంది. ఖరీదైన కాంగ్రెసు ప్రహసనం గురించి వేరే రాయనక్కరలేదు—

ఈ నెల మరో ఆకర్షణ కవితలు. నగరంలో రాత్రి-శ్రీ రెంటాలగోపాలకృష్ణగారి రచన అబ్బో-ఘాటుగా ఉంది. రజనీప్రియగారి 'కనబడని నీడ' కమ్మగా, హాస్యంగా ఉన్నది ఇలాంటి హేలావాద కవితలు మన తెలుగులో చాలా అరుదు. శ్రీ రజనీప్రియగారి ప్రయత్నం అభినందించదగినది.

సినిమా బొమ్మలు అరికేసినట్టు ఉంటున్నాయి. వాటి ప్రింటు విషయంలో మరికొంత శ్రద్ధ తీసుకుంటే బాగుంటుందనుకుంటాను.

టి. శ్రీనివాసమూర్తి,
తెనాలి.

ప్రతినెలా జ్యోతిలో నాకు కథలకన్నా పనికిరాని పరిజ్ఞానం, ప్రముఖుల హాస్యాలు, పొట్టికథలు, భావలహరి శీర్షికలు బావుంటాయి.

'గోపతి' సీరియల్ రచయిత్రి ప్రతిభావంతంగా నడిపిస్తున్నారు.

యం. వి. యస్. రావు,
ఆలమూరు.

ఫిబ్రవరినెల 'జ్యోతి' ముఖ్యంగా మమ్ములను చాల ఆకర్షించినది. శ్రీ రంగారావుగారు రచించిన వ్యాసము "రోషన్ గయే మగర్ రోషన్ రహేగి" చదివి చాలా సంతోషమొందినాము.

సి హెచ్. భూమయ్య,
ఆజమ్‌గంజ్,
బోధన్.

Edited and Published by V. V. Raghavaiah
and Printed by him at Jyothi Printers,
Congress officeRoad, Governorpet, Vijayawada-2.

భావలహరి

బోధపడడానికి భయపడేవాడు అభయంతో బాధపడుతూనే వుంటాడు.

—మాంటేన్

*

జంతువులన్నీ సమానమే. కాని కొన్ని మిగిలిన వాటికంటె ఎక్కువ సమానం.

—జార్జి ఆర్వెల్

*

"సమయ మమూల్యమొక్క నిమిషంబు వృథా జన గ్రమ్మరింప నేరము ..."

—దువ్వూరి రామిరెడ్డి

*

అంత దారుణమైన క్లేషలు ప్రయోగించే మనిషి జేబులు కత్తిరించడానికి కూడా వెనకాడడు.

—జాన్ డెన్నిస్

*

సైతాను అనేవాడు నిజంగా లేకపోతే, వాడిని మనిషే కల్పించి నట్టయితే, తనకు ప్రతిబింబంగానే కల్పించి వుండాలి.

—డాస్టొవిస్కీ

*

బీదరికం మహాపాపం!

—జి. బి. షా.

*

ఆస్తి సంపాదించడం దొంగతనమే.

—ప్రొధన్

*

"జీనియస్" అంటే నూటికి తొంభైతొమ్మిది వంతులు చెమట, ఒకవంతు తెలివితేటలు.

—థామస్ ఆల్వాఎడిసన్

*

ప్రతి కళాఖండం కళాకారుని జీవితచరిత్రే.

—హావ్‌లక్ ఎల్లిస్

*

చరిత్ర అంటూ లేనేలేదు-మానవుల జీవితచరిత్రలు తప్ప.

—ఎమర్సన్

*

కొంచెం ఎబ్బెట్టు లేనిదే హాస్యం లేదు.

— సోమర్సెట్ మామ్.

*

ఒకదేశం యోగ్యత ఆ దేశంలోని వ్యక్తుల యోగ్యతే.

— జాన్ స్టూవర్ట్ మిల్

*

బ్రతికి యుండిన సుఖములు బడయవచ్చు.

—తిక్కన

□□□

హిమబిందు

తటవర్తి



డాక్టరు రాజశేఖరంతో హిమబిందు పరిచయం విచిత్రంగా జరిగింది. ఆ గ్రామానికి అతనువచ్చి ఏడాది కావస్తున్నా పేరు వినటమేకాని ఆమె ఎప్పుడూ ఎదుటపడి ఎరుగదు! ఆ అవసరమూ లేకపోయింది.

మొదటిసారిగా ఆవేళ బాబును తీసుకొని ఊరికి ప్రక్కగాఉన్న పెద్ద చెఱువుగట్టుకు వ్యాహాళిగా వెళ్ళింది హిమబిందు. చెరువులోని తామర పూవులు, తామరాకులు - వాటిపై ముత్యాల్లా నీటిబిందువులు ఆకర్షించాయి బాబుని.

నాలుగేళ్ళ బాబుకి నలభై రకాల ఊహలు! వాడి చిన్నారి చేతినుంచి గులకరాళ్ళు నీటిలోకురికి కితకితలు పెడుతూ చిరుకెరటాలను తెరలు తెరలుగా లేపుతున్నాయ్. వాడి కేరింతలు ఊకొడుతూనే తన ఆలోచనల్లో పడిపోయింది ఆమె.

గత విషాద చరిత్ర గుర్తుకువచ్చి మనస్సంతా వికలమై పోయింది. తండ్రి ఎవరో చెప్పుకోలేని ఈ పసివాని బ్రతుక్కికి విలువుందా? రేపు తోటిపిల్లలు అడిగే ప్రశ్నలకి సమాధానం చెప్పలేక చిన్నబుచ్చుకునే ఆ పసివాడిని ఎలా బుజ్జగించాలి? ఏమని చెప్పాలి? భవిష్యత్తు ఎలా ఉంటుందో?—

బాహ్య స్మృతిలేని హిమబిందు బాబు ఎప్పుడు నీళ్ళవరకు వెళ్ళాడో గుర్తించలేదు. నీటిలోకి చొచ్చుకుపోయిన రావిచెట్టు వ్రేళ్ళు-వాటి మధ్య ఇరుక్కున్న తామరాకు - ఆ తామరాకుమీద పిల్లగాలికి ముచ్చటగా కదులుతున్న మూడు నీటి ముత్యాలు-వాడి నాకర్షించి ఆ ఆకునందుకోవడానికి ప్రోత్సహించాయి. చిరుచేయి రావివేరుమీద పట్టు తప్పింది. కాలుజారింది...

"అమ్మా!" అన్న కేక, బుడుంగుమన్న శబ్దము ఒక్కసారిగా ఆమెను మేల్కొల్పాయి. ఇది చూసి దూరాన పాలికాపు ఎవరో పొలికేక పెట్టాడు.

మరుక్షణంలో నిలువులోతు నీళ్ళల్లోకి దుముకబోయింది ఆమె.

మెరుపు మెరిసినట్లుగా ఎవరో బలంగా తనచేయి పట్టుకు వెనక్కి లాగటం, ఆ వెంటనే నీటిలో దుమికి ఒక్క మునుగులో బాబు జుట్టుపట్టుకొని పైకి రావటం జరిగిపోయింది.

పాంటు, షర్టు, టై ధరించిన ఆ వ్యక్తి ఆ సమయంలో అక్కడికి రావటం, అంత సాహసం చేయటం ఆమె నాశ్చర్య పరచింది. పాలెకాపు సంబోధనతో అతడే డాక్టర్ రాజశేఖరం అని ఆమె గ్రహించింది. హాస్పిటల్‌నుంచి ఆ వేళప్పుడు రోజూ తన బంగళాకు ఆ చెరువుగట్టు మీదుగా వెడుతూంటాడు అతను—విధిని మార్చడానికి ఒక్క క్షణం చాలు!

బాబుని నీటిగండంనుంచి కాపాడినరాజశేఖరం హాస్పిటలుకుతీసుకు వెళ్ళి చికిత్స చేశాడు. అరగంటలో వాడికి తెలివి వచ్చింది. కళ్ళతోనే కృతజ్ఞత తెలిపింది హిమబిందు.

"మీ పేరు చెప్పారుకాదు..." అతని ముఖంపై మందహాసం... తడిసిన ఉంగరాల ముంగురుల మెరుపులు—అతనిలో ఒక ఆకర్షణ వుంది!

"హిమబిందు."

"నీ అందమైన ముఖమే చెప్తోంది" అతని కళ్ళు మాట్లాడాయి.

సిగ్గుతో మరింత ఎర్రబడింది ఆమె ముఖపద్మం. "మీ మేలు ఎప్పటికీ మరువలేము. మా ఇద్దరి ప్రాణాలు కాపాడారు..."

"అది నా విధి. తోటివాళ్ళకి మాత్రం సహాయం చేయడం గొప్పతనమేమీకాదు."

'ఉహుఁ! ఇది ప్రాణదానం. అన్నిటిలోకి అతిగొప్పది.'

'కాదు. నాకు ఈత వచ్చును. కాబట్టే ఆపని చేశాను. ఇంతకంటె గొప్పవి ఇంకా ఉన్నాయి.

అతనికి పొగడ్తలు గిట్టవని ఆమెకు అర్థమైంది. '...ఇంటివద్ద అమ్మ, అక్కయ్య ఎదురు చూస్తుంటారు. ఇక సెలవు తీసుకుంటాను.'

* * *

ఈ విధంగా పరిచయస్తులై రోజూ సాయంత్రం చెరువుగట్టువద్ద కలుస్తూండటం పరిపాటయిపోయింది వారికి.

జీవిత మిందుకనే విచిత్ర సంపుటమైనది! ఒక్కో చిన్న సంఘటనే జీవనగతిని మార్చి వేస్తుంటుంది!

ఈ పరిచయంతో తన మనస్సు ఆమె వైపాకర్షించిందని గుర్తించాడు రాజశేఖరం! ఆమె ఏ కారణం చేతనయినా ఒకనాడు రాకపోయితే, ఆ వేళల్లా ఏదో పోగొట్టుకున్న వాడిలా మధన పడేవాడు. ఆ మరునాడు ఆమె దర్శనంతో మనస్సు పులకించి పరువెత్తేది.

వరుసగా రెండురోజులు రాలేదు హిమబిందు. అతని మనస్సు మనస్సులో లేదు. ఆమె ఇంటికి వెళ్ళి చూడాలనిపించింది. కాని ఎలా? ఇల్లు తెలియదు. పోనీ వాకబు చేసుకొని వెళ్ళినా ఏంపని ఉందని వెళ్ళగలడు? మధన పడుతూఉన్న అతనికి మూడోనాడు ఆమె దర్శనమైంది.

ఎదురు చూసి చూసి పొందిన అనుభవం ఎప్పుడూ అతిమధురంగా, ప్రియాతిప్రియంగా ఉంటుంది!

ఈనాడు ప్రపంచంలోని సౌందర్యాన్నంతా తనలోనే ఇముడ్చుకు వచ్చినట్లుగా కనిపించింది హిమబిందు. ఒక్కసారిగా ఆమెను తన బాహువులమధ్య దాచుకోవాలనుకున్నాడు. కాని, ఇంకా అంత చనువేది? తన మనస్సు గ్రహిస్తున్నట్లుండే ఆమె కళ్ళు తననింకా ఎందుకు పరీక్షిస్తున్నాయి? 'ఈవేళ ఏమయినాసరే ఆమె నడిగి వేయా' లనుకున్నాడు రాజశేఖరం.

చిరునవ్వుతో బాబు పలకరించాడు అతన్ని. వాడిని హిమబిందు చేతులనుంచి అందుకున్నాడు శేఖరం. కొంతసేపు వాడి కబుర్లు సాగాయి.

అతని ప్రశ్న ముందే గ్రహించి, '...మొన్న అక్కయ్యకు జ్వరం తగిలింది. అందుకని రాలేదు' అంది ఆమె.

'అరే, ఎవరినయినా మందుకు పంపకపోయేరా? లేకపోతే హాస్పటలుకు తీసుకు రాకపోయారా?'

'తనే కదలనిచ్చింది కాదు. తగ్గిపోయిందిలెండి. ఈ వేళే పథ్యం పెట్టాము.'

'మీరే మనుకోనంటే ఓ మాటడగనా?'

'నేనేమీ అనుకోనని మీకు తెలియదూ?'

'తెలుసు. కనుకనే మీ స్వంత విషయాలడిగే సాహసంచేస్తున్నాను. మీ అక్కయ్యను ఎప్పుడూ తీసుకు రారేం?...'

'అక్కయ్యనా? అంత అదృష్టమా!' ఆమె ముఖం వెలవెల బోయింది. నీళ్ళు నిండిన ఆమె కళ్ళు చూసి అతను చలించిపోయాడు.

'క్షమించండి— తప్పుగా అడిగితే!'

'లేదు ... లేదు. మీ సహృదయాన్ని భరించగల నిర్మల జీవితాలు కావు మావి.'

'నా కర్థంకాలేదు.'

'అక్కయ్యవితంతువు. పెళ్ళయిన నెలరోజులకే భర్తని కోల్పోయిన నిర్భాగ్యురాలు.'

'అది ఆమె అపరాధం కాదు. ఆమెకు జీవితంపై మమకారం పెంచవలసిన బాధ్యత మీపై ఉంది.'

'అవును అదే నేను ప్రయత్నిస్తున్నది. ఎప్పటికయినా మా జీవితాల్లో వెలుగు తొంగిచూస్తుందా? కడుపు నిండుగా నవ్వుకోగలమా? ఏమో! ...' తనలోతాను అనుకున్నట్లుగా అన్నది, ఆమె నేలపై చేతికందిన పుడకతో పిచ్చిగీతలుగీస్తూ.

'అంత నిరాశగా మాట్లాడవద్దు. నా సహాయం మీకు ఎప్పుడూ ఉంటుంది! ఎందుకో మీతో పరిచయమైనప్పటినుంచి మీరు నాకెంతో దగ్గరయినట్లు–నా కాత్మీయులైనట్లు...'

బిత్తరగా చూసింది ఆమె.

'...అవును బిందూ! ఈ భావన ఎలా కలుగుతోందో చెప్పలేను. రెండురోజులుగా మీరు రాకపోతే నేనేదో పోగొట్టుకున్నట్లు ఫీలయ్యాను. ఇప్పుడు నాకెంత తేలిగ్గా, హాయిగా ఉందో... నా ముఖం చెప్పడంలేదూ?' అతని మధుర మందహాసాలతో ఆమె మనస్సు, తనూలత, పులకించాయి.

'నాకూ అలాగే అనిపిస్తోంది' అని అందామనివుంది. పెదవులు వణికాయి. మనోవ్యథ గొంతు పెగలనివ్వలేదు ఆమెని.

'మనస్సులోని మాట ఎంత కాలమని దాగుతుంది? మీ మనస్సు నాకు తెలుసు బిందూ!'

'...అబ్బ, అలా పిలవకండి' ఆమె కంఠం వణికింది.

అతను తెల్లబోయాడు. 'ఏం? అలా పిలిచే హక్కు లేకపోయినా, అర్హత నాకు లేదా?'

'అది కాదు. అదికాదు... పిలిపించుకునే అర్హతే నాకు లేదు.'

'మీ మొహం ఇదివర కెక్కడో చూసినట్టుందండీ!'

'నా దగ్గిరే చూసుంటారు!'

'ఛ! ఎందుకీ కన్నీరు...' తన చేరుమాలుతో ఆమె బుగ్గలు వొత్తాడు శేఖరం.

"అందమైన కనులున్నది నవ్వి నవ్వించడానికి కాని, కన్నీరు కురిపించటానికి కాదు. మంచి మనసన్నది మమతలతో మాధురీమయం చేసుకోటానికి కాని వేదనాగ్నిరగిలించటానికి కాదు."

కొంతసేపటికి తేరుకున్న హిమబిందు సాలోచనగా అన్నది "ఈ స్నేహమిలా నిలిచిపోతే ఎంత బాగుంటుంది?"

'ఎందుకు నిలవదు? మీ మనస్సులా, మీ సౌందర్యంలా, మీ పేరులా ఈ స్నేహం ఎప్పుడూ స్వచ్ఛంగా నిర్మలంగా ఉంటుంది. ఇది ముమ్మాటికీ నిజం!' ధృడంగా ఉన్నది అతనిగొంతు.

తల అడ్డంగా త్రిప్పింది ఆమె. "అంతటి అరాధనకి నేను నోచుకోలేదు."

'ఏం? ఎందుకని?'

ఒక్క క్షణం ఆగి రెండు గజాల దూరంలో ఆడుకుంటున్న బాబును చూపిస్తూ, 'వాడెవరో తెలుసా? మీకు తెలియదు... వాడు....వాడు, నా కొడుకు. నా పాపానికి ఫలితం!' అంటూ దోసిట్లో ముఖం దాచుకుంటూ వెక్కి వెక్కి ఏడవసాగింది హిమబిందు.

కొరడా దెబ్బ తిన్నవాడిలా ఉలిక్కిపడ్డాడు శేఖరం! కడుపులో ఏదో దేవినట్లయింది.

"పిన్నీ, పిన్నీ! ఎందుకేడుస్తున్నావు' అంటూ బాబు వచ్చాడు.

"ఏం లేదు బాబూ!...కంట్లో నలకపడిం దంతే!" అంటూ వాడిని ఒడిలోకి తీసుకొని దుఃఖ మాపుకోడానికి విఫలప్రయత్నం చేసింది ఆమె.

ఓ నిశ్చయానికి వచ్చినవాడిలా శేఖరం అన్నాడు 'మీరు నన్నెందుకిలా మభ్యపెడుతున్నారో నా కర్థం కావటంలేదు. బాబు పిల్చిన పిలుపునుబట్టి ఆమాత్రం అర్థం చేసుకోలేనా? అసలు మీ అభిప్రాయం ఏమిటి?"

'అదికాదు డాక్టర్! వీడు నా కొడుకే! భవిష్యత్తుకి అటంకం రాకుండా మా అమ్మ, అక్కయ్య వాడికలా తర్ఫీదిచ్చారు. నిస్సహాయతతో ఓ దుర్నీతిపరుని నమ్మినందుకు ప్రతిఫలంగా చేసిన పాపాన్ని నిత్యం గుర్తుకుచేస్తూ తన మాటలతో మరింతగా మనస్సును పిప్పిచేస్తున్న నిర్భాగ్యుడు వీడు. నా గుండెల వంటకాదు ... నా మనస్సులో రగిలే మంటకి ప్రతిరూపమిది!"

'ఈ అమృత కలశాన్ని కాలదన్నుకొన్న ఆ మూర్ఖుడేమయ్యాడు?"

పొంగివస్తున్న కన్నీళ్ళను అపుకుంటున్నది ఆమె. 'తెలియదు. పెళ్ళాడతానని నమ్మించి ఫలితం విన్నవెంటనే పరారీఅయ్యాడు. అతనిదికాదు మూర్ఖత! ఊళ్ళో తలెత్తు

కోలేక నాన్నగారు ఆ ఊరునుండి మకాము ఎత్తివేశారు. మేమీ వూరువచ్చి నాలుగేళ్ళయింది. పెళ్ళయిన కొద్దిరోజులకే పెద్దకూతురు వితంతువుఅయింది. కాలేజీలో చదివే చిన్నకూతురు దారి తప్పి మోసపోయింది. పుట్టిన పిల్లలిద్దరూ ఇలా అయిపోతే ఆ తండ్రి హృదయం ఎంతక్షోభిస్తుంది? అదే వ్యథ ఆయన శక్తిని పీల్చి పిప్పిచేసి ఆఖరికి ప్రాణాలు తీసింది. ఆయనపోయి రెండేళ్ళయింది. వ్యథా భరితమైన మా జీవితాలు, మోడువారిన మేమూ మిగిలాము. మాలో ... మా బ్రతుకులో, మా చుట్టూ ... అంతా చీకటి. కటిక చీకటి ... ఎప్పటికీ వెలుగురాని చీకటి. అంతే డాక్టర్! అంతే ...'

పదినిమిషాలవరకు ఎవరి నోటి వెంట మాటలేదు. శేఖరం మనస్సు కలగిపోయింది.

ఓసారి కళ్ళు తుడుచుకొని హిమబిందు అన్నది "మీ కీ హీన చరిత్ర చెప్పకూడదనే అనుకున్నాను. నాపై మీకుండే సదభిప్రాయాన్ని పోగొట్టుకోకూడదనుకున్నాను. కాని, మీరు పట్టుపట్టారు. నేను చెప్పక తప్పలేదు, ఇప్పటికయినా నాకు మీముందు నిలబడే అర్హత లేదని మీరు గ్రహించి ఉంటారు. ఈ పాపాత్మురాలు మిమ్మల్ని ఏ విధంగానైనా ఆశపెట్టివుంటేక్షమించండి డాక్టర్! క్షమించండి ... సెలవు" అని అతనికి చేతులు జోడించి పైకిలేచింది ఆమె.

"బిందూ! ..." ఒక్క కేకతో ఆమె చేతిని పట్టుకొని తనవైపు లాక్కున్నాడు శేఖరం. ఆమె తెల్లబోయింది. అతని కళ్ళలోని విచిత్రమైన కాంతి ఆమెను చకితురాల్ని చేసింది.

"వీల్లేదు. నిన్నెప్పటికీ ఒంటరిదాన్ని చేయను ... క్షమించు—ఏకవచనం ప్రయోగిస్తున్నందుకు. ఇన్నేళ్ళకు నా మనస్సుకు నచ్చిన వ్యక్తి నాకు దొరికిందనుకున్నాను. నీ కథ విన్నాక కూడా నా అభిప్రాయం మారలేదు. ఇది ముమ్మాటికీ నిజం ... ... భగవత్సాక్షిగా ..."


"ఆవేశ పడకండి. మీ పవిత్రమైనజీవితంలోకి పతితనెందుకు చేర్చుకుంటారు? తెలిసి ఈ ఎంగిలి బ్రతుకులోకి మిమ్మల్నెలా ఆహ్వానించను? ..."

"అగ్నిలో తుప్పుపట్టిన ఇనుము పడవేస్తే ఆ ఇనుమే శుద్ధ అవుతుంది కాని ఆ అగ్నికేమీ అంటదు. నిన్ను వదులుకున్నవాడు నిర్భాగ్యుడు కాని ... నువ్వు కాదు. కలలోకూడా నీలో దోషాన్ని చూడలేను నేను ..."

"... మీరు పొరబడుతున్నారు. దూరం ఆలోచించండి. వీడు నా కొడుకు ..."

"నన్ను నీవు అనుగ్రహిస్తే నా కొడుకవుతాడు."

అతని మధుర మందహాసం ఆమెను పిచ్చిదాన్ని చేసింది. "... నన్ను ఆలోచించుకోనీయండి. నా మూలంగా మీరు ..."



"... అదృష్టవంతుడి నవుతాను. ఆలోచించుకో. గంటలు, రోజులు, నెలలు ... ఎంతకాలమైనా సరే ... నన్ను నీ వాడిని చేసకో! అంతే ... బిందూ! అదేనాకు కావాలి ..."

ఆమె మూగదయి పోయింది ... బాబు నెత్తుకొని ఆమె మందగమనంతో వెళ్ళిపోతుంటే అలాగే ఆర్ద్ర నయనాలతో నిలబడిపోయాడు రాజశేఖరం! అతనికెంతో రిలీఫ్‌గా ఉంది. తన అన్నావదినల అనుమతి తనకెప్పుడూ ఉంటుందన్న విశ్వాసం అతని మనోనిశ్చయానికి పెట్టని కోటలా నిలబడింది.

*　　*　　*

ఆ తర్వాత ఒకనాడు హిమబిందు ఒంటరిగా వచ్చింది. ఆమె భావం గ్రహించి, "అలా మా బంగళావాకా వెడదాం నడు. ఎన్నిసార్లు రమ్మన్నా వాయిదా వేశావు" అన్నాడు శేఖరం ఆప్యాయంగా.

ఏవో కబుర్లతో నడక సాగించాడు అతను. ఆమె ఊకొడుతూ అనుసరించింది. పదినిమిషాల్లో బంగళాని చేరుకున్నారు.

బంగళాచుట్టూ పూలమొక్కలు, క్రోటన్సు ... అంతా కన్నుల పండువగా ఉంది. మల్లె పందిరి క్రింద కుర్చీలలో ఆసీనులయ్యారు ఇద్దరూ.

హిమబిందు మనస్సునేదో ప్రశాంతత ఆవరించింది.

వంటవాడు మైసూరుపాకు, కాఫీ ట్రేలో పెట్టి తెచ్చాడు.

"ప్లీజ్!... నాకేం తినాలని లేదు."

"నాకోసం."

"అవును. మీకోసం... ఏం చేయటానికైనా సరే సిద్ధపడే వచ్చాను."

"అదృష్టవంతుడిని."

"కాదు. అదృష్టం నాది."

"పోనీ, ఇద్దరిదీను" అతని మందహాసంతో శ్రుతికలుపలేక పోయింది ఆమె.

పలహారం పూర్తయిందనిపించింది ఆమె. "ఇక్కడెవరూ లేరు కదా!"

"ఉహుఁ! నేను, వంటవాడు. అంతే! తోటమాలి వెళ్ళిపోయాడు. నీవు అంగీకరిస్తే ఇక నా అన్నావదినలువచ్చి మనల్ని దీవించటమే తరువాయి..." అతని కళ్ళల్లో, ఎన్నో ఆశాజ్యోతులు! ఆమె హృదయంలో ప్రళయ తాండవ జ్వాలలు! మధ్య అనే లోయ కిరువైపులా రెండు ప్రాణులు - ఒకేవైపుకు రావాలన్న ప్రాకులాట!

"మీరు నాకొక మాట ఇవ్వగలరా?"

"నేనే నీ వాడిని కాబోతున్నప్పుడు నీకింకా సందేహాలెందుకు బిందూ!"

గుండెల్ని చిక్కబట్టుకుంటూ అన్నది ఆమె. "ఈ ఆనందం భరించటానికిముందు నా బాధ్యత మరి ఒకటిఉంది..."

"నీకోసం... నీ ఆనందంకోసం ఎంత బరువైన బాధ్యతైనాసరే నేను వహిస్తాను... సహిస్తాను."

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "పాపిష్టిదాన్ని. నా మాటలతో మిమ్మల్ని కష్టేస్తున్నాను. మీరు నా కోరికవింటే..."

ఆమె చేతివ్రేళ్ళను నిమురుతూ అన్నాడు శేఖరం. "ఎంత కష్టమయినదయినా భరించటానికి సిద్ధంగా ఉన్నాను బిందూ! నీకోసం వ్యథను భరించటం కూడా ఓ అదృష్టం..." అతని కంఠంలోని ఆవేశం ఆమెను కరగించి కన్నీటిగా పారించింది.

ఓ నిమిషం ఆగి కళ్ళు తుడుచుకొని తన హేండ్‌బేగ్‌లోంచి ఓ ఫొటో తీసి అతని చేతి కందించింది హిమబిందు. తెల్లబోతూ అది తీసుకున్నాడు అతను.

నవయౌవన విలాసిని, సుహాసిని సుకేశిని.. నుదుట తిలకం, కాటుక కళ్ళమధ్య కాంతు లీనుతోంది—పోలికను బట్టి ఆమె హిమబిందు సోదరి అని గుర్తించాడు శేఖరం. పెళ్ళికి ముందు ఫొటో కావచ్చు!

అది తనకు చూపించటంలో హిమబిందు ఉద్దేశం అర్థం కాలేదతనికి. అతను తలెత్తి చూసేసరికి "అక్కయ్య సుశీల!" అన్నది ఆమె.

"గుర్తించాను. కాని..."

"...దురదృష్టంకొద్దీ నెలరోజుల

వైవాహికజీవితం అలా ముగిసిపోయింది కాని... సుగుణాలరాశి — తన కేంకావాలో తెలుసుకోలేని అమాయక ఆమె."

"ఇదంతా నాకెందుకు చెప్తున్నావో..."

"...వినండి. ఆమెకంటె చిన్నదాన్నయినా... ఆమెకు మళ్ళా పెళ్ళి చేయవలసిన బాధ్యత నా మీద ఉంది. మా నాన్నగారి కిచ్చిన మాట నేను నెరవేర్చుకోవాలి."

"అంటే..."

"మీరు వహించవల్సిన బాధ్యత ఇదే శేఖర్‌బాబూ! మీరు అక్కయ్యని పెళ్ళిచేసుకోవాలి. మా జీవితాలకు వెలుగు చూపించాలి..."

"బిందూ!..." వెర్రిగా కేక పెట్టాడు రాజశేఖరం. "...ఏమిటి నువ్వనేది?" ఎందుకిలా నన్ను పరిహసిస్తున్నావు?"

"పరిహాసం కాదు. ప్రార్థన! మా జీవితాల్లో వెలుగు ప్రసాదించమని అభ్యర్థన!..."

శేఖరం ముఖం వివర్ణమయింది. బాధతో మెలికలు తిరిగిపోయాడు.

"నన్నింత క్లిష్టసమస్యలో పడవేస్తావని నేనెప్పుడూ అనుకోలేదు బిందూ! ... ఈబాధ భరించలేను బిందూ! నిన్ను వదులుకొని ఎలా బ్రతుకను? ... నన్నెందుకిలా కష్టేశావు?" అంటూ ముందున్న బల్లమీద చేతుల్లో తలవాల్చేసుకున్నాడు అతను.

లావాను బయటకు పోనిచ్చిన అగ్నిపర్వతం కొంతసేపటికి చల్లారుతుంది!

హిమబిందు దృఢచిత్తురాలైంది. నెమ్మదిగా అతని జుట్టులోకి తన వ్రేళ్ళు పోనిచ్చి నిమురుతూ అన్నది. "శేఖర్‌బాబూ! మీ బాధ నాకు తెలుసు. ఓ పతితను మీ జీవితంలోకి నిస్సంశయంగా అడుగుపెట్టనివ్వగల మీ ధీరచిత్తం మరొక వితంతువును అదృష్టవంతురాల్ని చేయటానికి సందేహించలేదు. ఇక పోతే, మీరు కోరుకున్న దానికి విరుద్ధంగా జరగటానికి నా బాధ్యత తప్ప వేరే కారణమేమీలేదు. అక్కయ్యకు మీ సహృదయంలో చోటు దక్కుతుందనే నా ఆశ. ఆపైన మీరే నా సంరక్షకులయినప్పుడు నేనెప్పటికీ మీ మాటకు కట్టుబడి ఉంటాను. నేనెప్పటికీ మీదాన్ని. నా హృదయం విప్పి మీముందు ఉంచాను. ఆపై మీయిష్టం... నా అదృష్టం!..."

"బిందూ!..." గద్గదస్వరంతో తల ఎత్తాడు శేఖరం. అతని బుగ్గల నిండా కన్నీటిధారలు చూసి ఉలిక్కిపడింది హిమబిందు. ఆమె వికలమనస్కయైంది.

"అయ్యో!... మిమ్మల్నివిధంగా హింసిస్తున్నానా? నన్ను క్షమించండి శేఖర్! మీరిలా బాధపడటం నేను సహించలేను. నాదేతప్పు! నా అక్కయ్యకోసం నేను త్యాగం చేయటంలో అర్థంఉంది. మీరు పరాయి వ్యక్తికోసం..."

'అగు ... బిందూ! అగు. ఇంకేం చెప్పకు. నాగుండెల నిలా చీల్చకు. నువ్వు నాకు పరాయివ్యక్తివి కావు. నువ్వు నాలో జీవానివి. ప్రాణానివి. నీ కోసం ఈ గుండెలలో ఆఖరి స్పందన కూడ మిగిలి ఉంటుంది బిందూ! నామాట నమ్ము ...' అతని చేతివ్రేళ్ళమధ్య ఆమె కరతలం మృదువుగా నలిగిపోయింది.

'మీ త్యాగంతో పోలిస్తే నేనే పాటిదానను?...' ఆమె కనులార్ద్రిత చెందాయి.

'తప్పు. అలా అనకు. అది త్యాగంకాదు. ధర్మం ... నిజం బిందూ!'

'మీరు పూర్ణ పురుషులు. ఇది

నా భాగ్యం!' అతని చేతులు కళ్ళకద్దుకొని లేచి నిలబడింది హిమబిందు. 'పోయిరానా శేఖర్!... రేపు మీకోసం మాయింట్లో అంతా ఎదురుచూస్తుంటాము.'

బాధను నిగ్రహించుకుంటున్న అతని ముఖంలో నరాలు పొంగాయి. మౌనంగా తల పంకించాడతను.

ఆమె వెనుదిరుగబోతుంటే చేయి పట్టుకొని ఆపుచేశాడు అతను. 'బిందూ! గంటక్రితం వరకు నీలో ప్రేయసిని, స్త్రీత్వాన్ని చూసి ముగ్ధుడనయిన నేను ... ఇప్పుడు నీలోని దివ్య త్యాగానికి అప్రతిభుడి నవుతున్నాను. చేతికందిన వస్తువును ఎంత ప్రీతికరమయినదయినా సానుభూతితో మరొకరికి త్యాగంచేయగలవిశాల హృదయం నీకు దివ్యత్వాన్ని ప్రసాదిస్తోంది. నీ జీవితంలో ఏమచ్చ ఏర్పడినా అదంతా భ్రమ!– నీక్షేమంకోసం, నీ ఆనందం కోసంనే నను క్షణం పాటుపడతాను. మనస్సులో ఇంకేమీ పెట్టుకోకు... రేపు నేను మీయింటికి తప్పకుండా వస్తాను ...'

ఆనందబాష్పాలతో ఆమె అతని పాదాలపై వాలిపోయింది. గబుక్కున ఆమె భుజాలు పట్టుకొని లేవదీశాడు శేఖరం. 'నీస్థానం అక్కడకాదు, ఇక్కడ' అని తన గుండెలవైపు చూపించాడు అతను. ఆమె అతని గుండెలపై వాలిపోయింది. ఆమెను పొదివి పట్టుకొని ఆమె కవోష్ణబాష్పధారలని తన పెదవులతో తుడిచివేశాడు అతను.

◆ ◆ ◆

ఆ మరునాటి సాయంత్రం స్వాతి వాన కురిసింది. ముత్యపుచిప్పలు పరవశించాయి!

'అక్కా! వారే రాజశేఖర్...'

> పిల్లవానికి పాలు మాన్పింప దలచి
> అలదుకొన్నది చేదును పొలతి, ప్రణయ
> వేళ, దంతక్షతమునందు వెల్లబాఱు
> పతినిగని కిలకిలమని పడతి యనియె;
> 'కాపురాన కష్టాలును కలవులెండి'.
>
> — శివరామకృష్ణమూర్తి

అంటూ హిమబిందు పరిచయం చేసింది.

సుశీల నమస్కృతికి ప్రత్యభివాదం చేశాడతను.

'కూర్చొని మాట్లాడుతూండండి. ఇప్పుడే వస్తాను' అని హిమబిందు నిష్క్రమించింది.

ఒక్కసారి తన సోగకళ్ళనెత్తి శేఖరంవైపు చూసి తలదించుకున్నది సుశీల. ఆమె నుదుటిపై అరుణ తిలకం మెరుస్తోంది. ఫొటోలో

కంటె అందంగా ఉన్నది ఆమె. కాని కళ్ళక్రింద కనీ కనిపించని నలుపు వ్యధను వెలికి చూపుతోంది. ఆ భంగిమలో ఏదో గాంభీర్యం, తపస్సు ఉన్నాయి. హిమబిందు వారి నొంటరిగా వదలి వెళ్ళటంలోని ఉద్దేశ్యం ఇద్దరికీ తెలుసు.

ఆఖరికి శేఖరం మౌనభంగం చేశాడు.

"మీఇంట్లో ఇప్పుడు కులాసాగా ఉందా?"

"ఆ!"

"చూడండి. సుశీలాదేవి! మీ గురించి బిందు పూర్తిగా చెప్పింది. ఇకనాగురించి మీకేమైనా సందేహాలుంటే అడుగవచ్చు"

ఆమె విస్ఫారిత నేత్రాలతో అతన్నొకసారి పరికించింది. ఆ కన్నులలో కాంతి, ఆ ముఖంలో గంభీరత, ఆ కంఠంలో మాధుర్యం ... అతని వ్యక్తిత్వంలో ఏదో ఔన్నత్యం ఉంది! ఆమె మెల్లగా అన్నది "...మీ గురించీ బిందు నాకన్నీ చెప్పింది. నా కెటువంటి సందేహాలు లేవు. కాని, మీ పవిత్ర జీవితంలో నేనొక అపశ్రుతిలా ..."

"... తప్పు. మీ రలా అనకూడదు. నేనంత ఆత్మనిందను భరించలేను. మీకు ఆత్మవిశ్వాసం కావాలి. నేను కోరుకునే దదే!"

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "...నేనీ అదృష్టాన్ని భరించలేనేమోనని భయంగా ఉంది."

"...మా అక్కయ్య ఉత్తపిచ్చిది శేఖర్..." అంటూ నవ్వుతూ ట్రేలోని కాఫీ, టిఫిను టీపాయ్‌మీద పెట్టింది హిమబిందు.

"అమ్మా!..." అంటూ ఒక్క పరుగులో వచ్చి సుశీల ఒడిలో వాలిపోయాడు బాబు.

అప్పచెల్లెళ్ళిద్దరూ ఉలిక్కిపడ్డారు. అయితే కారణాలు వేరు.

"...అక్కయ్య దగ్గర వాడి కెక్కువ అలవాటు..." బలవంతంగా నవ్వింది హిమబిందు. "...బాబూ! అదిగో ఐసుఫ్రూటువాడు వచ్చాడు" అంటూ వాడిని మాయచేసి సుశీల చేతుల్లోంచి లాక్కుని ఆమె వడివడిగా బయటకు తీసుకొని పోయింది.

కొంతసేపటివరకు సుశీలముఖంలోకి అయోమయంగా చూస్తుండిపోయాడు శేఖరం!

"అలా అంటుందికాని, వాడికి పిన్నిదగ్గరే ఎక్కువ అలవాటు..."

శేఖరం ప్రశ్నార్థకంగా చూశాడు కాని, ఎవరికీ మాటలు దొరకలేదు— యాంత్రికంగా టిఫిను తిని కాఫీ త్రాగారు ఇద్దరూ.

సుశీలలోని ఉత్సాహం ఏదో నివురుగప్పిన నిప్పులా ఉంది!

"ఇక పోయిరానా మరి?" అంటూ లేచాడతను.

ముసలావిడ తలుపుచాటునుంచి అన్నది "మీ మేలు మా జన్మలో మర్చిపోలేము నాయనా! చిన్నవాడవయినా చేయెత్తి..."

"...అంతమాటనకండమ్మా! నేనిందులో చేసిందేమీలేదు. ఓ విధంగా చెప్పాలంటే నాలో ఏమాత్రమయినా మంచి అనేది ఉంటే అది మీ హిమబిందు పరిచయప్రభావం. అంతే! ... ఇక సెలవు తీసుకుంటాను ఈవేళే మా అన్నయ్యకి ఉత్తరం వ్రాస్తాను..."

"మంచిదిబాబూ!"

♦ ♦ ♦

ఉదయమే తయారయి హాస్పిటలుకని బయలుదేరబోతున్న డాక్టరు రాజశేఖరం అంతప్రొద్దుటే ఉరుకు పరుగులమీద వచ్చిన హిమబిందును - ఏదో బాధతో కంపించిపోతున్న ఆమె తనూలతను చూసి నిర్ఘాంతపోయాడు.



"బిందూ!—ఏంజరిగింది?"

కుర్చీలో కూలబడి చేతుల్లో ముఖాన్ని దాచుకొని వెక్కివెక్కి ఏడువసాగింది ఆమె. ఏమీ అర్థం కాక అతను పిచ్చివాడిలా కొంతసేపటివరకు చూస్తుండిపోయాడు.

ఆమె బాధనిక చూడలేక దగ్గరగా వెళ్ళి ఆమెను, తన బాహువుల మధ్య పొదివి పట్టుకొని తల నిమురుతూ అన్నాడు "ఎందుకిలా క్రుంగిపోతున్నావు బిందూ? నీబాధ నాతో చెప్పవూ? నీ విలా గుండెలు పగిలేలా దుఃఖించటం నేను చూడలేను. చెప్పు బిందూ! ఏంజరిగిందో చెప్పు!..."

అతని అనునయంతో కొంత

శాంతించిన హిమబిందు తన జాకెట్లోంచి తీసి ఒక కాగితం మడతను వణికే చేతులతో అతని కందిస్తూ అన్నది. "ఈ నిర్భాగ్యురాలికిక అక్కయ్య కనపడదు."

ఉలిక్కిపడ్డాడతను. కంగారుగా ఆ కాగితం మడత విప్పి చదవసాగాడు.

అది సుశీల శేఖరానికి వ్రాసిన లేఖ!

"శేఖర్‌బాబూ!

మీరు నన్ను వివాహం చేసుకోటానికి అంగీకరించారంటే అది మీ గొప్పతనం! నా భాగ్యం! కాని, ఈ భాగ్యాన్ని కాదని పోతున్నానంటే మీ కాశ్చర్యం కలుగవచ్చు-నాపని పిచ్చితనంగా కనపడవచ్చు-అయితే, నిజం వేరు.

బిందూని క్షమించండి. ఆమె మిమ్మల్ని మోసగించింది. తన అందచందాలు, ఉత్తమ సంస్కారము చూసి ఆకర్షింపబడిన ప్రతి పురుషుని ఆమె మోసగించింది ... బాబు తన బిడ్డడని చెప్పి! అందుకు సిద్ధమై వచ్చిన వాళ్ళను వితంతువునైన నన్ను పెళ్ళాడమని ప్రార్థించింది. ఒక పతితనాదరించగల సహృదయుడు ఒక వితంతువును తప్పక స్వీకరించగలడని ఆ పిచ్చిపిల్ల ఊహ!

అందుకనే నామీద మీకు సద్భావం, సానుభూతి కలగటం కోసం మీ విశాల దృక్పథం తెలిసి కూడా బిందూ మిమ్మల్ని మభ్యపెట్టింది. తానే బాబు కన్నతల్లినని నమ్మించాలని ఎంతో చేసింది. అదంతా మీయందు శంకవల్ల కాదు-దక్కబోతున్న అదృష్టం నాచేయి జారిపోతుందేమోనని.

కాని, ఆ వితంతువును-పతితను నేనే శేఖర్‌బాబూ! ఒక స్వార్థపరుని మాటలు నమ్మి భంగపడింది నేనే! ఏ అక్క సుఖంకోసం ఈ నిందనంతా తాను మోయాలని బిందూ సర్వ విధాల ప్రయత్నించిందో ఆవ్యక్తిలో మచ్చుమిగిలినా మమకారం అంతరించలేదు శేఖర్‌బాబూ!

స్ఫటికంలా నిర్మలమైనది ... పాలల్లా స్వచ్ఛమైనది, హిమబిందువులా పవిత్రమైనది నా సహోదరి హిమబిందు! నాకోసం తన చదువు మానుకుంది. నాకోసం ఏ స్త్రీ భరించలేని నిందను మోసింది. నా సుఖంకోసం సర్వవిధాల ప్రయత్నించింది. ఆఖరికి నాకోసం తనకు మనసిచ్చిన వ్యక్తినే అర్పించటానికి సిద్ధమయింది! పిచ్చిపిల్ల! నాకేమీ తెలియదనుకొంది. నాకు చెప్పవద్దని అమ్మతో చాటుగా అన్ని వివరాలు చెప్పింది. నేను విన్నానని వాళ్ళకు తెలియదు!

నేను పొంగిపోయాను. నా గుండెలు ఆనందంతో బ్రద్దలయిపోయాయి ... ఇటువంటి భాగ్యం నాకు దక్కినందుకు కాదు!—తన సర్వస్వాన్ని తృణప్రాయంగా తన అక్క సుఖం కోసం త్యజించగల్గిన చెల్లెల్ని పొందిన అదృష్టానికి!

కాని, ఇప్పటికే నాకోసం తన భవిష్యత్తునే పూర్తిగా విస్మరించింది నా చెల్లెలు. ఆమెను సుఖపెట్టవలసిన బాధ్యతను నేను విస్మరిస్తే నాకిక ఈ జీవితానికి తృప్తి, విలువ ఉంటాయా? నాకు చివరకు మిగిలేది చీకటి కాక మరేమిటి?

ఈదివ్వెను వెలిగించిన హస్తాన్నే కాల్చివేయగలనా! నీడనిచ్చిన చెట్టునే నరికివేయగలనా! మీ ఇద్దరి త్యాగాన్ని ఎలా భరించగలను? అందుకనే నేను దూరంగా వెళ్ళిపోతున్నాను.

మీ సహృదయంలో చోటుచేసుకొన్న నా చెల్లెలు ధన్యురాలు. మీ వంటి వ్యక్తి రాకకోసమే నేనిన్నేళ్ళు నిరీక్షించాను. లేకపోతే, నేను బిందును విడిచి ఎప్పుడో వెళ్ళిపోవల్సిన దాన్ని.

అలాగని బ్రతుకుమీద విరక్తిచేత ననుకోకండి. ఆత్మహత్య చేసుకునేటంతటి బలహీనురాల్ని కాను. జీవితమంటే జీవించటానికే అన్న సత్యాన్ని నాలో పాదుకొల్పిన దేవత హిమబిందు!

నా వియోగం నా బాబును బాధించదనే నా ఊహ. వాడికి మీరే తల్లిదండ్రులు కాగలిగినప్పుడు నాకే భయమూ ఉండదు. అమ్మకి మీరే ధైర్యం చెప్పాలి. చెల్లాయిని మీరే ఓదార్చాలి. బాబుని మీరే చేరదీయాలి. వీరందరి బాధ్యత మీకు వదలి వెడుతున్నాను. ఇప్పుడు నాకు తృప్తిగా ఉంది.

ఎక్కడ ఉన్నా మీ హృదయాలకు చేరువనే ఉంటాను. మీకోసమని బిందూ నానుదుట దిద్దిన తిలకం నాకు సౌభాగ్యాన్ని ప్రసాదించింది. ఆ అదృష్టమే నన్ను కాపాడుతుంది. మీరెవరూ దిగులు పడవద్దు. ఈ అన్వేషణలో ఒకనాటి శుభఘడియకోసం నేను ఎదురు చూస్తుంటాను.


మీ అమృత హృదయానికి జోహారులర్పిస్తూ—

సుశీల.

టపటపమని అశ్రుబిందువులు రాలి ఆ లేఖ తడిసిపోయింది. అద్వితీయమైన గగుర్పాటేదో అతన్ని కదలించివేసింది. ఆ భావనావేశంలో హిమబిందు తనూలతను తన గుండెలకు హత్తుకున్నాడు రాజశేఖరం! ఆ హృదయ విపంచికలు మధుర శ్రుతులు చేసుకున్నాయి.

ఆమె నీలి కుంతలాలపై అతని అశ్రుబిందువులు దీవెనలై వర్షించాయి!

□□□



పక్కింటి శర్మగారి అబ్బాయి గోపీకి ఎనిమిదేళ్ళే ఐనా, డబ్బెట్టి పందాలు కాయడం, బబ్బాలాడడం అబ్బిందికానీ సరిగ్గా చదువబ్బలేదు. స్కూలుకని బయలుదేరడం, దారిలో ఏ చెట్టుకిందో బచ్చాలాడడం, స్కూల్లో ఏమూలో ఎవరితోనో డబ్బులతో పందాలు కాయడం ... ఇలా చేసే వాడు. ఇంక వాణ్ని నిర్లక్ష్యంచేస్తే లాభంలేదని నాకు తెలుసున్న ఒక హెడ్ మాష్టార్ దగ్గరకి వాణ్ణి తీసుకెళ్ళాం.

"మా కుర్రాడు చాలా పాడై పోతున్నాడు. వీడికి ఇప్పటినించే పందాలు కాయడం లాంటివన్నీ అలవాటయ్యాయ్. అందుకే వీణ్ణి ఒకసారి బడిలోంచి తీసేసేరు. వీణ్ని ఎలాగైనా మీరు దారిలోకి తీసుకురావాలి" అన్నారు శర్మగారు.

"వీణ్నెంతండి దారిలోకి తీసుకురావడం. మీరేం ఇదవకండి." అన్నారు హెడ్‌మాష్టార్ ధీమాతో.

రెండు రోజులయింది. ఆ రోజు హెడ్ మాష్టరుగారి క్లాసు. గోపీ క్లాస్ మొదలయ్యేముందు హె.మా. గారితో "మిమ్మల్ని ఒకసారి కాలవలో ఈత కొడుతుంటే చూసేనండి" అన్నాడు.

పిల్లలంతా హె. మా. గారు గోపీని నడ్డిమీద చంపేస్తాడని అనుకున్నారు. కానీ హె. మా. గారు కోపం అణచుకుని "నన్ను ఎప్పుడూ అలా చూసుండవ్. పైగా నాకు ఈత రాదు."

గో: చూసేనండీ. మీ నడ్డిమీద కుడివైపున పెద్ద పుట్టుమచ్చకూడా వుంది. చూసుకోండి, ఐదురూపాయల పందెం.

"వీడు నాతోనే పందాలు వేస్తున్నాడు భయంలేకుండా. ఐనా వీడికి తగిన బుద్ధిచెప్పాలి" అనిఅనుకుని— "చూస్కోరా కుంకా" అని చొక్కా విప్పి వీపు చూపించేరు హె. మా. గారు.

గోపీ ఐదు రూపాయలు ఇచ్చేసేడు దిగులుగా.

"ఇంకెప్పుడూ ఇలా బుద్ధితక్కువ పందాలు వెయ్యకు. జాగ్రత్త... తెలిసిందా... ఆఁ... మీ నాన్నగారికి ఈ ఉత్తరాన్ని ఇయ్యి" అని జరిగిన విషయాలని ఒక ఉత్తరంలో వ్రాసి గోపీ కిచ్చారు హె. మా. గారు.

మర్నాడు ఉదయం గోపీ హె.మా. గారికి—"మా నాన్నగారు ఈ ఉత్తరం మీ కియ్యమన్నారండి" అంటూ ఒక ఉత్తరాన్నిచ్చేడు.

అందులో—

"మీరు మా కుర్రాడికి నేర్పిందేమీలేదు. పైగా నిన్న వాడు మా ఇంట్లో 'ఈవేళ మా హెడ్‌మాష్టర్ గారి చొక్కాని క్లాసులో విప్పిస్తాను,' అని 20 రూపాయిలు పందెం వేసుకెళ్ళేడు. వాడు పందెం గెలిచేడని నేనుమీకు వేరే వ్రాయనక్కరలేదనుకుంటాను ..."

హె. మా. గారికి స్కూల్లో బల్లలు, కుర్చీలు గుండ్రంగా తిరుగుతున్నట్లు భ్రమ కల్గింది. తరువాత ఉత్తరం ఎంత చదువుదామని ప్రయత్నించినా చదువలేకపోయారు—

□□□

ఒక బస్తీ కుర్రాడికి ఒక పల్లెటూరి కుర్రాడు తమపొలాలు, గొడ్డుగోద అన్నీ చూపిస్తున్నాడు.

"వాన వస్తుందో రాదో మీకు ముందే తెలిసిపోతుందిటగా?" అని బస్తీ కుర్రాడు అడిగాడు.

"అవును. ఆవుల్నిచూసి వాన వచ్చేదీ రానిదీ చెప్పవచ్చు" అన్నాడు పల్లెటూరి అబ్బాయి.

"ఎల్లా ?"

"ఆవులు తీరికగా పడుకుని మేతమేస్తుంటే వానరాదన్న మాట. అవి నుంచుని, చుట్టూ తిరుగుతూ గాబరాపడుతున్నట్టు కనిపిస్తే వాన వస్తుందన్నమాట."

బస్తీ అబ్బాయి కొంత దూరంలో ఆవుల మందను చూపించి "మరి వాటిలో కొన్ని పడుకుని మేత మేస్తున్నాయి. కొన్ని నిలబడి వున్నాయి. ఎందుకని ?" అని అడిగాడు.

"అంటే, వాన వస్తే రావచ్చు, రాకపోతే రాకపోవచ్చు అని అర్థమన్నమాట" అన్నాడు పల్లెటూరి కుర్రాడు.

జతలేని లత

చలనచిత్ర కళారంగంలో అడుగిడ గలిగే అదృష్టం లభించే ముందు లతామంగేష్కర్ ఎన్నో యిబ్బందులూ యిరకాటాలూ పడినా, క్రమంగా కీర్తి శృంగాన్ని అందుకుని అక్కడే సెటిల్ అయిపోయారు. నేడు లత పేరు వినని చెవిగాని, లత మధుర గానం విని ఆనందించని హృదయంగాని, భారతంలో వుండడానికే వీల్లేదనేటంత బిగువుగా లత నామలత, యశోవృక్షాన్ని అల్లేసుకుంది.

స్వర్గీయ పండిట్ దీనానాథ్ మంగేష్కర్ గొప్ప పాటగాడనీ, భంగమెరగని రంగస్థల నటుడని పన్నెకెక్కిన వ్యక్తి. ఆ వ్యక్తి కన్న శుక్తి ముక్తాఫలం లత. తండ్రి గళ మాధుర్యాన్నీ, కళా కౌశలాన్నీ పూర్తిగా పుణికిపుచ్చుకున్న పుత్రిక లత.

ఈమె కంఠస్వర ప్రత్యేకతను గమనించిన శ్రీ దీనానాథ్ చనిపోతూ నుడివిన దీవెన, "అమ్మా, నీగళంలో గాంధారం వుందమ్మా, అనర్గళమైన నీగళం, నీ కనన్యమైన కీర్తిని చేకూరుస్తుందితల్లీ!" అని. అదినేడు నిజమైంది.

అంతకుముందు కొన్ని పాటలు పాడివున్నా, రాజ్ కపూర్ "బర్సాత్", "ఆవారా" చిత్రాలలో ఈమె గళం అందర్నీ లాగే నన్నూ అమితంగా ఆకర్షించేసింది. ఇంతటి సన్నని కంఠంగల "లత" దేహం ఎంతో పలచగా వుంటుందని వూహించుకునేవాణ్ణి. కాని, కొందరు మిత్రులు నిజంగా చూసినవాళ్ళలాగే "గజం" నిలువూ "గజం" అడ్డంగల "గజం" (యేనుగు) లా వుంటుందనే సరికి, నాగుండె బరువెక్కి, ఆశ్చర్యపోయేవాణ్ణి, అల్లాంటి గజానికి లత లాంటి కంఠం ఎలా వచ్చిందీ!" అని.

రాగ రంజని

అంతటి శరీరంలోనుంచి ఇంతటి శారీరం (కంఠం) వస్తూంటే ఎలా వుంటుందో చూడాలనే ఉపద్రవకరమైన ఉత్కంఠ నాలో ప్రబలింది. చూసే అవకాశం, శ్రీ యస్. వి. వెంకట్రామన్‌గారి సంగీతంలో, జూపిటర్‌వారి హిందీ చిత్రంలో ఈమె పాడడానికి మద్రాసు వచ్చినప్పుడు కలిగింది. నేనూ అప్పట్లో చిత్రకళా రంగంలో కాలూనేందుకు అవస్థలు పడుతూ వున్నాను. ఆ సమయంలో ఆడిషన్‌యిద్దామని ఆకంపెనీకి వెళ్ళినప్పుడు పక్కపక్కల నున్న పూలమొక్కల పూలను కోసే ప్రయత్నంలో చెంగు చెంగున మొక్క మొక్కకూ ఎగురుతున్న చిన్న జింక పిల్ల కంటబడింది. 'ఎవరబ్బా ఈ పిల్ల' అనుకుని అడిగేసరికి, ఆ పిల్లే లత అని తెలియవచ్చింది. విస్తుపోయాను. మిత్రులు చెప్పిన గజతనూలత ఇలా హరిణకిశోరంలా గంతులేస్తూ వుంటే నమ్మలేకపోయాను. కాని నమ్మక తప్పింది కాదు. గుండెలోంచి ఏదో పెద్ద బరువు దిగినట్టనిపించింది నాకు.

లతతో జోడుగా డ్యూయెట్ పాడే బంగారపు టవకాశం ఎన్నడో కదా! అని బంగారు కలలు కనేవాణ్ణి. అదీరానే వచ్చింది. ఎ. వి. మెయ్యప్పన్ అండ్ సన్స్, చిత్రగుప్తల ఆదరణాభిమానాలవలన. 'మైంభీలడ్‌కీ హూం' చిత్రంలో లతతోకలిసి, 'చందాపే హోగావో ప్యారా, నన్హాసాముహ్నా హమారా' అని పాడినప్పుడు నేను పొందిన ఆనందం వర్ణనాతీతం. అంతకుముందే లతను జెమినీ, వాహినీలలో కలిసి వున్న పరిచయంవల్ల, ఇంచుకైనా భయం లేకుండానే, ధీమాగానే పాడగలిగాను. ఆపాట రికార్డింగు జరుగుతూన్న రోజునే, మధ్యలో గల 'బ్రేకు' లో వీలు చిక్కించుకుని ఆమె నడిగి తీర్చుకున్నానో సందేహం. తన పాడుగుకు నాలుగింతలు దీర్ఘమైన పల్లవులను సైతం ఈస్వరవల్లరి (లత) ఒక్క గుక్కలో ఎల్లా పాడగలుగుతోంది' అనేదే నన్నెంతో కాలంగా వేధిస్తూన్న విడనిప్రశ్న. ఇదే సమయం అని అడిగేశాను, కిటుకు తెలుసుకుందామని. దానికామె 'అది ఒకరకమైన సాధకం. పాటలో ఏ యే విరుపుల దగ్గిర గుక్కతీసుకుంటే, ఇతరులకి దమ్ము తీసుకున్నట్టే తెలియకుండా వుంటుందో, ఆయా విరుపులను అవగాహన చేసుకుని అక్కడక్కడే మెల్లిగా తీసుకునే చాకచక్యం, చిరకాల సాధనవల్లే సాధించాను. అదీగాక, దైవదత్తమైన వుక్కు వూపిరితిత్తుల సత్తువ కూడా కారణం' అని వినోదంగా విప్పిచెప్పారు.

ఎంతటి ఇరుకైన, చురుకైన బిరకానైనా ఇబ్బంది పడకుండా, అవలీలగా ఆడుతూ పాడుతూ అనేస్తుందీమె కంఠం.

అవసరమనుకున్న స్థలంలో లత ఇచ్చే 'వూవు' వూహాతీతమైంది. అది శ్రోతల హృదయాల్ని కదిపి, వూపి, వుత్తేజపరుస్తుంది. మత్తెక్కిస్తుంది. లాలిపాడి జోకొడుతుంది. 'భావం' ఈమెకు పెట్టనిసొమ్ము. చిత్రంలోని సన్నివేశానికనువుగా, రసస్ఫోరకంగా, గీతాన్నాలపించడంలో లతది అందెవేసినచేయి అనేకన్న 'నాను వేసిన కంఠం' అంటే సమంజసం.


లతా మంగేష్కర్

లత మితభాషిణి, అమితశ్రవణి. పాట నేర్చుకునేటప్పుడు, తను పాడకుండా సంగీతదర్శకుణ్ణో అతని సహాయకుణ్ణో నాలుగైదుసార్లు పాడమని విని, తనలో తనే గొణుక్కుని వెళ్ళిపోతారు. రికార్డింగునాడు రెండు పర్యాయాలు వింటేచాలు – 'టేక్'కు రెడీ. రిహార్సల్సులో పాడని లత, రికార్డింగులో ఎలా పాడుతుందోనని, కొత్తలో, కొత్త సంగీతదర్శకుడు భయపడటం కద్దు.

కాని, పాడిన టేక్ వినగానే తను కూడా అనుకోని కొత్తసంగతులు విని మురిసిపోయి ముగ్ధుడై చూడక, తప్పదు పారవశ్యతయొక్క హద్దు. పాటలు ఎక్కువగా పాడే ఈమె మాటలు తక్కువగా మాట్లాడినా, మాటాడే నాలుగు మాటలూ యుక్తియుక్తాలూ, సందర్భోచితాలూ.

ఒకసారి ఒక పెద్దమనిషి లత రజతోత్సవపు వేడుకలను చిత్రీకరించేందుకనీ, ఆ చిత్రంతో వ్యాపారం చేసేందుకనీ, అనుమతి పొందగోరి, ఉత్సాహంతో లతా గృహానికి విచ్చేశాడు. ఆ సమయాన నేనక్కడే వుండడం తటస్థించింది. ఆ వచ్చిన పెద్దమనిషి పెద్దపులిలా కబుర్లు చెబుతూ, 'ఏదీ లత? ఆమెతో అర్జెంటుగా మాటాడి వ్యాపారముగించుకుని, వెళ్ళి వేరేపని చూసుకోవాలి, పిలవండి ఆమెను' అంటూ ఎంతో అధికారంతో, ఆడంబరంతో ఉరకలేస్తూ, నురుగులు కక్కుతూ, సోఫాలో కూర్చునే పయనిస్తున్నాడు.

ఇతడి హడావిడినంతా లోపల నుంచే గ్రహించిన 'లత' కావాలనే, ఎంతకీ దర్శనమివ్వలేదు. అర్జంటుగా అరనిమిషంలో వెళ్ళిపోవాలని ఆరాటపడిన మన ఆసామీ అరగంటకుపైగా ఈమె రాకకోసం ఆదుర్దాగా ఎదురుచూస్తూ కూర్చు

న్నాడు విధిలేక. అరగంట తర్వాత ఆదరాబాదరాగా లత వచ్చారు.

అతగాడితో ఆరేఆరుమాటలు అతి ముక్తసరిగా మాటాడి, అంతలోనే అతనొకప్పుడు తెలిసో తెలియకో చేసిన తప్పుని ఒప్పించి, మెత్తగా మొత్తి, పులిలావచ్చిన పెద్దమనిషిని పెద్దగా ఓన్నబుచ్చి, పిల్లిలా జారుకునేట్టుచేసిన ఈ అంగనామణి విన్నాణాన్ని కనులారా కాంచి, అదిరిపోయాను. "కొంతమందితో ఇలాగే వ్యవహరించవలసివస్తుంది" అన్నారు లత, నాతో సర్దుకొంటూ. 'ఆ కొంత మందిలో నేను లేననే నా ఆశ' అన్నాను ఛలోక్తి అనుకుంటూ. అందుకు లత అదోలా నవ్వారు. ఆ నవ్వు 'అటో ఇటో' అర్థంకాని పజిల్, ఆనాటికీ, ఈనాటికీ, ఏనాటికీ!

అంతటి లౌకిక వ్యవహార జ్ఞాన సంపన్నురాలు గనకనే, ఇంతటి చిత్ర విచిత్ర చిత్రసీమా పద్మవ్యూహాన్ని ఛేదించి చొచ్చి, స్థిర సింహాసనంపై అధిష్ఠించి, చలనచిత్ర సంగీత సామ్రాజ్య పట్టమహిషియై, ఏలగలుగుతున్నారీమె. ఈమె గాన భంగిమలనూ, పద్ధతులనూ ఒరవడిగాగొని, ఏకలవ్య శిష్యరికం నెరపి, అనుకరించి, అనువదించి అభివృద్ధిలోకి వచ్చిన గాయకురాండ్రు అసంఖ్యాకులున్నారు. తమఅమ్మాయిగాని, అక్కగాని, చెల్లాయిగాని, స్నేహితురాలుగాని, భార్యగాని, అచ్చంగా లతలాగే పాడుతోందనుకుని తృప్తితో ఉబ్బితబ్బిబ్బులయ్యే తండ్రులూ, తమ్ముళ్ళూ, అన్నలూ, నేస్తాలూ, భర్తలూ ఎందరెందరో వున్నారీ కాలంలో.

ప్రఖ్యాత గాయకీనాయకి అయిన నూర్జహాన్ పాటలువిని ప్రగతిని సాధించిన మన "జతజడల పడతుక" లత తనదైన ప్రత్యేక బాణీని సృష్టించుకుని, తన లక్ష్యాన్ని సాధించుకుని, ఇతరులకు తాను లక్ష్యమై వెలుగొందే "సంగీత జ్యోతి"గా విలసిల్లుతున్నారు. వెలుగుల జల్లులు వెదజల్లుతున్నారు.

ఈ సంగీతజ్యోతి ప్రసరింపజేసిన బహుసహస్ర గీత కిరణాల్లో కొన్నింటిని చూద్దాం:

శిన్ శినాకీ బూ బ్లా బూ లో, "తుం క్యా జానో తుంహారీ యాద్ మేఁ హం కిత్‌నారోఏ" అనేపాటలో ఈమె విరహ వేదనలోగల యెడద తపనను వ్యక్తం చేసినవైనం నేనే నాడూ మరవలేని గానం. మరువరాని గీతికలలో ఇదొక అగ్రశ్రేణికి చెందిన గీతికారోచిర్లతిక.

రుస్తుం సొహ్రాబ్‌లో "ఐ దిల్ రుబా" అనే పదాన్ని తీగలాగలాగి, కుదిపి కదిలించిన ఇజిప్షియన్ స్టైయిల్, ఈ క్రీపర్ వాయిస్ ఫ్లెక్సిబిలిటీకి బెస్ట్ ఎగ్జాంపుల్. "అంజాజ్"లో లత "తోడ్‌దియా దిల్ మేరా" విని మతి పోగొట్టుకోని సన్మతులుండరు.

"ఆప్ కీ నజ్‌రోంనే సంఝా" (అన్‌పఢ్)

"మన్ మేఁ కిసేకీ ప్రీత్ బసాలే ఓమత్‌వాలే (ఆరామ్);

"హాఏరే తేరే చంచల్ నైన్‌వా" (ఊంచేలోగ్)

"మీఠీ మిఠీ బతియోఁసే" (ఖైదీ 911)

"తూ మేరే ప్యార్‌కా నూర్ హై" (ధూల్‌కా ఫూల్)

"ఏక్ తూ నా మిలా సారీ దునియా మిలీతో భీ క్యాహై (హిమాలయ్ కీ గోద్‌మేఁ)

"కహీఁ దీప్ జలే కహీఁ దిల్" (బీస్‌సాల్‌బాద్)

"ఆయీ ఆయీ బహార్ ఆజ్‌రే" (పంచాయత్)

"సాజన్‌కీ గలియాఁ ఛోడ్ చలే" (బాజార్)

"ఆఏగా, ఆఏగా ఆనే వాలా" (మహల్)

"బడీ ముశ్‌కిల్ హై" (చిన్‌గారీ

"ఘర్ ఆజా" (ఛోటే నవాబ్)

"టిఁటిం కర్ తే ప్యారే" (చిరాగ్ కహాఁ రోశ్‌నీ కహాఁ)

"ఆజ్ ఫిర్ జీనేకీ తమన్నాహై" (గైడ్)

"అఁను ఓఁకీ ఛాఁవ్‌మేఁ" (పరిచయ్)

"అప్‌నీఅదా పర్ మైహూఁ ఫిదా" (తీన్ బతీ చార్ రాస్తా)

"జ్యోతి కలశ్ ఛల్‌కే" (భాభీకీ చూడియాఁ)

"కృష్ణా! ఓతుం ఛోడో పియా" (ఝనక్ ఝనక్ పాయల్ బాజే)

"జాదూగర్ ముఝ్‌కే ఇత్‌నా బతా" (ఫ్లాట్ నం 9)

"దిల్ జోన కహ్‌సకా వొహీ రాజేదిల్" (భీగీరాత్)

"హై కహీఁపర్ శాద్ మానీ" (అంఖియా)

"హాఏరే వోదిన్ క్యోఁ నహీఁ ఆఏ" (అనూరాధా)

> ఒకడు స్నేహితుడికి తన ఇల్లంతా చూపిస్తూ:
>
> "ఈ ఫొటో మా ముత్తాతగారిది!" అన్నాడు.
>
> "అరె. నీ కంటె ఏమంత పెద్ద వాడు కాదే?" అని స్నేహితుడు ఆశ్చర్యపోయాడు.

"జీవన్ డోర్ తుం హీఁ సంగ్ బాంధే" (సతీ సావిత్రి)

"ము ఝే నా బు లా" (స్వర్ణ సుందరి)

"ఓసజ్‌నా" (పరఖ్)

"రసిక్ బల్‌మా" (చోరీ చోరీ)

"బల్‌మా మానేనా" (ఒపేరా హౌస్)

ఇలా వేనవేల పాటలుపాడి లత తమ ప్రత్యేకతలతో ప్రజల మనసులను దోచేసుకున్నారు.

జయదేవ్ సంగీతంలో 'జానే కిత్‌నీ బార్ హృదయ్‌సే, మైంనే తుఝే పుకారా' అనే పాట లత హృదయంనుంచి వెలువడిన పిలుపు. లత తూకంతో పాడిన ఈ పాటను జయదేవ్ గృహంలో పదే పదే వినే అవకాశం నా కబ్బింది. ఎన్నిసార్లు విన్నా తనివితీరని పాటలలో ప్రత్యే కత గలదానినిగా దీనిని పరిగణించి తీరాలి.

సాధారణంగా లతచేత పాడించు కోవాలని ఉబలాటపడని సంగీత దర్శకులు లేరంటే అక్షరాలా నిజం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళీ, సింహళాది, దాక్షిణాత్యసంగీత దర్శ కులుసైతం ఆమెచేత తమ చిత్రాలలో పాడించుకున్నారు.


'నిదురపోరాతమ్ముడా' అనిఆంధ్ర సోదరులని జోకొట్టిన లత మధుర రవాన్ని- వినరించగలిగిన తెలుగు లుండ రాంధ్రదేశంలో.

అనేకంగా అందరు సంగీత దర్శ కుల పాటలూ లత ఆలపించారు. ఒకే ఒక విలువైన మినహాయింపు ఒ. పి. నయ్యర్. వైయక్తిక వ్యవహా రాల ప్రభావం కళారంగంపైనా, వృత్తిపైనా పడితే, కళకు జరిగే అన్యాయానికీ, కలిగే అపార నష్టా నికీ, కలవని ఈ యిద్దరు కళాకారుల 'కలగని కాంబినేషన్' అనుపమ దృష్టాంతం.

మొత్తంమీద లతపాడని 'శైవు' లేదు. ఒలికించని రసంలేదు. ఇలా సర్వతోముఖ సంగీత ప్రజ్ఞగల లత చెల్లెళ్ళూ చక్కని పాటగత్తెలు. ఆశా భోస్లే, మీనా, ఉషా మంగేష్కర్లు తమ తమ స్థానాలను నిరూపించు కున్న గాయనీ మణులే. తమ్ముడు హృదయనాథ్ గాయకుడేకాక సంగీత దర్శకుడుకూడా 'సన్ దిన్ బర్ సత్' అనే భజన్‌లో హృదయ నాథ్ చూపిన ప్రతిభ అతని భవి ష్యత్తుకు తార్కాణం. లతకూడా, కొన్ని మరాఠీ చిత్రాలకు మారు పేరుతో (ఆనందఘన) సంగీత దర్శ కత్వం నెరపి అఖండ విజయాన్ని సాధించారు.

అప్రతిమ ప్రతిభాయుత కళా ఫల సంపన్నమైన ఈ సంగీత కుటుంబ వృక్షచ్ఛాయలలో శోతా తప సంతప్తులు విశ్రమించి సేద తీర్చుకుంటూ, సంతోషతరంగాలలో డోలలూగుతూ, వుండాలని ఆశిద్దాం.

—పి. బి. శ్రీనివాస్



నా మనసులో ఏదో అవ్యక్తమైన ఆవేదన ముసురులా కమ్ము కుంది. అలాంటప్పుడు ఏ పనీ చేయబుద్ధికాదు. ఇంటి ముందున్న ఆవరణలోని గులాబీ చెట్టు దగ్గరికి పోయి కూర్చోవా లనిపిస్తుంది.

కాని ఈ వేళ లేవలేనంత నీర సంగాఉన్నది. అయినాగాని వడక కుర్చీ బయటికి లాగి గులాబీ చెట్టుకి ఎదురుగా కూర్చున్నాను.

ఆ గులాబీ చెట్టంటే నాకు ప్రాణం.

నేను దగ్గరికి వెళ్ళగానే అది తలాడించింది.

నాకు తెలుసు, అది నన్ను గుర్తి స్తుందని. మేమిద్దరం ఎన్నో

మాటలు మాట్లాడుకుంటాము. నా మనసు దానికి తెలుసు.

గులాబీ నాతో మాట్లాడినప్పుడల్లా జీవితమంటే ఇలా ఎర్ర గులాబీ మొక్కని చూస్తూ ఉండటమే అనిపిస్తుంది నాకు.

స్నేహితులంటే ఇష్టం లేదు నాకు. నేనొక మాట అన్నానంటే వాళ్ళింకొక మాట అంటారు.

నాగేశ్వరరావు చాలా బాగా యాక్టు చేస్తాడూ, అంటే- "నో,నో. రెక్స్ హారిసన్ ఈజ్ సూపర్బ్" అంటారు. రెక్స్ హారిసన్ సూపర్బ్ అని నాకూ తెలుసు. అంతమాత్రాన నాగేశ్వరరావు బాగా నటించకూడదని ఎక్కడుంది ?

పూలంటే నాకు చాలా ఇష్టం. మల్లెపూలన్నా, గులాబీ పూలన్నా నాకు ప్రాణం - ఉత్త ఆడమనసు, ఫిమినైన్ ఇన్‌స్టింక్ట్స్, అని ఎగతాళి చేస్తారు.


పూలవి మెచ్చలేని మనసు మమతలనూ మెచ్చలేదని నా నమ్మకం. అందుకే వాళ్ళ నుంచి దూరంగా పారిపోతాను. ప్రేమ వేరు, తృష్ణ వేరు - అంటాను నేను.

కాదు. ప్రేమ, తృష్ణ రెండూ ఒకటే, ఒకదాన్లోనుంచి ఇంకొకటి వస్తాయి అంటారు వాళ్ళు. ఒకళ్ళిద్దరయితే సాహసం చేసి, "మరీ పోజు కొట్టకు గురూ. నీకు మాత్రం మనసులో కోరిక లేదంటే నేను నమ్మను. సెక్స్ ఈజ్ ఎవ్విరిథింగ్ ఇన్ లైఫ్" అంటారు. నాకు అసహ్యమేస్తుంది. అక్కడి నుంచి లేచిపోతాను. ప్రేమంటే గుర్తుకు వచ్చింది. నూటికి తొంభై అయిదు గురు ప్రేమంటే ఏమిటో తెలియకుండానే చచ్చిపోతారు. వాళ్ళతో చిక్కే లేదు

మిగిలినవారిలో కొందరు జాలి, ఇంటిమెసీ, ఆకర్షణ, అలవాటు — వీటినే ప్రేమనుకుంటారు.

తల్లి తండ్రిలేని పిల్లతోనో, లేక ఆ ఇద్దరూ ఉండి డబ్బులేని పిల్లతోనో నువ్వు స్నేహంచేసి పెళ్ళి చేసుకుంటే అది ప్రేమగాదు. జాలి, కరుణ.

అలాగే నీ ఆఫీసులో నీతోపాటు పనిచేసేఅమ్మాయినో,నీ సహాధ్యాయినినో, ఏడాది స్నేహం తరువాత నువ్వు హఠాత్తుగా ప్రేమించావు. అని తెలుసుకుంటే అది ప్రేమగాదు. పరిచయంలో నుంచి డెవలప్ అయిన ఇంటిమెసీ. ముందు గది కిటికీలో నుంచో, మీ ఇంటి డాబా మీద నుంచునో మీ ఎదురింటి అమ్మాయిని నువ్వు రోజూ చూస్తూ, హఠాత్తుగా ఒకవారం ఆ అమ్మాయి వాళ్ళింటి గుమ్మంలో కనపడకపోతే బాధపడి, ఆ బాధనే ప్రేమ అనుకుంటే అది పొరపాటు. అది ప్రేమ కాదు. అలవాటు. ఈ అలవాటులోని బాధ ఎటువంటిదంటే — మీ ఇంట్లో మీ చిన్న తమ్ముడు పెంచే కుక్కపిల్లంటే నీకు భయమూ, అసహ్యమూ. అయినాగాని, దానిని రోజూ చూస్తూ ఉండటంచేత, అది చచ్చిపోయిన తరువాత, ఇంట్లో వారందరితోపాటు నువ్వూ ఏదో



వెలితిగానే బాధపడతావు. ఇటువంటి బాధే అదీనూ.

ప్రేమంటే అసలు వేరే ఉంది.

ప్రేమ ఏ నీతిని, నియమాన్ని అనుసరించి ఉండదు. దానంతట దానికి అస్తిత్వము ఉంటుంది. చుట్టూ ఉన్న పరిస్థితుల కనుగుణంగా అది అంకురించదు. అందుకే ప్రేమ ఎప్పుడూ పరిస్థితులకి అనుగుణంగా ఉండదు. పరిస్థితులే ప్రేమ కనుగుణంగా ఉండాల్సిందే. ఉంటే సరేసరి లేకపోతే ధనాధన్, ఫటాఫట్. నీ జీవితంలో అంతా సంఘర్షణే.

నువ్వు ప్రేమించిన మనిషి నీ కంటె పెద్దది కావచ్చు, పెళ్ళయినది కావచ్చు, పిల్లల తల్లిగావచ్చు. నీ కంటె చిన్నది పెళ్ళిగానిదే అయి ఉండాలనేం నియమం లేదు.

నువ్వు ప్రేమించిన మనిషిని మొట్టమొదటిసారిగా చూసిన క్షణం చాలునువ్వుతల్లక్రిందులుకావటానికి. ఆమెను చూసిన మరుక్షణంలో అంతర్ముఖమై నీలో ఉన్న ఏదో అవ్యక్తమైన రాగజలధికి ఆనకట్ట తెగుతుంది. ఆ వరదలో నువ్వు ఉక్కిరిబిక్కిరవుతావు.

ఆత్మను ఆత్మ గుర్తిస్తుంది.

ఒకటిగా అయిపోవాలనుకుంటుంది.

అదీ ప్రేమంటే.

అలాంటి అనుభవం జీవితంలో ఎంతమందికి కలుగుతుంది ?

నూటికో కోటికో ఒకరికి.

అసలలాంటి అనుభవం కలుగ

కుండా ఉంటేనే మేలు. ఆ అనుభవం ఎప్పుడూ కూడా నువ్వు పాటించవలసిన నియమాలకు నిబంధనలకి కట్టుబడి ఉండదు. ఆ నిబంధనలను కాదనగల శక్తి నీకుండదు.

అయినా గాని ఈ అనుభవాన్ని పొందుతావు. ఈ అనుభవం అంటే కోటి విద్యుద్దీపాల కాంతి.

నీ చుట్టూ ఉన్న స్వార్థం, ఈర్ష్యాద్వేషాల చీకటి నుంచి ఒక్కసారి నువ్వు అంత వెలుగులో పడతావు.

నిబంధనలు, నియమాలూ అడ్డు వస్తాయి. ధైర్యం చాలక ఆ వెలుగులో నుంచి తిరిగి చీకటిలోకి జారుకుంటావు. అసలంత వెలుగనేది ఉంటుందని నీకు తెలియకపోతే చిక్కే లేదు.

చీకటిలో ప్రారంభమయిన నీ బ్రతుకు చీకటిలోనే అంతమవుతుంది, ఆనందంగా.

కాని అంతటి వెలుగుని చూసినట్లయితే, తిరిగి నువ్వు చీకటిలో ఎలా బ్రతకగలవు?—బ్రతకలేవు.

అందుకే నా మనసులో ఈనాడు ఈ ఆవేదన.

అందుకే నేను గులాబీ చెట్టు దగ్గర కూర్చున్నాను.

ఈ గులాబీకి, నేను చూసిన వెలుగుకీ సంబంధమున్నది. ఆ వెలుగులో నుంచి వచ్చిందే ఈ గులాబీ. గులాబీని చూసినప్పుడల్లా ఆ వెలుగు కళ్ళముందు కనిపిస్తుంది నాకు. అందుకే గులాబీ



ఎదురుగా కూర్చుని చీకటిని పారద్రోలటానికి ప్రయత్నిస్తాను.

నేను చూసిన ఆ వెలుగు పేరు అరుంధతి.

అరుంధతంటే మా కరణంగారి విధవ రెండవ కోడలు.

"నువ్వు నన్ను మర్చిపోయి బ్రతుకు గోపీ. నా వైధవ్యం నీ జీవితాన్ని తినేస్తోంది" అని కళ్ళ నీళ్ళు పెట్టుకున్న ఆడది.

రెండు నెలలు నేను టైఫాయిడ్ జ్వరంతో మంచమెక్కితే మా ఇంట్లోకి వచ్చి నన్ను చూసే సాహసంలేక, వాళ్ళ ఇంటి గుమ్మంలోనే ఇటూ ఇటూ తచ్చాడి, దేవునికి మొక్కుకున్న నిస్సహాయురాలు.

గుడికి వెడితే దేవుడికి దణ్ణం పెట్టుకోగానే నన్నే చూస్తూ నిలబడేది.

"నీలోనే నాకు దేవుడు కనబడుతాడు. దేవుడు కనిపించాల్సిన చోట నువ్వే కనపడతావు. నువ్వే నా దేవుడివి."

—అని నా తల నిమిరింది ఒకసారి

అది వెలుగు.

"అరుంధతిని చేసుకుంటే బావిలో పడిచస్తా" అని బెదిరించింది, పక్షవాతంతో మంచమెక్కిన అమ్మ.

"నువ్వు మంచంలోనుంచే లేవలేవు, పెరట్లో బావిదాకా ఎలా వెళ్ళగలవు" అని అడగగల ధైర్యం నాకు లేకపోయింది.

బావిలో పడకపోయినా, తొందరలో ఏదో ఒకరోజున అమ్మ రోగంతో చనిపోతుందని నాకు తెలుసు.

అయినాగాని నా మూలంగా చస్తుందేమోనని భయపడ్డాను.

ఒకరిచావుని మరొకరెంతమటుకు ఆగికట్టగలరు?

ఆమాట అన్న మూడు నెలలకే అమ్మ చనిపోయింది.

"అరుంధతితో మాట్లాడావంటే, నేనూ, నీ వదినాకూడా తలెత్తుకు తిరగలేం ఈ ఊళ్ళో. జరుగకూడనిది ఏదైనా జరిగితే నీకూ, మాకూ ఏ విధమైన సంబధంవుండదు" అని శాసించాడు అన్నయ్య.

అన్నయ్యంటే గౌరవం, వదినంటే ఆపేక్షా నాకు.

కాదనలేకపోయాను.

కాని అన్నయ్యే, మావయ్యలతో కలసి దొంగవిల్లుసృష్టించి ఇంట్లోంచి తరిమేశాడు నన్ను.

అప్పుడు తెలుసుకున్నాను, తాటాకు చప్పుళ్ళకే బెదిరిపోయానని.

కాని ఇప్పుడు కావాలనుకుంటే మాత్రం నా అరుంధతి ఎక్కడినుంచి వస్తుంది?

నన్ను బెదిరించిన వాళ్ళంతా నిక్షేపంగా వారి దోవలు వారు చూసుకున్నారు. కాని అరుంధతి చచ్చిపోయింది.

కిరసనాయిల్ అంటించుకుని మరీ చచ్చిపోయింది.

పోతూ పోతూ ఈ గులాబీ మొక్కని నాకిచ్చిపోయింది.

ఆ రోజెంత గొడవ జరిగిందని!

నేనూ, అమ్మ, వదిన, మావయ్యలు, అన్నయ్య అందరం చావిట్లో ఉన్నాము.

"గోపీ" అని ఎవరో వాకిట్లోంచి పిలచినట్లయింది.

ఆ గొంతువిన్న నేను ఉలిక్కిపడ్డాను.

నాలిక తడారిపోయింది. లేచి బయటికెళ్ళే లోపల అరుంధతి చేతిలో ఇంత గులాబీ మొక్క పట్టుకుని వచ్చింది.

నాకు నిలువెల్లా చెమటపోసింది.

మిగతా వాళ్ళందరూ నిశ్శబ్దంగా ఆమెని నమిలి మింగివేసేటట్లు చూశారు.

"గోపీ, ఇదుగో ఈ గులాబీ నీ దగ్గరుంచుకో. ఈ మొక్కని వాడనివ్వకు"— అని ఆ మొక్క నా చేతిలో ఉంచింది.

నేను అయోమయంగా అందుకున్నాను.

ఆమె తిరస్కారంగా అక్కడున్న మనుషులందరివంక చూసి "వీళ్ళెవ్వరి నీడా సోకనిచోట ఈ గులాబీని పెంచు. వీళ్ళ గాలి తగిలితేనే అది మాడిపోతుంది" అన్నది.

నిరుత్తరుడినయి చూశాను.

"గోపీ నేను వెళుతున్నాను" అని నన్ను బలంగా హృదయానికి హత్తుకుని నుదుటిపై ముద్దు పెట్టుకుని వెళ్ళిపోయింది.

నేను నిశ్చేష్టుడినయిపోయాను.

చెప్పలేని భయం కలిగింది. పిరికివాడిని.

నా భయాన్ని నిజంచేస్తూ అలా వెళ్ళిపోయిన అరుంధతి కిరసనాయిల్ పోసి అంటించుకుని చచ్చిపోయింది.

పీడ విరగడయిందన్నారంతా.

ఇప్పుడేరి వాళ్ళంతా? అమ్మ చనిపోయింది.

అన్నయ్య, వదిన, మావయ్యలతో కలిసి దొంగవిల్లుసృష్టించి ఇంట్లోంచి తరిమేశారు నన్ను.

వాళ్ళందరికోసం పిరికివాడి

నయ్యాను నేను.

నా వెలుగులోనుంచి చీకటిలోకి జారుకున్నాను.

ఇప్పుడు నాకు మిగిలింది చీకటే.

ఇన్నిరోజులూ భద్రంగా అరుంధతి ఇచ్చిన గులాబీ మొక్కని కాపాడుకుంటూ వస్తున్నాను.

ఆ చెట్టున పువ్వు పూచినప్పుడల్లా అరుంధతి నవ్వినట్లు అనిపిస్తుంది నాకు.

పడక కుర్చీలోనుంచి మెల్లిగా గులాబీ తల నిమిరాను.

"గోపీ. వెంటనే రావాలి. మీ అన్నయ్యకు కారు క్రిందపడి కాలు విరిగింది"—వదిన ఏడుస్తూవచ్చి నిలబడింది.

నివ్వెరపోయాను.

వెళ్ళమంటావా అని గులాబీని అడిగాను, తలాడించలేదు. వెళ్ళవద్దు అన్నట్లుగా నిశ్చలంగా ఉన్నది.

"గోపీ ప్లీజ్. జరిగినదంతా మర్చిపో. ఒక్క కడుపున పుట్టినవాళ్ళు. నువ్వు కాకుంటే ఎవరాదుకుంటారు" వదిన నా రెండు చేతులూ పట్టుకుంది. ఆమె కళ్ళనుండి నీళ్ళు జారి నా చేతులపై పడుతున్నాయి. బలహీనుడినయ్యాను.

"పద వదినా" అని హడావుడిగా పరుగెత్తాను, పనిపిల్లవాడిని ఇంటికి కాపలాపెట్టి.

అన్నయ్యని హాస్పిటల్‌లో చేర్చి, ఫరవాలేదు అన్న తరువాత ఇంటికి వచ్చేటప్పటికి చీకటి పడబోతుంది.

ఇల్లు తాళంవేసి ఉంది.

నేను ఇంటికి కాపలాపెట్టి వెళ్ళిన పనిపిల్లవాడు లేడక్కడ.

ఎక్కడ షికార్లు కొట్టటానికి వెళ్ళాడో?

ఉసూరుమంటూ గులాబీ దగ్గిరికి వెళ్ళి నుంచున్నాను.

"మే... మేమే..." అని అరుస్తూ మేక అక్కడినుంచి పరుగెత్తింది.

నా కళ్ళు బైర్లు గమ్మాయి.

ఆ మేక తిని వెళ్ళగా మిగిలిపోయిన గులాబీ చెట్టు చిన్న మొండెం నా కళ్ళముందు కనపడింది.

ఆ చీకటిలోకి జారిపోయి అక్కడే కూలబడ్డాను.

మేకలాంటి నా మనసులో ఉన్న పిరికితనం అరుంధతిని కబళిస్తే, మేక ఆమె ఇచ్చిన గులాబీని కబళించింది.

□□□



ప్రముఖుల హాస్యాలు

గాంధి మహాత్ముడు ఒకసారి లండను వెడుతున్నారు ఓడలో. ఆ ఓడలో ప్రయాణిస్తున్న ఒక శ్వేత జాతీయునికి మహాత్ముని మీద ఎంతో కోపంగా వుంది. అయన




సిద్ధాంతాలను ఖండిస్తూ యాభైపేజీల వ్యాసం ఒకటి వ్రాసి తీసుకువెళ్ళి మహాత్ముని ఇచ్చాడట.

మహాత్ముడు ఆ కాగితాలన్నీ చదివారట. చివరకు వాటికి పెట్టివున్న గుండుసూది తీసుకొని, కాగితాలు తెల్లవానికి ఇచ్చివేశారు.

'ఇదేమిటి? కాగితాలు తిరిగి ఇస్తున్నావు? వీటి విలువ తెలియ లేదా?" అన్నాడుట ఆ తెల్లమనిషి. మహాత్ముడు గుండుసూది ఆయనకు చూపిస్తూ 'విలువ గలది తీసుకున్నానుగాళ" అన్నారుట. ఆ తెల్లవాని ముఖం సగం నల్లబడి, మాటరాక వెళ్ళిపోయాడట.

◆

ఒకసారి అఖిలభారత కాంగ్రెసు మహాసంస్థ కార్యదర్శిగావున్న కృపలానీ వద్దకు ఒకవ్యక్తి వచ్చాడుట, అతడు గాంధీజీలాగా కొల్లాయి కట్టాడు. పిలక పెట్టాడు. బొడ్డున



ఒక గడియారం వ్రేలాడ కట్టాడు. చేత ఒక కఱ్ఱ పుచ్చుకొన్నాడు.

'నేను గాంధే యుణ్ణిగా మారి పోయాను—తెలుసా?" అని ఎంతో గర్వంగా చెప్పాడట.

కృపలానీ కొంచెంసేపు ఆ వ్యక్తి వంకచూచి 'కొద్ది మార్పు అవసరం" అన్నాడట.


'ఏమిటీ?" అని ఆ వ్యక్తి ఆశ్చర్యంగా అడిగాడుట.

'ఆముందు పళ్ళు రెండు వూడ గొట్టుకోవడం" అన్నాడు కృపలానీ.

గాంధిజీకి ముందు పళ్ళు లేవు. అవి తీస్తేగాని గాంధీజీ బాహ్యవేషం పూర్తి కాదని కృపలానీ భావం. మరో విధంగా హేళన.

✻

1942 లో క్రిప్సు రాయబారం విఫలమైంది. కాంగ్రెసు విధించిన షరతులకు ఒక్క అడుగు వెనక వెయ్యడానికిఅంగీకరించలేదు. క్రిప్సు నిరాశతో వెళ్ళిపోతూ కాంగ్రెసు నాయకులను అడిగాడట — పోనీ ఒక్కసారి మందహాసంతో కరచాల



నం చెయ్యండి, ఒక్కసారి ఫోటోకు నిలవండి" అని.

నెహ్రూజీ వెంటనే ఇలాజవాబు చెప్పారట 'కరచాలనం, ఫోటోలో పడటం – వీటికి ఫర్వాలేదు. కాని మందహాసానికీ, మా షరతులకూ సంబంధం వుంది. అవి కుదరందే మందహాసం కుదరదు' అన్నారట.

క్రిప్సు తనలో తనే నవ్వుకొంటూ అందరితో కరచాలనం చేశాడట.

✻

శ్రీ పూనాచా వెనుక ఒకసారి లోక్ సభలో మాట్లాడుతూ —




'సేలంలో ఫ్లయింగ్ క్లబ్ వున్నది. కాని అక్కడ విమానాశ్రయం నెలకొల్పలేక పోయాం" అన్నాడు.

శ్రీ అర్జున్ ఆరోరా వెంటనేఅందుకొని 'అయితేక్లబ్ ఎలాపనిచేస్తుంది? వారు విమానాలు ఎగరవేస్తారా? గాలిపటాలా?— అన్నాడు.

పూనాచా 'ఈ ప్రశ్న విషయంలో కొంత గడువు కావాలి" అన్నారు.

— రా వూ రు



(గత సంచిక తరువాయి)

27

గోమతికన్న కల ఆ ఉదయం ఫలించకపోయినా ఆరోజు వారి మధ్యగా నిలచిన అడ్డుగోడలో కాస్త పగులు కన్పించింది. "హల్లో గోపాలం! కంగ్రాచ్యులేషన్స్, అంటూ పరవళ్ళు తొక్కుతున్న వరదపోటిలా వచ్చిపడ్డాడు గోవిందు.

"థాంక్స్" అన్నాడు గోపాలం నవ్వుతూ.

కాని గోవిందు ఉత్సాహం ముందర గోపాలం ముభావం అట్టేసేపు నిలవలేక పోయింది. పళ్ళ బిగువుతో పదిమాటలకి నవ్వకుండా పెద్దరికపు ఆధిక్యత నిల్పుకొన్నా అటు తరువాత గోవిందు స్నేహం ముందు గోపాలానికి తలవంచకతప్ప లేదు.

వంటఇంటిలోంచి మూడు కప్పుల కాఫీ పట్టుకొని గోమతి అక్కడికి వచ్చింది.

"నేను వచ్చినట్లు నీ కెలా తెలిసింది, నాక్కూడా కాఫీ పట్టుకు వచ్చావు ?" అన్నాడు గోవిందు ఆమె చేతిలోని కప్పు అందుకుంటూ!

"నిద్రలోకూడా నీ రాకపోకల్ని గోమతి గ్రహించగలదు గోవిందూ ! ఇదేమంత విశేషమని ఆశ్చర్య పోతున్నావు !" అన్నాడు గోపాలంగోమతి వంకచూస్తూ.

గోమతి గోపాలంమాట విన్పించుకోనట్లు గోవిందువంక చూస్తూ — "బావకి కాఫీ కలుపుతుంటే నీ మాటలు విన్పించేయి. ఇవ్వకపోతే ఏడ్చుకొంటావని తెచ్చేను" అంది నవ్వుతూ.

"నాకూ దివ్యదృష్టి ఉందంటే నువ్వు నమ్మవుకాని ... చూసేవా సమయం చూసుకొని ఎలావచ్చేనో ఒక్క పది నిమిషాలు ఆలస్యమవుతే నీచేతి కాఫీ తాగే అదృష్టాన్ని కోల్పోయి వుండేవాడిని" అన్నాడు గోవిందు తనూ గోమతితోపాటు నవ్వుతూ.

గోపాలానికి వీరి ఎకసక్కెలు ఎందువల్లనో విసుగు కలిగించేయి. వారి మాటల్లో కలుగజేసుకోకుండా ఎదురుగా గోడకి ఉన్న కేలండరులోబొమ్మని చూస్తూ కాఫీ తాగుతున్నాడు.

మౌనంగావున్న గోపాలాన్ని మాటల్లో దింపాలన్న ఉద్దేశంతో—

"ఈరోజు కాఫీ నేను స్వయంగా కలిపేను. ఎలావుంది బావా ?" అంటూ ప్రశ్నించింది గోమతి.

"ఏమిటి విశేషం ?" అన్నాడు గోవిందు.

"నువ్వు ఉదయాన్నే దర్శన మిచ్చేవని" గోపాలం తడుముకోకుండా జవాబు చెప్పేడు.

"అదేంకాదు. నువ్వు ఫస్టుక్లాసులో పరీక్ష పాసయ్యేవని" గోవిందు వాదనకి దిగబడ్డాడు.

"రెండూకాదు. అమ్మకి ఒంట్లో సరిగాలేదు. ఈరోజునుంచి కాఫీ ఫలహారాలశాఖని నేను హస్తగతం చేసుకొన్నాను."

"అయితే అత్తయ్యగారికి ఒంట్లో కులాసాగా వుండేవరకుమాకీపాట్లు తప్పవన్నమాట" అన్నాడు గోవిందు కప్పులోని కాఫీని రుచిచూసి మూతి మూడువంకలు తిప్పుతూ.

ఆ మాటకి గోమతి ముఖం చిన్నబోయింది.

జరిగిన కథ

గోమతి ఒకనాటిరాత్రి తన బాల్యాన్ని నెమరువేసుకుంటోంది. అప్పటికి ఆమెకి ఏడేళ్లు. బాగా అల్లరి చేసేది. రంగమ్మగారి కొడుకు గోవిందు ఆమె నేస్తం. అతని తప్పు తనమీద వేసుకుని ఆమె క్లాసులో దెబ్బలు తినేది. గోవిందుకు ఆమె ఎంత చెబితే అంత. ఆమెకోసం ఏ పని అయినా చేసేవాడు. వారిద్దరి అల్లరికి ఊరూ వాడా ఏకమయ్యేది. ఇలా వుండగా గోమతి తండ్రి రామనాథం ఒకనాడు ఒక కుర్రవాడిని ఇంటికి తీసుకువచ్చాడు. వాడి పేరు గోపాలం. రామనాథానికి మేనల్లుడు. వాడిని పెంచి పెద్ద చేసే భారం తనపై వేసుకున్నాడు. గోమతికి వాడినిచ్చి పెళ్ళి చేయాలని కూడా రామనాథం దంపతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

'గోవిందు వూరకే అంటున్నాడు గోమతీ! నీ చేతులతో తయారు చేసి యిచ్చిన ఈ కాఫీ అమృతంలా వుంది' అన్నాడు గోపాలం తన మెప్పును చూపుఃలో కనపరుస్తూ.

"అంటే అర్థం తెలుసుకదూ గోమతీ! పంచదార పానకంకన్నా మధురంగా ఉందన్నమాట' గోవిందు అందుకున్నాడు.

"ఇంక ఈ ధోరణి ఆపండిబాబూ! నిజంగా అంటున్నారో లేక నన్ను ఏడిపించాలని అంటున్నారో నాకు తెలిసి చావడంలేదు. ఈ వాదోప వాదాలుమాని కాసేపు కేరమ్సు ఆడుకొందాం రండి' అంది గోమతి.

గోమతి అభిప్రాయాన్ని మిగిలిన ఇద్దరూ బలపరిచేరు. మూలపడివున్న కేరమ్సుబోర్డుని ముందుకి లాగి బూజు దులిపి పిక్కలు సర్దింది గోమతి గోవిందు, గోమతి ఒకటి గోపాలం ఒక్కడూ ఒకటి వాళ్ళు ఎప్పుడు ఆడినా అలాగే ఆడుతారు. అలా ఉంటేనే ఉజ్జీలు సరిగా ఉంటాయి.

రెండు ఆటలు వరుసగా గోపాలం గెల్చుకొన్నాడు. మూడవసారి ఏమైనా తాము గెలిచి తీరాలని బహు జాగ్రత్తగా ఆట ఆడుతున్నాడు గోవిందు.

గోమతి రెడ్ కొట్టింది. గోవిందు ఉత్సాహంగా కేకలు పెట్టేడు. కాని రెడ్‌కి ఫాలోగా ఇంకో పిక్కని కొట్టవలసి ఉంది మంచి పాయింట్‌లో ఉన్న పిక్కనికూడా గోమతి కొట్టలేక పోయింది. ఆ పిక్కని కాని గోమతి కొట్టగలిగితే ఆసారి విజయం తమదే అని భావించేడు గోవిందు. గోమతి చేతిలోకి వచ్చిన మార్కుల్ని జారవిడిచినట్లు భావించి కోపంతో కేకలు వేసేడు.

"ఈరోజు నువ్వు కొంచెంకూడా శ్రద్ధలేకుండా ఆడుతున్నావు. అంత మంచి పాయింట్‌ని కొట్టలేకపోతే కేరమ్సు ఆడడం మానుకొంటే సరి' అన్నాడు విసుగుదలతో.

"నా కింతకన్న బాగారాదు. వచ్చిందేదో ఆడుతున్నాను. సీకిష్టమైజతగా ఉండమంటే ఉంటాను. లేకుంటే రెండుఆటలు నువ్వేఆడుకో' అంది గోమతి.

నిజానికి ఆరోజు గోమతి తగినంత శ్రద్ధ తీసుకొని ఆడటం లేదు. కావాలనే ఆ పిక్కని సరిగా కొట్టకుండా గురి తప్పించింది. ఆరోజు అన్నిటా విజయలక్ష్మి బావని వరించాలని ఆమె కోరిక.

"మీ బావని గెలిపించాలని అలా చేసేవు' గోవిందు ఇంకా వాదన అపలేదు.

"అతడిని గెలిపించేదాకా నాకేం పట్టింది? ఎంతబావైనా ఆటలోపార్ట్‌నర్ కంటే ఎక్కువా?' అంది గోమతి.

గోవిందు ఇంకా వాదిస్తూనే ఉన్నాడు.

"నేనింక ఆడబోవడం లేదు' గోపాలం లేచిపోయేడు.

గోమతికూడా కిందపడ్డ పిక్కల్ని బోర్డుమీద పడవేసి తనూ లేవబోయింది.

'ఉండు మనిద్దరం ఒకఆటవేద్దాం. ఎవరు గెలుస్తారో చూద్దాం'అన్నాడు గోవిందు.

లేవబోతున్న గోమతి తిరిగి కేరమ్సు బోర్డుముందు కూర్చుంది.

'భోజనానికి వేళ అయినట్లు



వుంది' అన్నాడు గోపాలం దండెం మీది తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ.

"ఇప్పుడే కదా కాఫీతాగేం. ఈ ఒక్క ఆట పూర్తికానీ, తనేదో నాకన్న మహగొప్పగా ఆడతాడని గోవిందు అనుకొంటున్నాడు. ఆ అనుమానం ఏదో ఈరోజు తేలిపోవాలి'

అంది గోమతి ఆటను ప్రారంభిస్తూ.

గోమతి ఆట పూర్తిచేసి గోవిందు మీద విజయం సాధించింది. విప్పారిన ముఖంతో భోజనాల గదిలో కాలు పెట్టింది. అప్పటికే గోపాలం భోజనం చేసి ఎక్కడికో వెళ్ళిపోయేడు.

'బావ భోజనం అయిందా?' ఎదురుగా ఉన్న ఎంగిలి కంచం చూస్తూ ప్రశ్నించింది గోమతి.

'ఎవరో స్నేహితుణ్ణి చూసిరావాలంటూ వెళ్ళేడు. నువ్వెంత పిల్చినా రాలేదు ఒక్కడూ తిని పోయేడు' అంది సావిత్రి.

'నేను వెళ్తున్నాను గోమతీ' అన్నాడు గోవిందు వరండాలో నిలబడి.

'రా... భోజనం చేసి వెళ్దువుగాని' అంది సావిత్రి.

'వద్దండీ. అమ్మ నాకోసం కని పెట్టుకొని ఉంటుంది' అంటూ గోవిందు వెళ్ళిపోయేడు.

కూతురికి కంచంలో అన్నంపెట్టి దగ్గర కూర్చుంది సావిత్రి. తల్లితనతో ఏదో చెప్పాలను కొంటున్నాదన్న విషయం గోమతిగ్రహించింది. లీలగా ఆ విషయం కూడా ఆమె ఊహించింది.

గోవిందుతో కేరమ్సుఆడుతుంటే ఆరోజున ఏ కారణం వల్లనో అటువంటి ఆలోచనే గోమతి మనసులో కూడా కదిలింది.

'చూడు గోమతీ!' సావిత్రి సంభాషణ మొదలు పెట్టింది.

'నీ తల్లిని. నీ మంచికోరి చెప్తున్నాను. నువ్వు గోవిందుతో అంత చనువుగా మసలడం మంచిది కాదమ్మా, చిన్ననాటి స్నేహాన్ని నిల్పుకోవచ్చు కాని, వాటిని తగిన హద్దుల్లో ఉంచుకోవాలి.

'నీటిలో నిప్పు పుట్టించే ఈసమాజంలో ఏకాస్త లోకువ దొరికినా ఆడపిల్ల బ్రతుకుపై మచ్చ పడుతుంది తల్లీ.'

'అలాగే అమ్మా! ఇకముందు గోవిందుని ఉంచగలిగినంతదూరంలో ఉంచుతాను' అంది గోమతి.

ఆమాట పూడిన ఆమె కంఠం లోంచి బాధగా పెగుల్చుకొని వచ్చింది. కలుపుకొన్న మజ్జిగఅన్నం పూర్తిగా తినకుండానే కంచంలో చెయ్యి కడుక్కొని వెళ్ళిపోయింది.

అర్ధాకలితో గదిలోకి పోతున్న కూతురివంక క్షణకాలంచూసి సావిత్రి కళ్లు దించుకుంది.

ఇది జీవితమమ్మా! కొన్ని విధి నిబంధనలకి కట్టుపడి నడక సాగించాలి. కావాలనుకున్న ప్రతిపనీ చేయలేము. చేసిన పనులన్నిటికీ అర్థాలు చెప్పలేము. ఏదో మహత్తర శక్తి ప్రేరణవల్ల మన ప్రమేయం లేకుండానే చాలవరకు మన చర్యలు సాగిపోతుంటాయి. అవి జరిగిపోయేక వాటికి అర్థతాత్పర్యాలు చెప్పుకొంటాము. కారణ కార్యాలు ఊహిస్తాము, అంతా ముందే తెలుసని. అందుకే అలా చేసేమని ప్రగల్భాలు పల్కుతుంటాము. కనీసం అలాగని సంతృప్తి పడతాము.

తన జీవిత అనుభవాల సారాంశాన్ని ఎదుటలేని కూతురికి బోధిస్తున్నట్లు తనకి తనే చెప్పుకొంది సావిత్రి.

28

వంటపని ముగించుకుని ముందు చావిట్లోకి వచ్చింది సావిత్రి. వంట గదిలోని దీపంవెలుగు కాస్తగా చావిడి మధ్యభాగంలో పడుతున్నా మిగిలిన ప్రదేశమంతా చీకటిగా ఉంది.

'గోమతీ! లైటు వేసుకోకుండా ఏం చేస్తున్నావే? ఈ వేళప్పుడు నిద్ర పోతున్నావా?' అంటూ లైట్ స్విచ్ వేసి కూతురికోసం ఇటు అటు చూసింది. గోమతి అక్కడలేదు.

అయినప్పుడు, కానప్పుడు ఆ రంగమ్మ గారింటికిపోయి కూర్చుంటుంది. ఆవిడతో దీనికి మాటలేముంటాయి; ఆ గోవిందుకోసం కాక పోతే.

పెద్దదాని వవుతున్నావు, బాగుండదే నా తల్లీ అంటే వినదు. మెల్లగా చెప్తే అర్థం చేసుకోదు. గట్టిగాఅంటే ముఖం ముడుచు కొంటుంది. దీన్ని ఎలా దారిలోకి తీసుకురావాలో... ఏం చెయ్యాలో తెలిసి రాకుండా

గురుకుల్ కాంగడీకి చెందిన చార్య రామ్‌దేవజీ, ఒకసారి



మనస్సు సరిగా లేనందువల్ల మన శ్శాస్త్రజ్ఞుని దగ్గరకు వెళ్లారు. ఆ డాక్టర్ పిలిచి ఒక కుర్చీలో కూర్చోపెట్టి విషయమంతా అడిగి 'మీరిప్పుడు బాగవుతూ ఉన్నామని మీ మనస్సులో అనుకుంటూ ఉండండి' అని అన్నాడు, రామ్‌దేవజీ కళ్ళల్లోకి చూస్తూ.

ఆచార్య రామ్‌దేవజీ కొద్ది సేపు అలాగే కూర్చుని డాక్టరు ఏమీ చెప్పనందుకు విసుగేసి మెల్లగాలేచి వెళ్ళసాగారు. తన పేషంటు డబ్బు ఇవ్వకుండా వెళుతున్నందుకు భయపడి 'నా ఫీజు' అని అడిగాడు డాక్టరు.

'మీకు నేను ఫీజు ఇస్తున్నట్టే అనుకుంటూ కూర్చోండి' అని అన్నారు ఆచార్య రామ్‌దేవజీ బయటకు వెళుతూ.

ఉంది—తనలోతనే సణుగుకొంటూ చిందర వందరగా పడి ఉన్న పుస్తకాల్ని, బట్టల్ని సర్దసాగింది సావిత్రి.

రామనాథం వీధిలోంచి వచ్చి, చెమటకి తడిసిన కమీజుని విప్పి వంకెకి తగిల్చి మంచంమీద కూలబడ్డాడు.

"ఈరోజు ఇంత ఆలస్యం అయిందేం? ఇంతవరకూ ఆఫీసులోనే?" గ్లాసుతో చల్లని నీళ్ళని అందిస్తూ ప్రశ్నించింది సావిత్రి.

"లేదు. ఆఫీసునుంచి రోజూ వేళకే వచ్చేను. దారిలో గోపాలం కన్పిస్తే అలా పార్కుకుపోయి కూర్చున్నాం."

"గోపాలం ఏడీ? మీతో రాలేదా?"

"ఎవరో స్నేహితుడు కన్పిస్తే సగంలో ఆగిపోయేడు. ఈ పాటికి వస్తూఉండాలి."

భర్త అంతసేపూ మేనల్లుడితో తీరుబడిగా మాట్లాడేడంటే అది కూతురి పెళ్ళిగురించే అయి ఉంటుందని సావిత్రి ఊహించింది. ఆమాట తనే చెప్పనీ. నే నెందుకు ఆత్రం చూపాలిఅని కుతూహలాన్ని అణచుకొంది.

రామనాథం భార్య చేతిలోని గ్లాసు అందుకొని ఒక్క గుక్కలో నీళ్ళు పూర్తిచేసి అలా మంచంమీద జేరబడ్డాడు. ఎంతకీ భర్తనోట ఏ మాటా రాకపోవడంతో సావిత్రి ఇంక వేచి ఉండలేకపోయింది.

"దేన్ని గురించి ఆ మంతనాలుకో" అంది అతని పక్కను కూర్చుంటూ.

"మంతనాల కేమున్నది సావిత్రీ! వాడి చదువు పూర్తి అయింది. వయసు వచ్చింది. అటువంటప్పుడు కలిగే ఆలోచనలు రెండే. మొదటిది ఉద్యోగం, రెండవది కళ్యాణం."

తను ఆశించిన విధంగానే మామా, అల్లుళ్ళమధ్య సంభాషణ మొదలయినందుకు సంతోషించింది సావిత్రి.

"సరే" అంది ఉత్సాహంగా.

భార్య ఉత్సాహాన్ని గమనించకుండా అలా కళ్ళు మూసుకుని చెప్పుకు పోతున్నాడు రామనాథం.

"అప్పుడప్పుడు చెప్తుండేవాడు చూడు, జనార్దనంగారి గురించి. తనకి హాస్టల్లో సీటుకి దానికి సహాయపడ్డారని, తనంటే ఎంతో అభిమానం అనీ..."

"అవును. హాస్టల్లో తిన్నగా చదువు సాగకపోతే తమ ఇంటిలో వచ్చి ఉండమని ఆయనేకదూ అన్నారని చెప్తుండేవాడు?"

"అవును. ఆయనే. పరీక్షలు పూర్తి అయేక గోపాలాన్ని కలుసుకొని ఏం చేస్తావు—అని అడిగేరుట. ఏదైనా ఉద్యోగం చూసుకొంటానన్నాడుట గోపాలం."

"అతని ఎరికను ఏదైనా మంచి ఉద్యోగం వుందా?" ఆశగా ప్రశ్నించింది సావిత్రి.

"అటువంటిదేం లేదు సావిత్రీ! అసలు అతడి అభిప్రాయంలో

గోపాలం ఇంతటితో చదువు అపు చెయ్యటం మంచిపనికాదు."

"నిజమే. పిల్లాడు తెలివిగా చదువుకుంటున్నాడు. కాని చెప్పించేందుకు మనకి తాహతుఉండొద్దూ? ఇప్పటికే అ చేసిన అప్పంతా ఎలా తీరుతుందిరా భగవంతుడా అని బెంగపడుతున్నాను. మరో రెండేళ్ళ చదువంటే మాటలతో పనా?"

"గోపాలం కూడా అమాటే అన్నాడుట. దానికి అయన ఏమన్నాడంటే..."

"ఏమన్నాడు."

"పై చదువులకి తను డబ్బు పెడ్తానన్నాడట. ఇంకా విదేశాలకి కూడా పంపిస్తానన్నాడుట."

"నిజం? ఎంత మంచివాడు!"

"కాని ఒకవిధంగా అతని మంచితనం మనకి చెడుగు చేసింది."

"అంటే ఏమిటి మీ ఉద్దేశం?"

"నేను చెప్పబోతున్నది నా ఉద్దేశంకాదు. అక్కడవున్న పరిస్థితి. ఆ జనార్ధనంగారికి ఒక కూతురు ఉంది. ఆమె గోపాలం క్లాసే చదువుతున్నాదిట. ఆ పిల్లని మనవాడు చేసుకొంటే... వాళ్ళకి చాలా ఆస్తి ఉందిట ఆ ఒక్కతే సంతానం..."

క్షణకాలం ఏదో అనబోయి తెరచిన నోటిని అలాగేఉంచి భర్తవంక మిడిగుడ్లతోచూస్తూ ఉండిపోయింది సావిత్రి.

"అదెలా సాధ్యపడుతుందండీ. బహుశ మేనరికం ఉన్నసంగతి వారికి తెలిసి ఉండక అలా అని ఉంటారు" అతి స్వాభావికంగా ఆ మాట అనాలని ప్రయత్నం చేసింది సావిత్రి. అయినా ఆమె కంఠంలోని జీర ఆమె ఆరాటాన్ని తెలియజేసింది.

"నువ్వన్నట్లు మేనరికం గురించి వారికి తెలిసి ఉండక పోవచ్చు. కాని గోపాలాన్ని వరించనున్న అదృష్టం గురించి మనకు తెలుసు కదా. కాదని వాడిని ఎలా అడ్డగిస్తాము సావిత్రీ! మన మంచికోసం వాడి భవిష్యత్తును ఎలా పాడుచేస్తాము?"

"అలాగని కమ్మగా కాచుకున్న పాలను నోటిముందునుంచి తీసి చేజేతులా పారబోసుకొంటామా? నిజంగా వాడికి బాగుపడే రాత ఉంటేఅదృష్టంవాడిబ్రతుకులోఇంకో విధాన తొంగిచూస్తుంది."

"చేతిలోకి రానున్న అవకాశాన్ని జారవిడుచుకొని మళ్ళా దేవుడే ఏదో చెయ్యాలనుకోవడం అత్యాశ అవుతుంది సావిత్రీ! గోపాలం గోమతిని పెళ్ళిచేసుకొని ఎక్కడో దగ్గర గుమాస్తాగా బ్రతుకు వెళ్ళమార్చడం మంచిదా, లేక వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని జీవితంలో అభివృద్ధి సాధించడం మంచిదా? అన్న విషయాన్ని మనం శాంతంగా ఆలోచించాలి.

"వాడితల్లి బ్రతికిఉంటే ఈ పరిస్థితులలో ఏమి సలహా ఇచ్చేదో మన మంచి చెడ్డలతో ప్రమేయం లేకుండా మనంకూడా అటువంటి సలహా వాడికి ఇయ్యాలి."

"మీకేం పిచ్చిగాని పట్టిందా? ఉన్నదికాస్తా ఊడ్చి వాడి చదువుకి పెట్టి ఇప్పుడు ఫలితాన్ని ఇంకెవరికో అప్పచెప్తానంటారేం! చేతిలో డబ్బు లేకుండా రేపు గోమతి పెళ్ళి ఎలా చెయ్యాలనుకొంటున్నారు? మేనల్లుడైనా, అల్లుడైనా, కొడుకైనా వాడే అనుకొని ఇంతకాలం ఇన్ని ఆశలు పెట్టుకొని పెంచి, ఇప్పుడు శెనగలు తిని చేతులు దులుపుకొన్నట్లు ఈ త్యాగాలూ, ఈ న్యాయాలు వల్లె వెయ్యడం నావల్లకాదు.

"మీరేం కల్పించుకొని గొప్పలకి పోకండి. నేను వాడితో మాట్లాడి ఒప్పిస్తాను. ఇంతకాలం ఈ ఇంట పెరిగి అపాటి కృతజ్ఞత లేకుండా అలా దులుపుకు పోయే రకం కాదు గోపాలం" అంది సావిత్రి.

గోమతి అక్కడికి రావడంతో ఆ సంభాషణ ఆగిపోయింది.

"ఇంతరాత్రివరకు ఎక్కడ తిరుగుతున్నావే? పెళ్ళికావలసిన పిల్లవి. కాస్త ఇంటిపట్టున కుదురుగా ఉండి నలుగురితో మర్యాదగా మసలు

సుప్రసిద్ధ ఫ్రెంచి రచయిత బాల్జాక్‌కు, ఇతరుల వ్రాతచూచి వారి వ్యక్తిత్వాలను చెప్పడమంటే చాలా ఇష్టం. ఈ విషయంలో తనను అందరూ ప్రతిభావంతుడని అనుకోవాలని అతని కోరిక. ఒక రోజు అతని దగ్గరకు ఒక స్త్రీ నోటు



బుక్కును తీసుకుని వచ్చింది. ఆ నోటు బుక్కులో ఒక చిన్న పిల్లవాడు వ్రాసినట్లున్న వ్రాత ఉంది, ఎంతోసేపు ఆ వ్రాతను పరీక్షించి. ఆలోచించి "ఈ పిల్లవాడు మీ కుమారుడా?" అని అడిగాడు బాల్జాక్.

"కాదు. అతనితో నా కెటువంటి సంబంధమూ లేదు" అని ఆమె అంది.

"అయితే. మంచిది. నిస్సంకోచంగా ఈబాలుని విషయం చెబుతాను. ఈబాలుడు గొప్పమూర్ఖుడు. పని దొంగ. తనజీవితంలో ఎప్పుడూ ప్రసిద్ధి పొందడు" అన్నాడు బాల్జాక్.

ఆమె అదివిని గట్టిగా నవ్వుతూ "మహాశయా! మీ చిన్నతనలో మీరు మాయింటి ప్రక్కన ఉండేవారు. ఈ నోట్ బుక్ మీదు బాల్యంలో వ్రాసుకున్నది. ఇది మీదే" అని అంది.

కోవాలనే జ్ఞానం ఉండనక్కరలేదూ?" అత్తమీది కోపం దుత్తమీద చూపినట్లు కూతుర్ని గట్టిగా కసురుకొంది సావిత్రి.

"అనవసరంగా దానిని ఎందుకు కేకలువేస్తావే. అదెక్కడికి వెళ్ళిందని ఆ ఆర్భాటం. ఆ పక్కగదిలోంచి లేచివస్తుంటే..." అన్నాడు రామనాథం కూతురివంక జాలిగా చూస్తూ.

"లైటుయినా వేసుకోకుండా ఆ గదిలో ఏంచేస్తున్నావే?" తమ మాటలుకాని కూతురు విన్నాదేమో అన్న కంగారుతో అడిగింది సావిత్రి.

"తలకాయ నొప్పిగా ఉంటే పడుకొన్నాను అమ్మా" నెమ్మదిగా జవాబు చెప్పి అక్కడినుండి వెళ్ళిపోయింది గోమతి.

29

ముగ్గురికీ భోజనాలు వడ్డించి గోపాలానికి ఎదురుగా పీటవాల్చుకొని కూర్చుంది సావిత్రి. కూరలోకి మరి రెండు గరిటెల నెయ్యివేస్తూ, "ఇకమీదట ఏం చెయ్యాలనుకొంటున్నావు గోపాలం?" అని ప్రశ్నించింది.

అంతవరకు ఉత్సాహంతో, వంటకాల రుచులమీదా, అవి వండేవారి నేర్పుమీదా అనర్గళంగా మాట్లాడుతున్న రామనాథంగొంతుక ఠకీమని ఆగిపోయింది.

గోంగూరపచ్చడిని నోట్లో పెట్టుకొంటున్న గోమతికి పలమారి అ

ఘాటుకి కళ్ళంట నీళ్ళు వచ్చేయి. అవసరం లేకుండా గ్లాసుడు మంచి నీళ్లు తాగేడు రామనాథం.

కంచం మీంచి దృష్టిని మళ్ళించి అత్తని చూస్తూ "అంతా మామయ్యతో చెప్పేను అత్తయ్యా!" అన్నాడు గోపాలం.

"అవును. నీవు చెప్పిన విషయమంతా మామయ్య నాతో చెప్పేరు. కాని, నువ్వు ఒక నిశ్చయానికి వచ్చే ముందుగా తెలుసుకోవలసిన మరి కొన్ని విషయాలు ఉన్నాయి. మీ అమ్మా, నాన్నల గురించి నీకెంత వరకు గుర్తుందో నాకు తెలియదు. వారిని గురించి నువ్వు ఈ సమయంలో తెలుసుకోవలసిన అవసరం ఉందని నా అభిప్రాయం.

"ఈ ఇంట మీ అమ్మ గోమతి కన్న అల్లారు ముద్దుగా పెరిగింది. మీ తాతయ్య తల్లిని కోల్పోయిన కూతుర్ని ఆమె ఆడిందే ఆటగా, పాడిందే పాటగా పెంచేరు. అతని అభిమానాన్ని ఆసరాగా చేసుకొని మీఅమ్మ తన బ్రతుకును నట్టేట కలుపుకొంది. ఇంటివారిని నవ్వులపాలు చేసింది."

ఆమె మాటల్ని గోపాలం, గోమతీ శ్రద్ధగా వింటున్నారు. రామనాథం ఏనాడో విడిచివచ్చిన జీవితంలోకి నడిచిపోతున్నాడు.

"ప్రేమా, సంస్కారం అంటూ కబుర్లుచెప్పి ఒక అంటరాని వాడి వెంటబడిపోయింది. ఇంటివారిని ఎదిరించి చర్చిలో పెళ్ళిచేసుకొంది. కూతురుచేసిన పనితో కుంగిపోయి, ఆ అవమానం భరించలేక మీతాత విషం మింగి చచ్చిపోయేరు. మీ మామయ్య ఉన్న ఊరుని, ఉద్యోగాన్ని వదలుకొని ఇలా మారుమూల స్థలాల్లో గోప్యంగా బ్రతుకు వెళ్ళదీస్తున్నారు.

"మన సంఘపు కట్టుబాట్లు అటువంటివి. ఒకరు చేసిన ధర్మవిరుద్ధమైన పనికి ఆ కుటుంబ సభ్యులంతా మూల్యం చెల్లించవలసి ఉంటుంది.

"పార్వతిని నా పెద్దకూతురు అనుకొని పెంచేను. పెళ్ళి, పేరంటం చేసి కళ్ళ పండువుగా చూసుకొని మురిసిపోవా లనుకొన్నాను. నా ఆశల్ని ఆదిలోనే తుంచి పోగు పెట్టింది పార్వతి. ఎక్కడో దగ్గర ఆమె క్షేమంగా ఉందని సంతోషించేము కాని ఆ సంతృప్తికూడా మాకు మిగులలేదు. నీ తండ్రి అకాలమరణ వార్త తెలియవచ్చింది. పార్వతి తిరిగి వస్తుందేమో అని చూసేము. తిరిగి వస్తే ఏంచెయ్యాలా అని మథనపడ్డాం.


"ఆమె అభిమానవతి. ప్రేమాభిమానాలకన్నా పరువుప్రతిష్ఠలే మీకు ముఖ్యమనుకొంటే ఈ ఇంట తిరిగి కాలుపెట్టను —"అంటూ వెళ్ళిపోయింది. ఆ మాట చెల్లించుకొంది.

"తల్లీ, తండ్రీ లేకుండా నువ్వు అనాథగా మిగిలిపోయేవు అన్న వార్త విన్నాక ఇంక మిగిలిన విషయాల్ని పట్టించుకోకుండా మీ మామయ్య నిన్ను ఇంటికి తెచ్చేరు. ఆనాడు మేము ఆదుకోకపోతే, నీ

తండ్రివంక బంధువుల దగ్గర నువ్వు పెరిగితే ఈనాటి నీ పరిస్థితి ఇంకో విధంగా ఉండేది. ఆ బాడిలోంచి నిన్ను బైటికిలాగి మనిషిగా తయారు చెయ్యా లనుకొన్నాను. నా ఇంట పెంచి, నా పిల్లనిచ్చి పెళ్ళిచేసి, నీ వెనుకగా నిలచిన కళంకాన్ని కడిగివేయాలనుకొన్నాను. అందుకే భయసందేహాల్ని పక్కకి నెట్టి నీ బాధ్యతని ధైర్యంగా స్వీకరించేను.

"ఈనాడు నిన్ను చూసి, నీ చదువు చూసి ఆ జనార్దనం ఎవరో పిల్లని ఇయ్యాలనుకొంటున్నాడు. కాని నీ అసలుబ్రతుకు బయటపడితే ఆకుమీది చీడపురుగులా నిన్ను విదిలిస్తాడు. నీ తండ్రివల్ల సంక్రమించిన ఖ్యాతి మాత్రం నీకు మిగిలిపోతుంది' అంటరాని వాడంటూ అంతా వేలెత్తి చూపుతారు.

"నీకు సంఘంలో గౌరవమర్యాదలతో బ్రతకాలని ఉంటే నా సూచన కాదనకు. నీకు కృతజ్ఞత అన్నది ఏ మాత్రమైనా ఉంటే మీ మామయ్య మనసు కలతపెట్టకు. ఈ రోజుల్లో ఆడపిల్ల పెళ్ళి అంటే ఎంత డబ్బు వెచ్చించాలో, ఎన్ని సమస్యలు ఎదురుకోవాలో నీకు తెలియంది కాదు. ఉన్నది కాస్తా నీ చదువుకు పెట్టి చేతులు ముడుపుకు కూర్చున్నారు మీ మామయ్య..."



తల్లి వాగ్ధోరణి గోమతికి కడుపులో కలచినట్లు అయింది. అయినవి కానివి వర్ణించి, గోపాలాన్ని ఇరుకునపెట్టి, ఇంటల్లుడిని చేసుకోవాలన్న ఆమెఆశయాన్ని గోమతి సమర్థించలేక పోయింది. తాము అతడి చదువుకి పెట్టిన డబ్బుకి మారుగా అతడు తనకూతుర్ని చేసుకోవాలన్నట్లు తల్లి మాట్లాడడం అసలే సహించలేకపోయింది. తను తలచిన కార్యాన్ని సాధించడానికి, గోపాలం తలిదండ్రుల జీవితాలను, నీతి నియమాలను ఆ సమయంలో ఆ పిల్లడికి తెలియజెయ్యడం అన్నది అన్యాయం అనుకొంది. ఆమెకి తల్లి స్వార్థంపట్ల, సంకుచిత మనస్తత్వం పట్ల ఏహ్యభావం కలిగింది.

బావ తన్ను పెళ్ళి చేసుకోవడానికి అమ్మ ఇన్ని ఉద్చులు పన్నవలసి వచ్చిందా అన్న ఆలోచనతో ఆ పిల్ల కళ్ళలో నీళ్ళు తిరిగేయి.

అత్తమాటల్ని వింటూ క్రీగంట గోమతిని చూసేడు గోపాలం. ఆమూవులో అటునుండి ఏదో సానుభూతి తన లభ్యమవుతుంది అన్న భావన ఉంది కాని గోమతి కాళ్ళలో తొణుకులాడుతున్న విరక్తి, ఏహ్యభావాలు అతనికి ముఖం తిరిగేలా సూటిగా తగిలేయి.

తలవంచుకొని గడచిన రోజుల జ్ఞాపకాల్లో సంచరిస్తున్న రామనాథం వల్ల గోపాలానికి ఎటువంటి ఆప్యాయత కాని, సహాయం కాని అందలేదు. అన్నివైపులనుండి ఒక్కుమ్మడిగా ఎత్తివచ్చిన అనాదరాన్ని నిశ్చలంగా అందుకొన్నాడు గోపాలం.

సావిత్రి తన బాణాలన్నీ ప్రయోగించి, వాటి ఫలితాల కోసం వేచి ఉంది. తన అస్త్రం వెల్లడికాకుండా మట్టిగతెచ్చే నెపంతో అక్కడినుంచి లేచివెళ్ళింది.

ఆమె తిరిగి వచ్చేసరికి గోపాలం ఒక నిర్ణయానికి వచ్చేడు. గోమతి మౌనం ఆ నిర్ణయానికి ఎంతో బలం ఇచ్చింది. నిశ్చలంగా అత్త కళ్ళలోకి చూస్తూ మాట మొదలుపెట్టేడు.

టీచరు :- నాలుగు నారింజ కాయాల్ని అయిదుగురికి సమానంగా పంచడం ఎలా ?

"విద్యార్థి :- రసం పిండి అయిదు భాగాలు చేయాలండి.


"అత్తయ్యా! నా తలిదండ్రుల గురించి నువ్వు శ్రమతీసుకొని వివరంగా చెప్పినందుకు చాలా సంతోషం. ఏదో సమయంలో ఈ విషయాలు నేనే అడిగి తెలుసుకోవా లనుకొన్నాను.

"నాకు ఇది అంతా తెలియక పోయినా కొంతవరకు తెలుసు. 'మనకి మన నీతి, నిజాయితీలు, మానవత్వం తప్ప మరెవరు బంధువులు లేరు నాన్నా' అనేది అమ్మ నాన్నగారు పోయేక. అందువల్లనే అమ్మపోయేక నీ మేనమామని అంటూ మామయ్యవస్తే నాకు నమ్మబుద్ధి కాలేదు.

"ఆ చిన్నతనంలో కూడా నా మనసులో అమ్మ, నాన్నల పట్ల ఎంతో గౌరవ, భక్తిభావం ఉండేది. బహుశ ఆ కాలనీలో ఇరుగుపొరుగు వాళ్ళు వాళ్ళకిచ్చే ఆధిక్యత వల్లనే అది ఉద్భవించి ఉండవచ్చు. ఈనాడు వయసు వచ్చేక ఆనాటి జీవితాన్ని తలచుకొంటుంటే ఆ భావం పెరిగి పెద్దదయిందే కాని తరుగుముఖం పట్టలేదు.

"నా తండ్రి మాలవాడు కావచ్చు, నా తల్లి మత భ్రష్టురాలు కావచ్చు, వారికి ఈ సంఘంలో స్థానం లేకపోవచ్చు. కాని, నేను ఈనాడు చూస్తున్న చాలమందికంటె వారు ఉన్నతులు, పవిత్రులు. ఈ నమ్మకను నానుండి ఎవ్వరూ పారద్రోలలేరు.

"వారి బిడ్డనైన కారణంగా నేను ఈ సంఘంచేత బహిష్కరింపబడితే దానికి నేను బాధపడను అత్తయ్యా! నన్ను వేరు పరచినవారి అహంభావానికి జాలి పడతాను.



ఈ కారణం వల్లనే నువ్వు నీ కూతుర్ని ఇచ్చి పెళ్ళిచేసి నా పరువు మర్యాదల్ని నిలపాలనుకొంటే ఆ ఔదార్యాన్ని నేను పరిగ్రహించలేను. నువ్వు గోమతిని ఇచ్చి పెళ్ళి చేసి ఏ మచ్చను మాపాలనుకొంటున్నావో దానిని నేను కళంకంగా భావించడంలేదు.

"ఇంక, నా చదువుకోసం మామయ్య శక్తికిమించి డబ్బు ఖర్చు చేసినమాట నిజమే అత్తయ్యా ఆ ఋణాన్ని తీర్చుకోవలసిన విధి కూడా నాకు ఉంది నువ్వు గోమతి పెళ్ళికోసం కంగారు పడకు సద్వంశంలో పుట్టిన చక్కని అబ్బాయిని వరుడిగాచూడు. డబ్బు విషయం నేను చూసుకొంటాను" అన్నాడు గోపాలం నిశ్చలంగా, నెమ్మదిగా ప్రతిమాటని ఒత్తిపలుకుతూ.

"ఏమిటిరా గోపాలం! నువ్వంటున్నది? దేనికిరా నువ్వు డబ్బు పెట్టేది?" ఉద్రేకంగా అరిచింది సావిత్రి.

"గోమతిని నేను పెళ్ళి చేసుకోబోవడంలేదు అత్తయ్యా, పెళ్ళికయే ఖర్చుమాత్రం భరిస్తాను తలవంచుకొని అన్నం కలుపుకొంటూ అన్నాడు గోపాలం.

పగలనున్న అగ్నిపర్వతంలా పొగలు కక్కింది సావిత్రి. కాటు వేయనున్న కోడెతాచులా బుసలు కొట్టింది. పట్టలేని కోపంతో "కృతఘ్నుడా" అంటూ చేతిలోని మజ్జిగ

గిన్నె తలమీద దిమ్మరించింది. "అమ్మా" అంటూ గోమతి తల్లిని వెనక్కిలాగింది. "సావిత్రీ! నీకేం మతిపోయిందా?" అంటూ రామనాథం విస్తరి ముందునుంచి లేచేడు.

సావిత్రి కాళికలా కళ్ళంట నిప్పులు గాలుస్తున్నాది. కోపంతో మనిషి పూనకం వచ్చిన దానిలా ఊగిపోతున్నాది. "కంచిడు అన్నం తిని కంచంలో ఉమ్మిపోతున్న ఈ కృతఘ్నుడా నా కూతురి పెళ్ళికి డబ్బుపెట్టడం? పెళ్ళి ఖర్చు భరిస్తాడుట ... పెళ్ళి ఖర్చు" అంటూ గయ్యాళిలా గొంతుక చించుకొని అరుస్తున్నాది

చిక్కని మజ్జిగ తలమీంచి జారుతుంటే ఎడంచేత్తో దానిని తోసుకుంటూ శిలా ప్రతిమలా కూర్చున్నాడు గోపాలం. గిన్నె అంచు నుదిటిమీద తగిలి, ఒకటి రెండు చోట్ల చర్మం చిట్లింది. ఎర్రని రక్తం తొంగిచూసింది. కళ్ళలో జారిన మజ్జిగ చినుకులు కళ్ళని జ్యోతుల్లా వెలిగిస్తున్నాయి. అయినా అణుమాత్రమైనా కదలకుండా అలాగే పీటమీద కూర్చున్నాడు గోపాలం.

అత్త కళ్ళలోని కోపాన్ని, మామయ్య కళ్ళలోనిబాధని, గోమతిచూపులోని జాలిని, చూపు మాత్రంగా అందుకుని తలదించుకొన్నాడు.

క్షణకాలం గజిబిజిగా గోడమీద ఎవరో ఔత్సాహిక చిత్రకారుడు గీసినబొమ్మల్లా ఏ భావం పదిలంగా నిలవని ముఖాలతో ఆ నలుగురు ఉండిపోయేరు.

వేలకువేలు ప్రాణాలను కాలరాసిన భీకర సమరాంగణంలో ఓడినవారి శ్వేత కేతనం క్రింద నిలచిన శాంతిలా ఆ ఇంటిలో నిశ్శబ్దం తాండవించింది

పది నిమిషాల తరువాత తన గాజుల మోతతో, తన తీయని మాటతో తన కోమల హృదయంతో ఆ శ్మశానశాంతిని భగ్నం చేసింది గోమతి.

"రా... బావా! కాగులోకి నీళ్లు పట్టేను. స్నానం చేద్దువుగాని" అంది దండెంమీద తువ్వాలు చేతిలోకి తీసుకొంటూ.

ఒకసారి ఆమెవంక కన్నెత్తి చూసి, తల్లివెంట చిరుపదాలు చిందులాడగా నడిచి చంటివాడిలా, భగవంతుని పిలుపువిని అత్రంగా అడుగులువేసే అర్జునిలా ఆమెని అనుసరించేడు గోపాలం.

చెంబు, సబ్బు తెచ్చి పక్కన పెట్టింది గోమతి.

"స్నానం చేసి రా బావా! బట్టలు గదిలో మంచంమీద పెట్టేను" అంది.


"గోమతీ!"

ఆ కంఠంలో ఏనాడూ లేనంత అప్యాయత మేళవించింది. తనది అనుకొన్న వస్తువు శాశ్వతంగా తనకి దూరమయిపోతుంటే మనిషిపొందే అశాంతి, ఆరాటం ప్రతిధ్వనించేయి. నాది అనుకొన్న ఈ జీవితంలోంచి నన్నెందుకింత నిర్దాక్షిణ్యంగా విసిరి కొట్టేవు గోమతీ – అన్న ఆరోపణ ప్రస్ఫుటమయింది.

"ఏం బావా!" రెండడుగులు వేసినదల్లా వెనుతిరిగి చూసింది.

[సశేషం]

చిత్ర(వి)చిత్రాలు



స్వామి చిత్రానంద


"ఎక్కడయ్యా! ఇద్దరు ప్రొడక్షన్ మేనేజర్లూ?" అంటూ సెట్ లోకి అడుగు పెడుతూనే నిర్మాత అడిగాడు.

"పెద్దాయన్ని సముద్ర జలానికి పంపానండి" అన్నాడు అసిస్టెంట్ డైరెక్టర్.

"చిన్నాయన?"అని రెట్టించాడు.

"నాకు తెలీదండి."

"నిర్మాత సెట్ లోపల కంటా వెళ్ళి రెండో అసిస్టెంట్ డైరెక్టర్ని అడిగాడు చిన్న మేనేజర్ కోసం—



"సముద్రోదకానికి పంపానండి" అన్నాడు.

"ఏమిటయ్యా! మీ యిష్టమొచ్చినట్టు - సముద్ర జలానికి ఆయనా, సముద్రోదకానికి నువ్వాను—"

"కవిగారు అలా రాశారండి. "లక్ష్మణుడు సముద్రోదకం తెచ్చి రామునకు యిచ్చును. విభీషణుడి శిరస్సుపై రాముడు సముద్ర జలం చల్లును" అని. మనమేం చేస్తామండి. ఆఫ్టరాల్ అసిస్టెంట్స్మి!"

"కవిగారు రాశారా?— అలాగైతే సరేలే."

* * *

నిర్మాణంలోనే అయిదారేళ్ళు పట్టిన ఒక మహత్తర పౌరాణిక, జానపద, సాంఘిక, రాజకీయ చిత్రం ఈ ఏటికి విడుదలకు సిద్ధమైంది. ఈనాడు పాత్రికేయులకందరికీ ప్రత్యేకంగా చూపిస్తున్నారు.



ఊరికి నాలుగు మైళ్ళ అవతలవున్న స్టుడియోలో చూపించటం చేతా, ప్రదర్శనానంతరం విందు భోజనం వుండటంచేతా నాలుగు గంటల సేపూ అంతా హాల్లో వుండక తప్ప లేదు. ఒకరిద్దరు మధ్యలో లేచిపోదామని బయటకు వచ్చినా, వాహన సదుపాయంలేక మళ్ళీ లోపలకువెళ్ళి కళ్ళు మూసుక్కూచున్నారు.

ప్రదర్శన పూర్తయేసరికి దర్శక నిర్మాతవచ్చి గుమ్మానికి అడ్డంగా నిలబడి "చిత్రం బాగుందని పొగడరేం?" అన్నట్టు వస్తున్న వాళ్ళకేసి చూస్తున్నాడు. ఇది గమనించిన కొందరు గడుసువాళ్ళు అవతల గుమ్మంనించి తప్పించుకుని గండం నించి బయటపడ్డారు.

నిర్మాత కంటపడిన ఒక పాత్రికేయుడు కడుపుమంటతో—

"మీరీ చిత్రాన్ని పాతికేళ్ళ క్రితం తీయాల్సింది" అన్నాడు.

"అవునండి నేను దీన్ని లండన్‌లో చదువు మానేసిన తర్వాత రాశాను. ఇండియా రాగానే కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్సు, సాంగ్సూ, డ్యాన్సులూ రాశాను. సినిమా తీస్తానంటే మా నాన్నగారు వద్దన్నారు. తీస్తే వురి పోసుకు చచ్చిపోతానని బెదిరించారుకూడా— అంచేత ఆయన బతికుండగా వూరుకుని, పోవగానే మొదలెట్టి తీశాను - మా బ్రదర్స్ ఒద్దంటున్నా—"

'మీ నాన్నగారు ధన్యులు! ఆయన ప్రాణాన్ని అడ్డుగాపెట్టిఎన్ని ప్రాణాలు రక్షించారు!" అన్నాడు మరో రచయిత

"అయితే మా నాన్నకి దీన్ని అంకితం యివ్వనా?" అన్నాడు నిర్మాత.

"ఇచ్చినా పర్వాలేదు—"

"చచ్చిన వాళ్ళకిస్తేనే మంచిది" అన్నాడు మరో రచయిత.

* * *

ఒక తార నూతన గృహప్రవేశానికి వచ్చిన కొందరి స్వగతాలు -

సహనటి:- "మేవిద్దరం గ్రూపు డ్యాన్సు చేసినపుడు ఈస్థలం కొంది."

నూతన నటుడు: "అదృష్టం కల్సిరావాలేగాని - ఎంత సేపు కట్టాలి?"



నిర్మాత: "మన హీరో యిల్లు కింద షూట్ చేద్దామా?"

దర్శకుడు: "కాని ఇది మరీ 'రిచ్' అయిపోతుంది."

కెమెరామన్: "కలర్ మరీ లైటయి పోతుంది."

ఆర్ట్ డైరెక్టర్: "గుమ్మాలు మరీ వెడల్పు పెట్టింది —"

రచయిత: "హీరోయిన్ ముందాలోచనతోనే పెట్టించింది లెండి."

* * *

సైడ్ హీరోయిన్ సెట్లోకి రాగానే ఎదురుగా ఓ కుర్చీలో కూచున్న నిర్మాతగారి వేలు విడిచిన మేనల్లుడి కొడుకుతో —

"నువ్వు లెగయ్యా" అంది.

అది విన్న సెట్లో జనం అంతా గొల్లుమని నవ్వారు.



ఈ నవ్వుకి కారణం అర్థంకాలేదు ఆమెకు. ఎవర్నడిగినా చెప్పలేదు.


ఇంతలో సెట్లోకి వచ్చిన మరో సైడ్ హీరోయిన్ తో కథంతా చెప్పింది. ఆమె తనలో తాను గర్వంగా నవ్వుకుని —

"లెగు ఏంటి — లెయ్యి అనాలి గాని —" అంది.

ఇది విన్న జనం — సెట్లోవున్న తిరపతి యాత్రికులతో సహా — అంతా విరగబడి నవ్వారు.

* * *

ఒక హాలీవుడ్ తారకి తన ప్రియుడి మీద మోజు తగ్గిపోయింది లాభదాయకమైన మరొకడు దొరగ్గానే



యితన్ని విడుదలచేసి పంపేసింది. ఆ ప్రియుడు చేసేది లేక బయటకు వస్తూ వస్తూ గేటుకువున్న "బివేర్ ఆఫ్ డాగ్స్" అన్నబోర్డులో "డాగ్స్" అనే మాట కొట్టేసి "బిచెస్" అని రాసి కారెక్కి కూచుంటూ వుండగా తార తాలూకు ఒక కుక్కపిల్ల కనుపించగా "ఛీ! ఛీ" అని అసహ్యించుకుని తరిమెయ్య బోయాడు.

"ఎందుకు బాబూ! దీన్ని ఛీ అంటారు? మీ బిస్కట్లు తిన్న దీనికున్నపాటి విశ్వాసం, మీ బిస్కట్ ఫ్యాక్టరీ రాయించుకున్న దానికి లేక పోయింది. రానీండి. కుక్క పిల్లని మనింటికే తీసుకెళ్దాం" అన్నాడు డ్రయివర్.

* * *

ఆమధ్య భారత గాథలతోవచ్చిన కొన్ని తెలుగు సినిమాల్ని చూసిన వ్యాస మహర్షికి భారతం తాను వ్రాసినదేనా అని సందేహం కలిగి, వినాయకుణ్ణి పిలిచి —

"నాయనా! ఏమిటీ భారత కథలు? నేను చెప్పడం లోపమా? నీవు ఉల్లేఖించడం లోపమా?" అని అడిగాడు.

వినాయకుడు ఈ అనుమానానికీ అవమానానికీ లోపల కొంచెం కించపడినా, తేరుకుని —

"మహర్షీ! ఈ ప్రశ్న తవరు నన్నడుగుతారని నాకు తెల్సు. అందుకే, ఇంతకుముందు నేను ఒకరిద్దరు నిర్మాతల్ని అడిగాను, మహాభార



తాన్ని వ్యాసమహర్షి చెప్పగా నేను రాశాను. మీ సినిమాల సంగతి ఆయనకి తెలిస్తే ఏమిటిలా రాశావని నన్ను దండిస్తారు, ఏమిటీ ఈ మహాభారత కథలు?' అని అడిగాను — వారు నాకిచ్చిన సమాధానం —

'ఇవి మహాభారత కథలు కావు — మా భ్రాంత కథలు అని.'"

♦ ♦ ♦

ఆ మధ్య ఘనంగా జరిగిన ఒక చిత్రం తాలూకు శతదినోత్సవం గురించే వూరంతా గొప్పగా చెప్పుకుంటున్నారు, ఆ చిత్రానికి పనిచేసిన




సహాయ దర్శకుడికి తారసిల్లిన మరో సహాయ దర్శకుడు —

"ఏమిటి మీ చిత్రానికి శతదినోత్సవం చేశార్టగా — మీకేమిచ్చారు?"

"ఇవ్వకేం? — చాలా యిచ్చారు. నన్ను విజయవాడ రానిచ్చారు, సభలో కూచోనిచ్చారు, నిర్మాతకు బహుమతులు అందివ్వనిచ్చారు" అని గర్వంగా చెప్పుకున్నాడు.

□□□



రోమన్ హాలిడే

గొల్లపూడి మారుతీరావు

అదృష్టమంటే అంత నమ్మకంలేదు నమశ్శివాయకి. కుతుబ్ మీనార్ ఆఖరి అంతస్తులో అందమయిన అమ్మాయి కనిపించి తన బుజంమీద చెయ్యివేస్తుందనీ, తాజ్ మహల్ మలుపులో – ఆ చలువరాతి కట్టడం ముందు చల్లటి కళ్ళు తనని పలకరిస్తాయనీ, ఢిల్లీ నడిబొడ్డులోని బ్రహ్మాండమయిన హోటలు మారుమూలగదిలో ముఖమల్ పరుపు మీద తనని కూర్చోపెట్టి గాజులు గలగలలాడే చేతులు తన చేత ఐస్‌క్రీం తినిపిస్తాయనీ – అతనెప్పుడూ ఊహించలేదు. గుంటూరు దగ్గర కడవకుదురు కరణీకపు వారసత్వం, అమలాపురం లాకుల పక్క కొబ్బరిచెట్ల నీడల్లో కొబ్బరినీళ్ళూ, బెజవాడ హోటల్లో వెచ్చటి పెసరట్లూ – ఇవే అతనికి జీవితంలో తీరని కోరికలు.)

అంచుచేత హఠాత్తుగా ఓడలాంటి కారులోంచి, మీగడలాంటి, వెన్నెల నీడలాంటి అందమయిన అమ్మాయి తొంగిచూసి చిరునవ్వు నవ్వినప్పుడు ఆ చిరునవ్వు తనకి ఉద్దేశింపబడిందేనని భావించలేక పోయాడు మరెవరా ఆ అదృష్టవంతు డనుకొంటూ పక్కలకి చూశాడు. తలెత్తకుండా వ్యాపారం సాగిస్తూన్న గోల్‌గప్పావాలా, సైకిలుకి పంచరు వేయించుకొంటున్న పంజాబీ – డబ్బులుండీ ఆకలిలేక తింటున్న ఓ గొప్పింటి అబ్బాయిని చూస్తున్న ఆకలి ఉండీ డబ్బుల్లేని బీదింటిపిల్లా కనిపించారు.

వీళ్ళెవ్వరూ – అంత అందమయిన చిరునవ్వుకి అర్హులుకారని అతనికి తట్టాక అది తనకేనేమో నన్న పిచ్చి ఆశ కలిగింది నమశ్శివాయకి. నమశ్శివాయకి అదృష్టమంటే నమ్మకం లేదు. కాని ఆశ అంటేనూ, దాని గురించిన ఆలోచన అంటేనూ నమ్మకం ఉంది. అందుకు అయిదుసార్లు ఫిఫ్త్‌ఫారం పరీక్షపోయినా, పన్నెండుసార్లు ఉద్యోగం అప్లికేషన్లు వమ్మయినా పోరాటం సాగిస్తుండడమే సాక్ష్యం. అయితే ఫిఫ్త్‌ఫారం పరీక్షను సాధించాడు కాని, ఉద్యోగాన్నే యింకా సాధించలేక పోతున్నాడు నమశ్శివాయ. సాధిస్తే ఉద్యోగాన్వేషణకి యిలా ఢిల్లీ రాగలిగేవాడు కాదు. ఇంత అందమయిన [illegible]ని సంపాదించుకోగలిగేవాడూ కాదు. అది వేరే విషయం.

తను ఈ ఆలోచనల్లో సతమతమవుతూండగా ఈసారి పిలుపు వినిపించింది. "హే! యూ" — ఆమె ఇంగ్లీషులో పిలుస్తోందని సరిపెట్టుకొన్నాడు నమశ్శివాయ.

నమశ్శివాయ కురూపి ఏమీ కాడు. ఆమాటకివస్తే అందగాడు కూడాను. పంజాబీ అమ్మాయిలతో పోటీపడే నల్లటి బారుమీసాలూ, అంతటి భుజస్కంధాలూ, వడబోసిన కాఫీలాంటి చామనచాయ శరీరం – నిలువెత్తు నిటారు విగ్రహం అతనిది. ఉద్యోగం అప్లికేషన్లకి ఖర్చుపెట్టగా మిగిలిన డబ్బుతో బట్టల్ని చలవ చేయించుకొని, చలవజోడు పెట్టుకొని చల్లగా కనిపించడం అతని హాబీ.

అందమయిన అమ్మాయి చిరునవ్వు లాగే, అర్హతగల ఉద్యోగం కూడా ఈ జీవితంలో అపురూపమయినదని నమ్మి ఉన్నంతలో పైలా పచ్చీసుగా గడిపెయ్యాలని ఒక సిద్ధాంతాన్ని సిద్ధం చేసుకొన్నవాడు నమశ్శివాయ. వాళ్ళ నాన్న పోవడం వాళ్ళ చిన్నాన్నకు లాభిస్తే, చిన్నాన్న తనమీద శ్రద్ధతీసుకోక

పోడం, అడిగినప్పుడు పాతికో పరకో పడెయ్యడం నమశ్శివాయకు లాభించింది. అందుకని ఈ నిరుద్యోగమే ఉద్యోగంగా బ్రతుకుతున్న అదృష్టవంతుడు నమశ్శివాయ. ఇప్పుడిలా ఉద్యోగం వెదికే మిషతో ఢిల్లీ వచ్చి ఓదూరపు బంధువింట్లో మకాంవేశాడు. కాని తెచ్చినడబ్బు మొదటి పదిరోజుల్లోనే అయిపోయేసరికి, చిన్నాన్నకి ఉత్తరం రాసి — అది వచ్చేవరకూ విహారయాత్ర సాగించాడు. ఈసంధి కాలంలో ఒక సాయంకాలం అనుకోకుండా ఈ విధంగా అదృష్టం తలుపు తట్టింది

నమశ్శివాయకి ఇంగ్లీషు రాదు. అయితే కాస్తకాస్త సినిమా హిందీ వచ్చును ఆమెకి రాకపోతుందా అనే ఆశతో ధైర్యంచేసి రోడ్డుకి అడ్డంగా నడిచి కారు ముందుకివచ్చి నిలబడ్డాడు ఆమెను అంతదగ్గరగా చూస్తూనే క్లోరోఫారమ్ యిచ్చిన వాడిలాగ చచ్చువడిపోయాడు.

పాలమీగడలాగ రుచిగా, శుచిగా కనిపించింది ఆమెశరీరం. స్వచ్ఛంగా పారే సెలయేటి కింద కనిపించే గవ్వల్లాగ అందంగా నిండుగా మెరుస్తున్నాయి పళ్ళు. ఇహ ఆ కళ్ళు చిన్నప్పట్నుంచీ తనకు తెలిసినట్టూ స్నేహాన్ని, చనువునీ గుర్తు చేస్తున్నాయి. ఆమె బుజాలు మగ్గిన దోసపళ్ళలాగ మిసమిస లాడుతున్నాయి. బ్లౌజు బ్రేసరీకన్న కాస్త పెద్దదిగా, జాకెట్టుకన్న కాస్త చిన్నదిగా వుంది. 20వ శతాబ్దపు సంస్కారం ఆమె చేతులమీదనుంచి బుజాలవరకూ వచ్చి ఆగిపోయింది. ఆకుపచ్చటి సెల్వార్ కమీజు వేసుకొంది. ఉదయపు ఆకాశం మీద విచ్చిన పల్చటి మేఘంలాంటి నీలిరంగు చున్నీ—గిడసబారిన గడ్డిపువ్వులాగ వుంది. ఆమె, ఆమెవాళ్ళో తీరికలేని ఉద్యోగం చేస్తున్నట్టు వికవిక లాడిపోతున్న చిన్న బొచ్చు కుక్క. ఒక్కక్షణం ఆ కుక్కగా ఆమె వాళ్ళో బ్రతికే అదృష్టానికి, తన జీవితాన్నంతా పణంగా పెట్టవచ్చుననుకొన్నాడు నమశ్శివాయ — ఆలోచనకు అవకాశం దొరికిన అరక్షణంలో. తరువాత ఆమె చిరునవ్వు మళ్ళీ అతడిని ఉక్కిరిబిక్కిరి చేసింది.

దగ్గరికి వచ్చాక డ్రైవరుపక్కనే మరొక వ్యక్తికూడా కనిపించింది నమశ్శివాయకి. ఆశ్చర్యంగా తనవేపే పరికిస్తోంది. సిగ్గుపడకుండా, అశ్రద్ధ చెయ్యకుండా చేతికందిన దాన్ని అనుభవించే తీరిక ఆ కళ్ళలో కనిపించింది. వాటిని చూసి భయపడి కళ్ళు తప్పించుకొని మళ్ళీ వెనకసీట్లో వ్యక్తివేపు తిరిగాడు.

అతణ్ణి దగ్గరికి రానిచ్చి ఆమె కారులోనే జరిగి తలుపుతెరచి, అతనికి చోటు చేసింది. నమశ్శివాయకి వాళ్ళు మాట్లాడే భాష తెలీదు కాని వాళ్ళ కళ్ళు మాట్లాడేభాష తెలుసు. కారులోపలికి జరిగి కూచున్నాడు. ఆ కారులో కుషన్ అతన్ని కిందకి లాగేస్తోంది. డ్రైవరుకి ఏదో చెప్పింది ఆమె. ఒక్కసారి

కొండచిలువలాగ మెల్లిగా కదిలింది కారు. అతని భయంచూసి ఆమెకి జాలి కలిగినట్టుంది. మెల్లిగా బుజంమీద చెయ్యివేసి వెనక్కితోసింది. ఆమె చెయ్యి తగిలినచోట ఏదో ఖరీదయిన లవండరువాసన చుట్టేస్తోంది.

సినిమాల్లో హీరో, హీరోయిన్‌లు హఠాత్తుగా కలలో పాటపాడుకోవడానికి వెలిపోతున్న వాతావరణం తోచింది నమశ్శివాయకి. కాని అది కల అనడానికి వీలు లేదు. అందుకు సాక్ష్యం — ఆమె మెత్తటి బుజం తనకి తగులుతోంది. కారు బయట ఇండియాగేటు, దూరాన రాష్ట్రపతి భవన్ నల్లటి శిఖరం, పటేల్ రోడ్డూ — అన్నీ తెలుస్తున్నాయి.

నమశ్శివాయకు లభించిన ఇంత అద్భుతమయిన అవకాశానికి ఈర్ష్య పడుతున్నట్టు సాయంకాలం ముఖం నల్లబుచ్చుకుంది.

సీటువెనక ఆమె చెయ్యి పాకుతోందని తోచింది నమశ్శివాయకి —

"నాపేరు మీనూ" అంది ఆమె. కంఠం మెత్తగా, రెండు తలగడల కిందనుంచి బయటికి వస్తున్న ఊపిరిలాగ వుంది. ఊపిరికికూడా సెంటు పూసినట్టుంది. ఆమెవేపు తిరిగితే మంచిగంధం ఊపిరి తగులుతోంది. ఆమెవాళ్ళో బొచ్చుకుక్క ఆశ్చర్యపోయిన నమశ్శివాయనుచూస్తోంది. తనపేరూ కూడబలుక్కొని వచ్చీరాని హిందీలో చెప్పాడు.

నమశ్శివాయ మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. ఆమె ఏదో చెప్పరాని కష్టాల్లో పడ్డ దేవకన్య అనీ, వాటినుంచి విముక్తిని ప్రసాదించే గంధర్వుడికోసం వెదుకుతూ తనకారు తీసుకొని కానాట్ సర్కసుకి వచ్చి ఉంటుందనీ తననే ఆ గంధర్వుడిగా

కాంతమ్మ గారబ్బాయి పావలా మింగేశాడు. అయ్యో అయ్యో పిల్లాడేమయి పోతాడో పావలా అరిగిపోతుందో ఏమిటో అని కాంతమ్మ గుండెలు బాదుకుంటూ ఊరికే అరవసాగింది.

అరుపులు విని రోడ్డుమీద వెళ్ళిపోయే ఒక పెద్ద మనిషి లోపలికొచ్చేడు. జరిగిందంతావిని కుర్రాడి వీపుమీద రెండు గుద్దులూ, కడుపుమీద రెండు పోట్లూ తగల్నిచ్చి, గొంతుమీద కిత కితలు పెట్టి, ఎలాగో పావలా కక్కించేడు.

"డాక్టరుగారూ. మీ మేలు మరచిపోను" అన్నది కాంతమ్మ.

"నేను డాక్టర్ని కాదు; ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్ని!"

శ్రమించి దీంట్లో ఎక్కించుకొన్నదనీ, ఏ క్షణాన్నయినా తను గంధర్వుడుకాడనీ, అమలాపురంతాలూకా నమశ్శివాయ అనీ గ్రహించిన పక్షంలో తలుపుతెరిచి బయటికి తోసేస్తుందని అనుకొన్నాడు. ఆ సంఘటనకి సిద్ధపడుతున్నాడు కూడాను.

కారు మనుషులమధ్యనుంచి పాకిపోతోంది — పుట్టమరిచిపోయిన బద్ధకపు పాములాగ. డ్రైవరు తన కారులో జరిగే అపూర్వ మానసిక సంఘర్షణతో ప్రమేయం లేనట్టు నడుపుకు పోతున్నాడు — స్థితప్రజ్ఞుడిలాగ.

ఇరవయ్యో శతాబ్దపు నాజూకుతనంలో దూకుడే గాని, శక్తి లేదేమో మరి. ఆమె నీరసంగా వెనక్కి వాలినట్టు కనిపించింది. ధైర్యంచేసి పక్కకి తిరిగి ఆమెను చూశాడు. అతను చూడడాన్ని ఎదురుగ్గా అద్దంలో గమనిస్తున్నట్టుంది — ఉద్యోగిని క్షమించిన అధికారిలాగ కళ్ళ చివరనుంచి నవ్వింది. నమశ్శివాయ సిగ్గుపడిపోయాడు.

ఆమె పెదాలు సగం కొరికిన జామిపళ్ళల్లాగ ఎర్రగా వున్నాయి. బుజాలమీదనుంచి జారిన వల్లెవాటు రెండు శిఖరాల్ని తప్పించుకొని మధ్యనుంచీ పారుతున్న సెలయేటిలాగ వక్షోజాలమధ్య ఒదిగిపోయింది. గుండె ఎగిరిపడుతూండడం చూసి ఆమెకూడా తనలాగే వణుకుతోందేమో అనుకొన్నాడు.

డ్రైవరు పక్కన కూర్చున్న అమ్మాయికి ఈ దృష్టిలేదు. సఫ్దర్‌జంగ్ ఎయిర్‌పోర్టులో ఎగిరే విమానాల్ని చూస్తోంది. తెగిపోయిన కోర్కెల్లాగ మీదనుంచి రెండు పక్కలనుంచీ రెండు విమానాలు రన్‌వేమీద పడ్డాయి. కారు నమ్మకమయిన జీవితంలాగ సూటిగా పోతోంది రానురాను రోడ్డుమీద మనుషులు తగ్గిపోయారు.

ఆమెని తదేకంగా చూడడం అలవాటు చేసుకున్నాడు నమశ్శివాయ. కాలరు సవరించుకోవడానికి చెయ్యి వెనక్కి పోనిస్తే అక్కడ మరోచెయ్యి తగిలింది. ఆ చేతివేళ్లు తన చేతిని పలకరిస్తున్నాయి. 'ఇంకా ఆశ్చర్యమేం?' అన్నట్టు చేతిని గుప్పెట్లో పెట్టాయి. మీనా ఇటు తిరిగి నవ్వేసింది.

'ఇప్పటి కర్థమయిందా!' అన్నట్టుంది ఆ నవ్వు.

'ఇప్పటికయినా అర్థమయింది కదా!' అన్నట్టు భయం భయంగా నవ్వాడు నమశ్శివాయ.

కారు ఎయిర్‌పోర్టు క్వార్టర్సు దాటి నడుస్తోంది. దాటాక పెద్ద బంగళాలు—ముందు పూలమొక్కలు—రోడ్డు పక్కన పువ్వుల గుబుర్లే కనిపిస్తున్నాయి. లోపల—వాటిమధ్య ఎక్కడో గోడలు, రాతికట్టడం స్ఫురిస్తోంది. మనుషులు తక్కువ. చీకటి పడిందేమో—లైట్లు వెలుగుతున్నాయి ఒక్కటొక్కటే. ఒకరి జీవితంలో అందమయిన జ్ఞాపకాల్లాగ మెరుస్తున్నాయి దీపాలు.

"చలేస్తోందా?" అంది మీనా.

హఠాత్తుగా చలినిమించి వణకడం ప్రారంభించింది.

ముందున్న అమ్మాయి రెండు శాలువల్ని వెనక్కి విసిరింది – ఇటు తిరక్కుండానే. ఎర్రటి శాలువ యిద్దరికీ కప్పినట్టు పడింది. కిలకిలమని నవ్వింది మీనా. నమశ్శివాయ తప్పించుకోవడానికి చేసే ప్రయత్నంలో ఆమె చెంపలు నుదుటికి రాసుకొన్నాయి. ఆమె మెత్తదనంలో మూర్ఛ వస్తుందనిపించింది నమశ్శివాయకి. శాలువ కిందనుంచే అతని కోసం ఆమె చెయ్యి వెదుకుతున్నట్టుంది–తన జుత్తు ఆమె చేతికి అందింది. వేలిచుట్టూ ఉంగరంలా మెలితిప్పి దగ్గరకు లాగింది. ఆమె నుదురు తన ముక్కుకి కొట్టుకుంది. స్వేచ్ఛగా వేలాడుతున్న ఆమెజుత్తు అతని ముఖానికి పెనవేసుకుంది.

అంతే. ఆలోచించే వ్యవధిలేదు. అంతలో శాలువ లాక్కుంది మీనా. తలెత్తితే కారు పెద్ద బంగళాముందు ఆగివుంది. కారు లోంచి తలెత్తిచూసేందుకువీలుచాలు లేదు నమశ్శివాయకి–చాలా పెద్ద బంగళా. ఎవరో ఆఫీసరుది లాగుంది. కారు ఆగీ ఆగడంతోనే కుక్క బయటికి గెంతేసింది. గుర్ఖా దానివెనక పరుగులు తీస్తున్నాడు. డ్రైవరు ఏదో పనివున్నట్లు చెట్ల గుబుర్ల వెనక్కి వెళ్ళిపోయాడు ఇద్దర్నీ సీటుమీద గడ్డం ఆనించి వింతగా చూస్తోంది ముందుసీట్లో అమ్మాయి—

తత్తరపాటుని కప్పిపుచ్చుకోవడానికి "నీ పేరేమిటి?" అన్నాడు నమశ్శివాయ. ఇతనికి సమాధానం చెప్పాలావద్దాఅని క్షణం ఆలోచించినట్టుంది – "నీలూ" అంది చివరికి. ఇప్పుడామెను జాగ్రత్తగా గమనించాడు నమశ్శివాయ మీనా కంటె వయస్సులో కాస్త చిన్నదిగా కనిపిస్తోంది. కాని ఆమె కంటె చాలా బలమయినది పోతపోసినట్టున్న రూపురేఖలు రెండు జడలు వేసుకుంది. యౌవనానికి తొలిమెట్టులో ఉన్నట్టు కళ్ళూ, చెక్కిళ్లూ సాక్ష్యం చెప్తున్నాయి. తన రహస్యమేదో తెలిసిన దానిలాగ తనని చూసి చిరునవ్వు దాచుకుందుకి ప్రయత్నిస్తోంది.

ఎప్పుడు దిగిందో మీనా, కారు తలుపుతీసి "రా"అంటోంది. దిగాడు. పక్క స్తంభానికి చుట్టుకున్న బోగైన్ విలామధ్య యిత్తడి అక్షరాలమీద ఎవరిపేరో కనిపిస్తోంది. పైలట్ ఆఫీసర్—అని యింకా ఏదో చదివే లోపల స్తంభందాటి లోపలికి వచ్చేశారు.

ముందు హాలునిండా సోఫాలూ, కుర్చీలూ, స్టాండు లైట్లూ కనిపించాయి.

హాంకాంగ్, కయిరో, స్వీడన్ పేర్లున్న యాష్ట్రేలూ–అదేదో వింత ప్రపంచంలాగ కనిపించింది. దీపాలు కనిపించకుండా పచ్చటి వెన్నెల లాగ పసుపుపచ్చ వెలుగు గదిలో వ్యాపించింది. హాలుమధ్య నిలబడ్డ

ఆమె పచ్చటి రూపాన్ని చూస్తుంటే అతనికి కళ్లు తిరిగాయి.

ఇంతవరకూ ఒక అనుమానం పోలేదు నమశ్శివాయకి. తనని తనను కొనె తీసుకువస్తున్నారా అని. "నన్ను మీరు ఢిల్లీ పాదుషా వంశంలో ఆఖరు సుల్తాను పనవన్ను అనుకున్నారేమో–నేను కోనసీమకి చెందిన నిరుద్యోగి నమశ్శివాయని" అని ఎలుగెత్తి అరుద్దామనుకున్నాడు.

కాని అక్కడ చుట్టుకొన్న అందమయిన నిశ్శబ్దాన్ని భంగం చెయ్యాలనిపించలేదు. అంతటి అందమయిన కళ్ళలో ఆశ్చర్యాన్ని చొప్పించాలనిపించలేదు. ఆ కలని అంతత్వరగా విప్పేయాలనిపించలేదు. నమశ్శివాయకి ఉద్యోగం లేకపోవచ్చు. కాని అందంవుంది. ప్రస్తుతం డబ్బు లేకపోవచ్చు. కాని ధైర్యం వుంది. ధైర్యవంతులకే యిలాంటి అవకాశాలు వస్తాయని–యిలా దేవకలు కరిస్తారని తెలుగు సినిమాల్లో ఎన్. టి. రామారావుని చూసి తెలుసుకున్నాడు. కాని ఆశ్చర్యమేమిటంటే ఈమె తెలుగు హీరోయిన్లందరికంటె అందంగావుంది.

"ఏం అలాగ నిలబడిపోయావు?" అని ఆమె భుజంమీద చెయ్యి వేస్తే—

"ముఝె ప్యాస్ లగీ" అన్నాడు.

ఆమె ఫక్కున నవ్వింది–"అందుకేనా నిన్ను ఇక్కడికి తీసుకు వచ్చాను" అన్నట్టు. నవ్వుని భాషలోకి అనువాదం చేసుకోవడం తెలీని నమశ్శివాయ ఆమెనుచూసి తెల్లబోయి చూశాడు. ఆమె అతని బుజంచుట్టూ చెయ్యివేసి–పథ్యంతీసుకుంటున్న టైఫాయిడ్ రోగిని నడిపించినట్టు లోపలికి నడిపించింది. తన్మయతలో మూర్ఛపోయిన నమశ్శివాయ ఆమె చెప్పినట్టు నడిచాడు.

కొన్ని క్షణాల తర్వాత తనో అపూర్వ తల్పంమీద ఉన్నట్టు గుర్తుపట్టాడు. చుట్టూ పల్చటి తెరవుంది. గదంతా వెదికేలోపల మీనా ప్రత్యక్షమయింది రెండు గ్లాసులతో–గ్లాసు అందించింది. వగరుగా ఉంది ఆ పానీయం.

"నీకే రంగంటే యిష్టం" అంది మీనా అతని పక్కనే కూచుంటూ. ఏమీతోచక గ్లాసువేపు చూశాడు. పల్చటి వెలుగులో గులాబిరంగు పానీయం కదిలింది.

"గులాబీ రంగు" అన్నాడు వెంటనే.

గ్లాసు తీసుకు లేచింది. ఏం చేసిందో ఏమో, చూస్తుండగానే దీపాలు గులాబీరంగుగా మారిపోయాయి–మంచంమీదవున్న దుప్పటి తీసేసి గులాబిరంగు దుప్పటి తెచ్చి పరిచింది మరో పావుగంటలో గుప్పెడు గులాబి పువ్వులు తెచ్చి మంచంమీద చల్లింది పూజచేసినట్టు. తెల్లబోయి చూస్తున్న అతణ్ని ఒక్క క్షణం ఆగమనిచెప్పి లోపలికి వెళ్ళింది. క్షణంలో గులాబిరంగు నైట్ గౌనులో వచ్చింది. "రంగే కాదు. వాసనకూడా అదే–చూడు"

అని చేతిలోవున్న సీసా అతనిమీద, మంచంమీదా తనమీదా కుమ్మరించుకొంది. మరోక్షణంలో రోజ్ లవండరు బరువైన వాసనలు తియ్యటి అనుభవాల్లాగ వాళ్ళిద్దర్నీ పెనవేసుకున్నాయి.

అతి సమీపంలోఉన్న ఆమెను చూస్తుంటే నమశ్శివాయకి చెమటపట్టింది. అలవోకగా తలగడని అడ్డంగాతిప్పి దానిమీద వాలిపోయింది. ఆ కొద్ది వ్యవధిలోనే షాంపూ స్నానం చేసినట్టుంది. జుత్తు తడిగా ఒదులుగా బుజాన్ని తగిలింది. నేలమీద పడిపోయిన బంగారు విగ్రహాన్ని తీసుకోవడం తెలీక సిగ్గుతో చూస్తున్న పసివాడిలాగ కనిపించాడు నమశ్శివాయ.

'ఏం చూస్తావు ?—ఈ గౌను తీసేదా?' అంటోంది.


వద్దు అన్నాడో లేక కావాలన్నాడో తెలీదుగాని—గౌను వదులవడం గమనించాడు. ఎర్రటి బుజాలు గుర్తు తెలుస్తున్నాయి. లోపల బట్టలేమీ లేవని క్షణంలో అతనికి అర్థమయింది. అతని బుజాన్ని కౌగలించుకొంది. బుజాన్ని వదలకుండానే అతని షర్టు గుండీలు విప్పుతోంది. అతనింకా స్తబ్ధుగావుండటం చూసి కృత్రిమ కోపంతో "సహాయం చెయ్యి, వీరుడివి" అంది. షర్టు వదులయింది—వెచ్చటి ఆమె శరీరం వీపుని కాలుస్తోంది. బరువయిన వక్షోజాలు శరీరాన్ని కోస్తున్నాయి. బుజంమీద నిలచిన పెదవులు, మెల్లగా మెడమీంచిపాకి చెక్కిళ్ళనీ, జుత్తునీ, నుదిటినీ, ముక్కునీ ఎదుర్కొని ఆఖరికి పెదిమల దగ్గరికి చేరాయి ఆమె నడుం ఆధారంగా ఒకసారి ఉంగరంలాగ తిరిగి అతని వొళ్ళో వాలింది. ఆ సౌందర్యం పలకరింతకి మనస్సు వశంతప్పింది నమశ్శివాయకి

ఆ సంతోషానికి తానూ చాలా కాలంనుంచి ఎదురు చూస్తున్నట్టు ఆ బుజాలు, ఆ పెదవులు తనని ఎంతకాలంనుంచో తెలిసినట్టూ నిలకడగా, స్తిమితంగా ఆమెను చేతుల్లోకి లాక్కుని కౌగలించుకున్నాడు. ఆ కౌగలింతకు మనస్ఫూర్తిగా లొంగిపోయినట్టూ అతని చుట్టూ చేతులు పెనవేసింది మీనూ-అతని జుత్తు చెరిపేసింది.

"సిగ్గా" అంది చిలిపిగా వీపు కొరుకుతూ.

రెండు తలగడల మధ్య సెలయేరులాగ జారిపోయిఅతన్ని మీదకి లాక్కొంది. గౌనుని బలవంతంగా పక్కలకి తోసేసింది. అది చిరుగుతోందనే ధ్యాసలేకుండా. అతనికి ఏమీ తోచలేదు తోచే వ్యవధి లేకుండాఅతనిముఖం ఆమెగుండెల్లో ఒదిగి పోయింది.

"లైటుంటే నీకిష్టమా?ఆర్పేదా?" అని చెవిలో రహస్యం చెప్పినట్టు అడిగింది. కాని సమాధానం మాటదేవుడెరుగు - ఆ వాక్యం పూర్తి కాకుండానే ఆ మాటల్ని ఆమె పెదాల దగ్గరే కొరికేశాడు నమ



శ్శివాయ. ఆ తర్వాత ఆమె పెదాలకి మాట్లాడే తీరికే లేదు!—

* * *

నాలుగో ఝామున నిద్దర తెరలలోంచి రోజా వాసనల గుబాళింపు మధ్యనుంచి – మెల్లగా కళ్ళువిప్పకుండానే చెయ్యి మీనూ చుట్టూ వెయ్యబోతే తలగడలే తగిలాయి కాని - మెత్తని శరీరం తగలలేదు నమశ్శివాయకి. కళ్లువిప్పాడు. ఇంకా అదే ప్రపంచం. కాని మీనూ లేదు. బద్ధకంగా వొళ్ళు విరుచుకొని లేచి కూచున్నాడు. కాళ్ళకి ఏదో తగిలింది. చూశాడు. చిరిగి పోయిన నైట్ గౌన్. ఆమె బ్రేసరీ తెర కొమ్మకితగిలి వేలాడుతోంది. మంచం మీద నాలుగు తలగడలూ కుప్పవోసిన బస్తాల్లాగ అస్తవ్యస్తంగా వున్నాయి. వెచ్చటి గులాబిరంగు దుప్పటి వదిలిపోలేని జ్ఞాపకంలాగ నడుముని కరుచుకొంది. వాచీ చూస్తే నాలుగయింది. లేచి బాత్‌రూం తలుపు తెరిచి నీళ్ళు ముఖంమీద జల్లుకొన్నాడు. అద్దం ముందున్న మెత్తని పౌడరు ముఖానికి రాసుకున్నాడు. గది గుమ్మం దాటుతోంటే ఎవరివో మాటలు అస్పష్టంగా తెలిశాయి.

"ఉదయం ప్లేన్ ... సాబ్ ... కారు రెడీ ... ... జరూర్ —' మగగొంతు నౌకరుదిలాగ వుంది. లేక డ్రైవరుదో; బోధపడడం లేదు. మత్తుగా ఉన్న ఆడగొంతు, "అలాగే కానీ" అంటున్నట్టుంది. అది

మీనూదా ?— ఏమో!—యింకా చెవులు గుర్తు పట్టలేక పోతున్నాయి. తియ్యటి అనుభవం నుంచి తేరుకోడానికి జ్ఞానేంద్రియాలు తిరస్కరిస్తున్నాయి. మత్తుగా తలుపు తెరిచి బయటికి అడుగు పెట్టాడు. అంతే ఆ క్షణం కోసమే ఎదురు చూస్తున్నట్టు ఓ బలమయిన చెయ్యి అతని బుజంమీద పడింది. వెనక్కి చూసి ఆలోచించే లోగా — మాట్లాడే లోగా చెయ్యి తనని తీసుకుపోతోంది. ఆ చేతిలో అధికారం లేదు, క్రౌర్యం లేదు — కాని కర్తవ్యం, కార్యదీక్ష వున్నాయి. మరో క్షణంలో కారులో ఉన్నాడు నమశ్శివాయ. డ్రైవరు కారు స్టార్టు చేశాడు. నిద్దరలేచిన కొండచిలవ నిర్దయగా కదిలింది. ఇంకా మత్తుగానే వుంది నమశ్శివాయకి. కారు సీటులోనే వెనక్కి ఒరిగాడు—

తెలివొచ్చేసరికి కనాట్ సర్కస్‌లో తన పాత జీవితం దగ్గర కారాగింది. తలుపుతెరిచి— 'ఉతో' అన్నాడు డ్రైవరు. ఆ కంఠంలో శ్రద్ధ లేదు, సినిమా అయిపోయాకకూడా యింకా సీట్లోకునికిపాట్లుపడుతున్న ప్రేక్షకుడికి గేటువాడి బెదిరింపులాగవుంది ఆ కంఠం. దిగి ఏదో అనబోయాడు. దిగడానికే ఎదురు చూస్తున్నట్టు తలుపుబాది —కారుని కదిలించాడు ఆ డ్రైవరు. అనూహ్యమయిన జ్ఞాపకంలాగమరోక్షణంలో కారు దృష్టి నుంచి చెరిగి పోయింది.

బట్టల్ని రోజ్ లవండరు వాసన మాత్రం పట్టుకు వేలాడుతోంది.

గోల్ గొప్పావాలా వ్యాపారం చేసిన బండీ కింద తలుపులు తెరచి దానిలోపల కళ్లుమూసుకుపడుకొన్నాడు. కార్లు ఒక్కటొక్కటీ కదులుతున్నాయి. ఢిల్లీ మహానగరం అప్పుడేబద్ధకంగా నిద్రలేస్తోంది. గులాబీరంగు దుప్పట్లో చలి మరిచిపోయిన శరీరం హఠాత్తుగా చలికి అలవాటు పడలేక ఎదురు తిరుగుతోంది. అకలివేసిందినమశ్శివాయకి. జేబులో చెయ్యిపెడితేక్రితం సాయంకాలం మరిచిపోయిన అరవై పైసలు తగిలాయి. ఇరవైపైసలకి టీ త్రాగితే మిగతా పైసలతో బస్సులో ఇల్లు చేరవచ్చునని కూడబలుక్కొని — టీ దుకాణాన్ని వెదుక్కుంటూ నడిచాడు నమశ్శివాయ.

* * *

ఇంతే కథ—

ఇంతకన్నా ఏం రాయడానికీ నా కిష్టంలేదు. ఎంచాతనంటే దీనికి కాళ్లూ చేతులూ కల్పిస్తే కథ కాకుండా పోతుందేమోనని నా భయం.

అందుకని —

ఆ ముందురోజు సాయంకాలం మీనూ, నీలూ అనే స్నేహితురాళ్ళిద్దరూ ఓడలాంటి కారులో కబుర్లు చెప్పుకుంటూ వీధిలోకి వచ్చారనీ,

'ఆడదాని అందానికి తలవంచడం ఎలాంటి మగవాడిలో నయినా కనిపించే బలహీనత' అని మీనూ అంటే—

'అలా తలవొంచినట్లు కనిపించడమే అతని బలం కూడాను' అని నీలూ అన్నప్పుడు – మాటా మాటా పెరిగిందనీ —

ఇరవయ్యో శతాబ్దపు నగరపు సంస్కారంలో పీకలోతు మునిగిన అమ్మాయి మాట దక్కించుకోవాలనే పైశాచికమైన స్వాభిమానం తిరగబడినప్పుడు జరిగిన కార్యక్రమమే ఆ సాయంకాలపు సంఘటన అనీ నేను చెప్పదలచుకోలేదు.


అంతేకాదు —

మర్నాడు యింకా అసక్తి, అకలీ తీరక నమశ్శివాయ దారి వెతుక్కుంటూ ఎంతో శ్రమపడి ఆ యింటికి వెళ్ళినప్పుడు గేటుదగ్గర గూర్ఖా అతి క్రూరంగా, తనకి అర్థం కాని భాషలో అవతలకి పొమ్మన్నాడని, ఇదంతా నాటకంలాగ చూస్తూ ఓడలాంటి కారునీడలో బీడీ కాల్చుకుంటూ డ్రైవరు కూర్చున్నాడనీ, ఆ పోర్టికోలోనే తుపాకీని పాలిష్ చేస్తూ పచార్లుచేస్తున్న బారుమీసాల వ్యక్తిని ఆశ్చర్యంగా చూస్తూ నమశ్శివాయ వెనక్కి తిరిగి వచ్చాడనీ నేను అస్సలు చెప్పను.

□□□

ఒక బ్రిటిష్‌వాడు ఒకసారి రుమాలు పోగొట్టుకున్నాడు. దాన్ని పోగొట్టుకున్నందుకు తన్నుతాను నిందించుకొని, ఈ అజాగ్రత్తకు శిక్షగా, ఐదురోజులు గడ్డం చేసుకోడం మానేసి, అదాచేసిన సొమ్ముతో మళ్ళీ ఒక రుమాలు కొన్నాడు.

అతడు ఇండియాకు రావడం తటస్థించింది. వచ్చిన రోజునే అతనికి ఒక సర్దార్జీ కనబడ్డాడు. అతన్ని నిలవేసి, 'చెప్పండి; మీది టేబిల్ క్లాతో, దుప్పటియో పోయింది కదూ?' అన్నాడు బ్రిటిషువాడు.



ప్రఖ్యాత పత్రికా సంపాదకులైన ముట్నూరికృష్ణారావుగారిని జాతీయోద్యమ సందర్భంలో ఒకసారి అరెస్టు చేశారు. వారిని బందరు జైలునుంచి రాయవేలూరు తీసుకు వెళుతున్నారు పోలీసులు.

విజయవాడలో రైలు మారాల్సి వచ్చింది. కృష్ణారావుగారిని వెయిటింగ్ రూమ్‌లో కూర్చోబెట్టారు. రైలు రావడానికింకా ఒకగంట టైం వుంది. వెంటవున్న కాన్‌స్టేబుల్సు టీ త్రాగి వద్దామని అవతలకు వెళ్ళారు.

వాళ్లు తిరిగి వచ్చేలోపల కృష్ణారావుగారు తలపాగాతీసి వొళ్ళో పెట్టుకొని పత్రిక చదువుకొంటున్నారు. బట్టతల బయటుపడింది.

ఇంతలో కాన్‌స్టేబుల్సువచ్చారు. అటూ ఇటూ పిచ్చిగా చూశారు. "ఎలా వెళ్ళాడీయ్యనగారు" అనుకొంటూ వెతికారు చుట్టుపక్కల. తర్వాత అదుర్దా పడుతూ చెరో వైపూ పరుగెత్తారు.

ప్లాటుఫారాలన్నీ వెతికారు.

ఎక్కడా కనిపించలేదు. వాళ్ళకు ముచ్చెమటలు పోశాయి. మళ్ళీ వెయిటింగ్ రూమ్‌కి వచ్చారు.

సరాసరి కృష్ణారావుగారి దగ్గిరికి వెళ్ళి–'సార్! ఇక్కడో తలపాగా వున్న ఆయన కూర్చున్నాడిందాక! ఎటు వెళ్ళాడో చూశారా?' అని అడిగారు.

కృష్ణారావు లేదు అన్నట్లు చప్పరించారు.

వాళ్ళకు మతిపోయింది. 'కొంప పోయిందిసార్, ఆయన్ని అరెస్టుచేసి తీసుకు పోతున్నాం. ఎరక్కపోయి టీ కోసం వెళ్ళాం. మాకు తప్పదు జైలు' అన్నాడట ఒక కాన్‌స్టేబుల్.

"కంగారుపడకండి. కాంగ్రెసువాది అయితే పారిపోడు"అన్నారుట కృష్ణారావుగారు.

'ఏం వస్తాడు సార్...టైం అయింది' అని వాళ్లు పిచ్చిగా చూస్తున్నారట.

ఇంతలో రైలు వస్తున్నదని గంట కొట్టారుట. కృష్ణారావుగారు వొళ్లో వున్న తలపాగ పెట్టుకొని లేచి నిలబడ్డారట.



"మీరేనా సార్, అనవాలు పట్టలేక పోయాం! తలపాగా తీశారేం సార్" అన్నారుట.

"మీ తెలివితేటలు చూద్దామని– ఇక పదండి రైలు వస్తోంది" అని కృష్ణారావుగారు ప్లాటుఫారంమీదికి నడిచారట.

♦ ♦ ♦

ఒకసారి ఎవరో నిరుద్యోగి కృష్ణా పత్రిక ఆఫీసుకువచ్చి కృష్ణారావుగారికి నమస్కారంచేసి 'ఎక్కడన్నా ఖాళీవుందా కొంచెం?' అని దీనంగా అడిగాడు.

కృష్ణారావుగారు వున్నదన్నట్లు తలవూపారు. ఆ నిరుద్యోగి ఎంతో సంబరంగా "ఎక్కడ?" అని అడిగాడు.

కృష్ణారావుగారు వెంటనే తలపాగ తీసిబల్లమీదపెట్టి బట్టతలచూపించి– "ఇక్కడ" అన్నారు.

ఆ నిరుద్యోగి హతాశుడై అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

—క్విల్.

"అదృష్టం చూసుకోండి బాబూ, అయిదు పైసలకే అదృష్టం!"

దోవంటపోతూ

"ఏంటయ్యా అదృష్టం! అన్ని కార్డులమీదా పట్టింది బంగారమనీ – ధన లాభమనీ–సిరి కలుస్తుందనీ రాసి పెడతావు, ఇందులో ఏముంది?"

"నా అదృష్టం బాబూ, మీ కార్డు మీకు నచ్చేభాషలోవస్తే అది నా అదృష్టంబాబూ."

ప్రేమ

నీవొక అందమైన అసత్యానివి! కాని
నేను ప్రేమించటం చెరగని సత్యం.
నిన్ను పొందటానికి,
ఎన్నో సత్యాల్ని వెచ్చించాను.
జీవితం భరింపరాని కఠిన సత్యమని
తెలిసిననాడు నిన్ను (ఆధారంగా) పరిగ్రహించాను.
నిజంగా నీ లోని ఆకర్షణ ఎంత సత్యం
అననురూప ప్రకృతి సాంగత్యంలో సైతం
అందని అందాన్ని, తృప్తినీ నీలో పొందాను.
ఎంత సున్నితంగా తుడిచావ్ నా విషాదాన్ని!
"లోకం దయలేనిది!" అన్న నిజాన్ని దాచి
నిస్పృహను త్రుంచి, సుధలాంటి సానుభూతి నిచ్చావ్.
అబద్ధానివైనా "నీది కరుణార్ద్ర హృదయం"
అన్నది ఎంత సత్యం...
ప్రపంచంలోని ఎన్నో జీవశక్తుల్లోంచి
ఎన్నుకొని నిన్ను ప్రేమిస్తున్నాను.
యుగాంతం వరకు నిన్ను ప్రేమిస్తుంటాను!
ఎందుకో తెలుసా!
నిన్ను ప్రేమించటంలో నాకు
లభించే ఆనందం ఒక సత్యం...
నీ పదజ్ఞానం నాలో కల్గించే
ఓదార్పు ఒక సత్యం
నీ ఊహలో బ్రతుకులోని కఠినత్వాన్ని
విధురత్వాన్ని నేను మరచిపోవటం
ఒక మధుర సత్యం!
నీ భావ స్పర్శతో నాలో
అభ్యుదయాశయాలు సృష్టింపబడటం
ఒక నగ్న సత్యం.
ఇన్ని సత్యాల సృష్టికి కారణమైన నీవు
ఒక ఆకర్షణీయమైన అసత్యానివైనా,
నిన్ను నేను శాశ్వతంగా ప్రేమించటం
ఒక అచంచల సత్యం!!

— సాలగ్రామ్

చలిమంట

మొదటి బహుమతి :

(రూ. 50/-)

ఐదింటిగంటుకొట్టి గంట అయినా ఇంకా ఆఫీసు కాగితాలతోనే కుస్తీ పడుతున్నారు హెడ్‌మాష్టారు రంగనాథంగారు. ఆ వూరు పెద్ద వూరూ కాదు; అలాగని పల్లెటూరూ కాదు. ఆ వూరి హైస్కూలు హెడ్ మాష్టర్‌గా రంగనాథంగారు నాలుగేళ్ళనుంచీ పనిచేస్తున్నారు. ఊళ్ళో పేరున్న వ్యక్తులలో ఆయనొకరు—

'సార్! విజయలక్ష్మిగారు మీ కీ కవరు యిమ్మన్నారండి" ప్యూను జమలయ్య గొంతువిని తలెత్తి చూశారు హెడ్‌మాష్టారు. అది పెద్ద కవరు! అందులో ఐదు కవర్లు, ఒక చిన్న ఉత్తరం, ఒక పెద్ద తెల్ల కాయితం ఉన్నాయ్.

"సరే! అమ్మగారితో నేను కొంచెం ఆలస్యంగా వస్తానని చెప్పు—నువ్వెళ్ళు" ప్యూను అక్కడ వుండడం శ్రేయస్కరం కాదని కాబోలు బయటికి పంపించారు. మొదటి కవరు మీద "శ్రీ తెలుగు మాష్టారు" అని వుంది. విప్పి చదవడం మొదలు పెట్టారు. అది ప్రేమలేఖ!

ప్రాణసఖీ!

అలనాడు ఇంద్రసభలోని రంభా ఊర్వశుల సౌందర్యమును గూర్చి వినియుంటిని, చదివి యుంటినేగాని నీ రాకతో నా కన్నులకు చూచు భాగ్యముకూడ కల్గినది. ధన్యుడనైతి! నీ రాకకు పూర్వము నాకు "ప్రేమ" యన్నగాని, "పెళ్ళి"యన్నగాని అసహ్యము, ఏవగింపుగా నుండెడిది. నీ రాకతో నా హృదయమునందు ప్రేమ బీజములునాటుకొని; నీమాట విన్నంతనే మొగ్గగా రూపొంది; నీ పలకరింపుతో ఓలకరించి పుష్పించినది. ఇక ఫలరూపము నొందుటయే తదుపరి దశ. దానికి నీ యంగీకారము ఎంతేని అవసరముగదా! కావున నీ అంగీకారముకూడ లభించినచో ఆ కల్యాణ చక్రవర్తి సమక్షమున మన కల్యాణము కాగలదు. త్వరితగతిని నీ సమాధానమును లేఖా పూర్వకముగా తెలుపుము. నీ లేఖ కొఱకు చంద్రుని కొఱకు చాతకపక్షివలె ఎదురు చూచుచూ యుందును.

నీ వాడు

సుబ్రహ్మణ్య శర్మ.

ఇడియట్ అని తెలుగు మాష్టార్ని దీవిస్తూ, రెండో కవరు లోంచి ఉత్తరం తీశారు రంగనాథం

"జ్యోతి" చిన్న కథల పోటీ

గమనిక: ఒక మార్పు

కళాశాలల, విశ్వవిద్యాలయాల విద్యార్థినీ విద్యార్థులకు రచనా ప్రోత్సాహమిచ్చే ఆశయంతో 1965 దీపావళి సంచికనుంచి "జ్యోతి" సుచిత్ర మాసపత్రిక చిన్న చిన్న కథలపోటీ నిర్వహిస్తున్నది. మాకు నెల నెల వచ్చే కథల సంఖ్యనిబట్టి (సగటున ఆరు వందలు) ఈ శీర్షిక స్టూడెంట్స్‌ను ఎంతగా ఆకర్షించిందో గ్రహించవచ్చు.

రెండేళ్ళు దాటినవి కనుక ఈ శీర్షికలో ఒక మార్పు చేయడం సముచితమని భావిస్తున్నాము. ఇదివరకు వలెనే కాలేజీ, యూనివర్సిటీ స్టూడెంట్సుకు ఈ శీర్షిక పరిమితమై వుంటుంది. కాని, మూడు బహుమతులు కాక ఒకటే, 50 (యాభై) రూపాయల బహుమతి. కథ నిడివి మూడు పేజీలకు పరిమితం కాబోదు. ఎంతైనా వుండవచ్చు. కాని, మాసపత్రిక లిమిటేషన్స్‌నుబట్టి "జ్యోతి"లో ఏడెనిమిది పేజీలకు మించకుండా వుండడం మంచిది. కథ మౌలికమైనదిగా వుండాలి. ప్రతినెల ఒకటవ తేదీవరకు వచ్చిన రచనలలో ఉత్తమమైనదాన్ని ఆ పై నెల బహుమతికి, ప్రచురణకు స్వీకరిస్తాము. నిరాకరించిన రచనలు త్రిప్పి పంపబడవు. స్టాంపులు అంటించ నవసరంలేదు. ఈ విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశంలేదు. సంపాదకులదే తుది నిర్ణయం. మిగతా షరతులు మామూలే.

ఈ మార్పు ఏప్రిల్ సంచిక నుంచి వర్తిస్తుంది. అంటే ఫిబ్రవరి 1 నుంచి మార్చి 1 వ తేదీ వరకు వచ్చిన రచనలను ఈ మార్పు దృష్టితో పరిశీలిస్తాము. కథ పరిమితిని పెంచడంవల్ల రచనల స్థాయి కూడా పెరగగలదని, విద్యార్థినీ విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని, దీన్ని విజయవంతంగా నిర్వహించడంలో సంపాదకులకు సహకరించగలరని ఆశిస్తున్నాము.

— మేనేజింగ్ ఎడిటర్,
"జ్యోతి"

గారు. దానిమీద 'శ్రీ సోషల్ మాష్టారు' అని వుంది.

డియర్ విజయా!

నిన్ను చూసిన రోజునే-కాదు-నీకీవూరు బదిలీ అయిందని తెలిసిన రోజునే-భారతదేశంయొక్క ఎల్లలు మర్చిపోయానంటే నమ్మవేమో! బంగాళాఖాతం మొదలుకొని బొంబాయివరకు ఎక్కడ చూచినా నువ్వే కనపడుతున్నావ్!

క్లాసులో పిల్లలకి, పాఠాలకి తిలోదకాలు యిచ్చేశాను. ఎంతసేపూ నిన్ను గురించే ఆలోచన. నువ్వూ, నీ అందం తప్పితే నా కళ్ళకి ఏమీ కనుపించటంలేదు. అబ్బ! నువ్వు ఎంత అందంగా ఉంటావో నీకు తెలుసా విజయా?

తాజ్‌మహల్‌కన్నా - దాల్‌లేక్‌కన్నా నువ్వే అందంగా ఉంటావ్! నిజంగా! నిన్ను చూస్తూవుంటే; తుగ్లక్‌నై పోతానేమోనని నాకు భయంగాకూడా వుంది - అంత అందంగాఉన్నావ్! మరినిన్నుప్రేమించటంలో నా తప్పేముందీ? నిన్ను చూస్తే... పెళ్ళాన్ని వదిలిన బుద్ధుడు కూడా, బుద్ధిమార్చుకుని నిన్ను పెళ్ళి చేసుకుంటాడు.

ఇకపోతే—మిగిలింది నీ యాక్సెప్టేషన్. నువ్వుకూడా అంగీకరిస్తే మనిద్దరం మద్రాసుపోయి రిజిష్టర్ మారేజ్ చేసుకుందాం. వెంటనే సమాధానం యిస్తావ్ కదూ!—

నీ
రాజశేఖర్.

'ఫూల్ - ఉట్టి రోగ్' అనే సర్టిఫికేట్ సోషల్ మాష్టారుకిచ్చి మూడో కవరుమీదికి దృష్టి సారించారు రంగనాథంగారు. దానిమీద 'శ్రీ లెక్కల మాష్టారు' అని వుంది.

'అరే! ఒకే అమ్మాయికోసం యింతమందా!' అని కొంచెంసేపు ఆశ్చర్యపోయి — 'అయినా అందం అలాంటిది' అని సర్దిచెప్పుకుని—సర్దుకు కూర్చున్నారు రంగనాథంగారు. మామూలుగానే మూడో ఉత్తరంకూడా విప్పారు.

మైడియర్ విజ్జీ!

ఒకటి, ఒకటి కలిస్తే రెండుకాదు, అన్నా ఒప్పుకుంటాను—

అరుపదులు తొంభైనాలుగు అన్నా ఒప్పుకుంటానుగానీ—

'నువ్వు ఏమంత అందగత్తెవు కావు' అని నిన్ను ఎవరైనా ఎప్పుడైనా, ఎక్కడైనా సరే-అన్నారంటే మాత్రం నేను ఒప్పుకోను సరికదా-వాళ్ళని నేనేం చేస్తానో నాకే తెలియదు.

ఈ దేశంలోని ఏభైకోట్ల జనాభాలో నీలాంటి అందమైనదాన్ని-నా రెండు కళ్లూ చూడలేదని లక్ష సార్లు చెప్పినా నువ్వు నమ్మాలి! నిజంగా నువ్వంతఅందంగా వుంటావ్ విజ్జీ!

యం. యస్. యన్. శేష
బి. కామ్., 2వ సంవత్సరం,
డి. ఎ. ఆర్. కాలేజి,
నూజివీడు.

నారూము దగ్గర్నించీ-ఈస్కూలు దాకా - అంటే మైలున్నర దూరం పావుగంటలో నడచి వస్తున్నానంటే నా వేగాన్ని నువ్వు అర్థం చేసుకోవాలి. అంత తొందరగా ఎందుకు వస్తున్నానంటావ్? నిన్ను చూడాలనే తహతహ-ఆతురత. నీ ప్రేమకోసం ఏదైనా చేయగలను. చెప్పు! ఏం చెయ్యమంటావ్? ఒక్కటికాదు విజ్జీ! వెయ్యిచెప్పు - లక్ష చెప్పు. చేస్తాను నీ కోసం! నాకు కావలసింది అదే-నీ ప్రేమ-నువ్వు!

వెంటనే సమాధానం యిస్తావ్ కదూ!

నీ
శత కోటిలింగం.

"ఇతడొక ఫూల్ - తొందఱలో ట్రాన్స్‌ఫర్ చేయించాలి" అనుకుంటూ నాలుగో ఉత్తరాన్ని అందుకున్నారు రంగనాధంగారు. దాని మీద "శ్రీ సైన్సు మాష్టారు" అని వుంది.

ప్రియమైన విజయా!

పూర్వం నా హృదయం "ఉక్కు" లాగ గట్టిగా ఉండేది. కాని నిన్ను చూసినరోజునే అది "అభ్రకం"గా మారిపోయింది.

అది నా తప్పుకాదు-! వెండిలా ధగధగ మెరిసిపోయే బంగారం లాంటి నీ శరీరం చూసిం తర్వాత-దానికోసం అర్రులు చాచనివాడు వెధవ! మగవాడుకాదు. అందుకే నిన్ను ప్రేమించాను. నాప్రేమ స్వచ్ఛమైనది. నువ్వుకూడా అంగీకరిస్తే దానికి రంగు, రుచి, వాసనా వస్తాయ్! అపుడు అది నీలో కరుగుతుంది. నువ్వు తప్పక ఒప్పుకోవాలి.

అప్పటిదాకా అది నా గుండెని మండిస్తూ-అది మండుతూ వుంటుంది. నువ్వు తిరస్కరిస్తే అది ఆరిపోతుంది. అలా జరగకూడదువిజయా! ఏమైనా సరే! నీ ప్రేమ నా ప్రేమతో సంయోగం చెందాలి—అప్పుడు అది మిశ్రమం అవుతుంది—అంటే మన పెళ్ళి అవుతుందన్నమాట. నువ్వు నా ప్రేమని అంగీకరిస్తావనే ఆశతో వ్రాస్తున్నాను. నువ్వు తిరస్కరిస్తే నేను బ్రతుకలేను. అనాడు ఏ పొటాషియం సైనేడో తాగి చచ్చిపోతాను. లేకపోతే ఏ **2H0** లేని—సారీ—ఏ నీళ్ళు లేని నూతిలోనో దూకి చచ్చిపోతాను.

నన్ను అర్థం చేసుకొని నాప్రేమని అంగీకరిస్తావ్ కదూ!

అన్నట్టు — నేనుయాటంబాంబు ఫార్ములాని కొత్త విధానంలో రిసెర్చి చేస్తున్నాను. అది పూర్తయ్యిందంటే, మనిద్దరం ఏ రష్యాయో అమెరికాయో పోదాం-ఏం?

నీ
ద్రావకరావ్.

"వీడికి ఫార్మాలిటీసే తెలియవ్—ఫార్ములా ఒకటా వీడి మొహానికి" అనుకుంటూ ఐదో ఉత్తరాన్ని చేతిలోకి తీసుకున్నారు రంగనాధంగారు. దాని మీద "శ్రీ డ్రాయింగ్ మాష్టారు" అనివుంది.

"అరె! ఇతడికికూడా కావలసి వచ్చిందా—ప్రేమ" అనుకుంటూనే విప్పారు రంగనాథంగారు.

నా సజీవ శిల్పసుందరికి,

నిన్ను చూసిన మొదటి రోజున నా చేతుల్లోంచి జామెట్రీ బాక్స్ క్రిందపడటం - నువ్వు గమనించే ఉంటావ్! నీ అంత అందమైన విగ్రహాన్ని యింతవరకు చూడకపోటం—జామెట్రీ బాక్స్ క్రింద పడటానికి కారణం కావొచ్చు—కావచ్చు ఏమిటి? అదే కారణం. నిజం సుందరీ! నిన్ను చూస్తూవుంటే నా కళ్ళు చెదిరిపోతాయ్-నా చేతులూ కాళ్లూ వణికి పోతాయ్-అసలు నా మతే పోతుంది. పోతుంది ఏమిటి? పోయింది—నా మతి పోయింది.

మొన్న క్లాసులో ఏం జరిగిందో తెలుసా? పిల్లలతో కోతిబొమ్మ వేసుకోమని చెప్పి, బోర్డుమీద కుక్క బొమ్మ వేశాను. మునసబుగారబ్బాయ్ తన బొమ్మ వెయ్యమని అడిగితే-సరేనని - బోర్డుదగ్గరికి వెళ్ళి కోతిబొమ్మవేశాను. దాంతో వాడు వెళ్ళి వాళ్ళ నాన్నతో చెప్పడం—వాళ్ళ నాన్న నన్నుపిల్చి పాఠం చెప్పడం-అన్నీ జరిగిపోయాయ్! ఇదంతా నీ మూలంగానే జరిగింది.

నీ మీద నాకు భలే కోపంగా ఉందిలే! అయినా...నీకు నేను చెప్పందే ఎలా తెలుస్తుంది? అందుకే వ్రాస్తున్నాను.

నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నీ ప్రేమకోసం తపిస్తున్నాను. పరితపిస్తున్నాను. వెంటనే నీ అంగీకారం తెలుపుతూ ఉత్తరం వ్రాస్తావు కదూ!—

నీ
హనుమంతు.

"ఇతడికంటే, ఇతడు వేసిన కోతి బొమ్మే బాగుంటుంది" రంగనాథంగారు అనుకుని—ఒక వేడి నిట్టూర్పు విడిచారు. టైము ఏడు గంటలు కావస్తోంది.

ఐదు కవర్లూ అయిపోయాయ్. ఇక మిగిలినవి-చిన్న ఉత్తరం-మడిచిన తెల్లకాయితం. మొదట చిన్న ఉత్తరాన్ని విప్పారు రంగనాథంగారు.

గా॥ హెడ్‌మాష్టారుగార్కి,

చూశారుగా! ఈ సంఘంలో స్త్రీకి ఎంతటి విలువవుందో నా కిప్పుడిప్పుడే అర్థం అవుతోంది. పొట్టకూటికోసం ఎందరో ఆడవాళ్ళు ఉద్యోగాలు చేస్తున్నారు.

ఇలాంటి వాళ్ళని ధైర్యంతో ఎదుర్కొనే ఆడవాళ్లూ వుంటారు. కాని నాకు అంతటి గుండె ధైర్యం, గుండె నిబ్బరంలేవు. దురదృష్టవంతురాల్ని! ఇక పోతే—మీరు చెయ్యవల్సింది-చెయ్యగలిగింది ఒక్కటే—అదే నా రాజీనామాని అంగీకరించడం.

కృతజ్ఞురాల్ని.
మీ విధేయురాలు
వి. విజయలక్ష్మి.

పి. యస్ : మీకు పంపించిన ఈ ఉత్తరా లన్నింటినీ దయచేసి తగలబెట్టండి. ఇలా మీకు పంపించినట్లు ఎవరికీ చెప్పకండి. అందులో ఎవరితప్పూలేదు. కాలంఅటువంటిది. చలికాలంలో చలిమంట దగ్గర చలి కాచుకోవాలనుకోడం లోకధర్మం. దయచేసి ఆ ఉత్తరా లన్నిటినీ తగులపెట్టండి.

రాజీనామా కాయితాన్ని ఫైల్లో గుచ్చి, కుర్చీలోంచి లేచారు రంగనాథంగారు. విజయలక్ష్మి కోరిన ప్రకారం — ఉత్తరాలన్నీ తీసుకుని గ్రౌండులోకి నడిచారు. కోటు జేబులోంచి అగ్గిపెట్టెతీసి—అన్ని ఉత్తరాలు ఒకచోటపేర్చి - అగ్గిపుల్లగీసి అంటించారు.

మండించే కోరికల కాయితాలు మండుతున్నాయ్!

ఎందుకో నవ్వుకున్నారు రంగనాథంగారు.

ఒక నిమిషం ఆలోచించి - తల పంకించి "ఇంకానయం! నేనుకూడా యిచ్చేశానుకాదు" అని పైకే అని, తన జేబులోనుంచికూడా ఒక కవరు తీసి మండే మంటలో పడేశారు—గౌరవనీయులు రంగనాథంగారు.

□□□

లేత మనసు

ద్వితీయ బహుమతి
(రూ. 25/-)

నాంచారి మా యింట్లో పనిమనిషిగా కుదిరి యేడాది కావస్తున్నది. పాపం దానిదో విషాదగాథ! అది మనకు అప్రస్తుతంగాని, మొత్తమ్మీద మొగుడేలుకోకుండా లోకం మీదకి వదిలాడు. దాని కష్టాలు చాలవో! అన్నట్లు రెండేళ్ళ కొడుకుకూడా దానికొంగుకు శాపం లాగ తగులుకున్నాడు. గడవాలిగా మఱి! ఆ యింటా ఈ యింటా వూడిగం చేసుకుంటోంది. కాలు సాగినప్పటినుండి, పిల్లడు వదలి వుండడంలేదని వాడినికూడా తనతో పాటు తీసుకురావడం మొదలుపెట్టింది. వాఁడు అలాగే దాని కొంగు పట్టుకు తిరుగుతూ పనులకు అడ్డాలు వస్తూ, కేకలేస్తే, యిల్లెగిరేలాగు రాగాలు తీస్తూ ఏదో కాలక్షేపం అయిపోయాడు మా యింట్లో.

ఇక మా యింట్లో సంగతి. మా అన్నయ్య బి. కామ్., చెల్లాయ్ ఎస్సెల్సీ మా నాన్నగారు, ఊరిలో సవాలక్ష గౌరవ పదవులు. దానితో ఉదయం వూడ్చిన యిల్లు రాత్రయేసరికి "సరస్వతీ సముద్రం"గా తయారయేది. అందుచేత, డాసీదానిచేత కసవు చిమ్మేటప్పుడు కాగితాలన్నీ ఒకమూల జాగ్రత్త చేయించి వాటిని ఎవరమో ఒకరం తనిఖీచేసి, వాటిని పారవేయించడం రివాజయింది.

ఒకనాడు, ఈ యేడ్చే రాగాలు తీసే గుంటడికి ఏదయినా పనిచెపితే ఊరుకుంటాడేమోనని మాఅన్నయ్య వాడిని పిలిచి, ఒరే! ఏ కాగితం కనుపించినా తనకో, నాకో ఇమ్మని చెప్పాడు. ఇక ఆరోజునుండి వాడు "యువర్ మోస్ట్ ఒబీడియంట్ సర్వెంట్" లాగు పొట్లాలకాగితాల దగ్గరనుండి మాకు చేరవేయడము మొదలుపెట్టాడు. ఒక్కోసారి మాఅన్నయ్య వీడికి ఈపని యెందుకు చెప్పానురా దేవుడా! అని వాడిపైన విసుక్కుంటూ, నూటికోసారి దేవుడిని తలచేవాడు. అసలిప్పుడు వాడు మానమన్నా మానే స్థితిలో లేడు.

పనంతా అయిన తరువాత ఇంట్లోచెప్పి వెళ్ళిపోవడం పరిపాటి. ఒకనాడు, అది యింటికి వెళ్ళిపోయే సమయానికి తల్లీకొడుకు కీచులాడుకుంటున్నారు. వాడేదో మారాం చేస్తున్నాడు. దాన్ని గుంజుతూ నానా హంగామా చేస్తున్నాడు. చివరికి అది వాడిని అదలించింది. తప్పనిసరయి రెండు అంటించింది. (దెబ్బలు సుమా!). ఈ గోలంతా చూస్తున్న నేను ఏమిటీ! గొడవని అడిగాను. ఏమీలేదంది. వాడినే, కాసిని మరమరాలు పెట్టి, బుజ్జగించి ఏమిట్రా అని అడిగాను.


'కాతం' అన్నాడు. వాడి భాషకు ఈమధ్యనే అలవాటు పడ్డాముకనుక ఏంకాగితం అన్నా. ఔను, ఔనంటూ తలూపాడు, నాకు నవ్వొచ్చింది. వీడేదో కాగితాల పిచ్చిసూరయ్యల్లే తయారయేలా వున్నాడని. మళ్ళీ రెట్టించి అడిగితే వాళ్ళమ్మ నడికట్టు చూపుతూ "కాతం ఈతల్లా" అన్నాడు. ఏమన్నా నాంచారమ్మ తల్లి బొడ్లో దోపిందేమోనని అనుమానించి కాస్త దాన్ని దబాయించాను. అప్పటికీ ఏమీ ఎరగనన్నది. నిజం చెబుతావా? పోలీసుల్ని పిలవమన్నావా? అని ఫోన్ ఎత్తాను. గబుక్కున బొడ్లోంచి పది రూపాయల కాగితం తీసి క్రింద పడేసి కాళ్ళు పట్టుకుంది. ఏమిటే ఈ అఘాయిత్యం అంటే, "ఎప్పుడూ ఎరగనమ్మగారూ, బుద్ధి గడ్డితిని, ఈపని చేశాను. బగవంతుడు మంచి శాస్తే చేశాడు" అని అఘోరించింది. దాని వాలకం చూస్తే అరితేరిన దానిలా కనుపించలేదు, అమాయకమ్మనిషిలానే వున్నది ఇంతలో అందరూ ఇంట్లోంచి వచ్చేశారు. అసలు జరిగింది చెప్పమన్నాం.

"ఏం లేదమ్మగారూ! ఊడుస్తూంటే, ఈపొద్దు ఏలబట్టల దండెం కాడ పది కాయితం కాపడింది. మా అబ్బిగాడు గబాలున అది తీసుకున్నాడు, మీకియ్యాలని. అడ ఎవరూ లేరుగందా అని నేను ఆడిదగ్గర్నుంచి లాక్కున్నాను. ఆడు మీకియ్యాలని గొడవ సేత్తానే వున్నాడు. పోయేతప్పుడు ఇయ్యొచ్చులేరా అన్నాను. ఇప్పుడు నా దుంపతెంపినాడు" అని ముగించింది. దాన్ని అందరం తలకొకసారి నామావళి చదివి, ఇలాంటి పనులెప్పుడూ చేయొద్దని బుద్ధిచెప్పాం.

ఆ రాత్రి మా నాన్నగారికీ విషయం తెలిసింది. ఆయన ఈ సంగతి విని "ఏ అంతస్తులో పుట్టినా లేత మనసు, లేత మనసే—

నిజంగా వాడే కనుక అదే పద్ధతిలో పెంచబడితే నిజాయితీగల వ్యక్తి అయి తీరుతాడు నాంచారితో చెప్పు, వాడి ఉద్యోగం మనింట్లో అడ్వాన్స్ బుకింగ అయిందని. ప్రస్తుతానికి మటుకు ఈ కథానాయకునికి ఒకలాగూ, చొక్కా శాంక్షన్ చేశా"మని నవ్వుతూ ముగించారు.

ఆర్. అనసూయ
బి. ఏ. తృతీయ
ఆంధ్ర జాతీయ కళాశాల
మచిలీపట్టణము.


ఆజమ్ ఆర్ట్స్
తల్లిప్రేమ
నిర్మాత: M. ఆజేమ్ * దర్శకత్వం: శ్రీకాంత్
రచన: భమిడిపాటి రాధాకృష్ణ
సంగీతం: సుదర్శనం
ఛాయ: బాలకృష్ణ
నిర్వహణ: రాధాబాబు
GOTETI
“పూర్ణా రిలీజ్”